www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 18-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 333

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 10.51 తదుపరి దశమి; నక్షత్రం: ఆర్ద్ర సా. 6.12 తదుపరి పునర్వసు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12.48-1.36, మ.3.11 తదుపరి 3.59; అమృతఘడియలు: ఉ.7.37-9.18; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.25; సూర్యాస్తమయం: 6.23

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

ఉదయం 9.30కు ప్రారంభం.. 5 నిమిషాల వరకు విద్యార్థులకు గ్రేస్‌టైం

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా, ఇంటర్ పరీక్షల సమయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న నిమిషం ఆలస్యమైనా సరే

మిగతా 14వ పేజీలో...



మా సెంటర్ ఎక్కడ?

టెన్త్ హాల్‌టికెట్‌లో పరీక్ష కేంద్రం చిరునామాలో తికమక

హైదరాబాద్‌లో కొందరు విద్యార్థుల అవస్థలు 14



డీహెచ్‌పై విచారణ?

అవినీతి ఆరోపణలతో ప్రభుత్వ నిర్ణయం

వైద్య శాఖ సమూల ప్రక్షాళనకు చర్యలు

పలు వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధన ఆస్పత్రుల సూపరింటెండెంట్ల మార్పు

ఎంఎన్‌జే ఆస్పత్రి డైరెక్టర్‌కు స్థానచలనం

ఉస్మానియా ఆస్పత్రికి కొత్త ప్రిన్సిపాల్

పలువురు డీఎంహెచ్‌వోల బదిలీ

అమ్యామ్యాలతో ఆగిన కొందరు!

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రేవంత్ సర్కారు వైద్య ఆరోగ్య శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ప్రజారోగ్య సంచాలకుడి(డీహెచ్)గా ఉన్న రవీంద్ర నాయక్‌కు డబ్బులు ఇచ్చినట్టు ఓ ఉద్యోగిని ఆరోపణల నేపథ్యంలో ఆయనపై రిటైర్డ్ ఐఏఎస్‌తో విచారణ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే గత ప్రభుత్వ హయాంలో విభాగాధిపతులుగా వచ్చిన వారిని సాగనంపుతోంది. పలు మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లను మార్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఆ పోస్టుల నుంచి తప్పిస్తోంది. ఇప్పటికే కొత్తగూడెం బోధనాస్పత్రి

మిగతా 14వ పేజీలో...

గేట్లు ఎత్తినం!

వంద రోజులు పూర్తిగా పాలనకే.. ఇక నా రాజకీయం చూపిస్తా



సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో పార్టీలో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ రంజిత్‌రెడ్డి

కుట్రలను తిప్పికొట్టాలంటే కఠినమైన నిర్ణయాలు తప్పవు

విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన నోటీసు సరికాదు

కేసీఆర్ నాటిన గంజాయి మొక్కలను ఏరిపారేస్తున్నాం

ఈఆర్‌సీ చైర్మన్ ఇంటి పేరు తన్నీరు ఉన్నంత మాత్రాన.. ఆయన పన్నీరు అనుకోవద్దు

కేసీఆర్, నిజాం ఇద్దరి తీరు ఒక్కటే.. పేర్లు మాత్రమే వేరు

రాష్ట్ర ప్రజలపై రూ.9 లక్షల కోట్ల అప్పుల కుంపటి పెట్టారు

ప్రవీణ్‌కు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఇస్తామన్నా అంగీకరించలే

జీఎస్టీ రాబడి పెరుగుతోంది.. సంక్షేమానికి ఖర్చు చేస్తం

గ్రేటర్‌లో 4 సహా 14కు పైగా ఎంపీ సీట్లు గెలుస్తాం

టీయూడబ్ల్యూజే 'మీట్ ది మీడియా'లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులకు తాము కూడా గేట్లు ఎత్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఒక సిటింగ్ ఎమ్మెల్యే, సిటింగ్ ఎంపీ గేటు తెరుచుకొని వచ్చేశారని, అవతలి వైపు ఖాళీ అయ్యేదాకా ఇలాగే ఉంటుందని అన్నారు. వంద రోజులు మంచి పరిపాలన అందించామని, ఎవరొచ్చినా చేరికల దాకా పోకుండా పరిపాలనకే పరిమితమయ్యామని చెప్పారు. కానీ, ప్రతిరోజూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని పడగొడతామంటూ కుట్రలు చేస్తున్నారని, ఆ కుట్రలను తిప్పి కొట్టాలంటే కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఆదివారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన

మిగతా 13వ పేజీలో...

కాంగ్రెస్‌లో చేరిన దానం, రంజిత్‌రెడ్డి

కండువా కప్పిన రేవంత్, దీపాదాస్

సికింద్రాబాద్, చేవెళ్లలో ఎంపీలుగా పోటీకి నిలిపే చాన్స్! 13

బీఆర్ఎస్‌ను వీడిన తొలి ఎమ్మెల్యే

మల్కాజిగిరి నుంచి సునీతారెడ్డి?

మండలిలో చీఫ్ విప్‌గా ఆమె భర్త పట్నం మహేందర్‌రెడ్డి!



రాజ్యాంగాన్ని మార్చే దమ్ము బీజేపీకి లేదు

ఆ పార్టీదంతా హడావుడే.. ప్రజలు, న్యాయం మావైపే

ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ లేకుండా.. ప్రధాని మోదీ ఎన్నికలకు వెళ్లలేరు

56 అంగుళాల ఛాతీ కాదు.. మోదీ ఓ డొల్ల మనిషి

2 పార్టీల మధ్య పోరాటం కాదు.. సిద్ధాంతాల సమరం

బీజేపీది కేంద్రీకృత పాలన.. మాది వికేంద్రీకరణ

వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాలని ఈసీఐని కోరాం

కానీ, మా విజ్ఞప్తులను పట్టించుకోలేదు

ఐఐటీయన్ కంటే రైతు తెలివి తక్కువ వాడేం కాదు..!

భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపులో రాహుల్

ముంబై, మార్చి 17: బీజేపీదంతా హడావుడేనని.. రాజ్యాంగాన్ని మార్చేంత దమ్ము ఆ పార్టీకి లేదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రజలు, న్యాయం తమవైపే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్నది రెండు పార్టీల మధ్య పోరాటం కాదని, సిద్ధాంతాల సమరమని వ్యాఖ్యానించారు. ఓ వ్యక్తికి అన్నీ తెలిసినట్లుగా చూపుతూ కేంద్రీకృత పాలన సాగించాలనేది బీజేపీ విధానం అయితే, దీనికి పూర్తి భిన్నంగా తమది వికేంద్రీకరణ విధానమన్నారు. ప్రజల గొంతు వినాలని భావిస్తామని తెలిపారు. పార్లమెంటులో తమకు మూడొంతుల మెజారిటీ ఉంటే రాజ్యాంగాన్ని మార్చేస్తామంటూ బీజేపీ నేత అనంత్ హెగ్డే

మిగతా 12వ పేజీలో...

కవితపై ప్రశ్నల వర్షం!

ఢిల్లీ మద్యం విధాన రూపకల్పనలో ఆమె పాత్ర, ముడుపులపై విచారణ

కవితను సుదీర్ఘంగా ప్రశ్నించిన ఈడీ

స్పష్టత రావాల్సిన అంశాలపై ఆరా

కవితతో భర్త అనిల్, కేటీఆర్, హరీశ్ భేటీ

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితురాలిగా ఉన్న కవితను ఏడు రోజుల కస్టడీకి తీసుకున్న ఈడీ.. దర్యాప్తులో భాగంగా తొలిరోజు ఆమెను సుదీర్ఘంగా విచారించింది. ఆదివారం ఉదయం పది గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. ఈడీ డిప్యూటీ డైరెక్టర్ భాను ప్రియ మీనా నేతృత్వంలో అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. మద్యం కుంభకోణానికి సంబంధించి స్పష్టత రావాల్సిన అంశాలపై ఆమె నుంచి సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఇతరులు ఇచ్చిన వాంగ్మూలాలపై కవితను వివరణ కోరినట్లు సమాచారం. అలాగే.. ముడుపులు ఎలా చేతులు మారాయన్న అంశంతో పాటు ఢిల్లీ మద్యం విధానం రూపకల్పనలో ఆమె పాత్రపై ఈడీ ప్రశ్నలు సంధించినట్లు

మిగతా 14వ పేజీలో...



కేజ్రీవాల్‌కు మళ్లీ సమన్లు

రెండు కేసుల్లో విచారణకు రావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశం

కొత్తగా ఢిల్లీ జల్ బోర్డు అంశం 12

ఆయనను అరెస్టు చేసి ప్రచారానికి దూరంగా ఉంచే కుట్ర.. ఆప్ ఆరోపణ



ఏపీలోని బొప్పూడి సభకు భారీగా హాజరైన జనం; అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్

అవినీతి సర్కారును అంతమొందించండి

పొరపాటున కూడా వైసీపీ వ్యతిరేక ఓటును చీల్చొద్దు

జగన్, కాంగ్రెస్ ఒక్కటే.. చాలా తెలివిగా మిలాఖత్

ఏపీలో, ఢిల్లీలో ఎన్డీయే ఉంటేనే అభివృద్ధి, సంక్షేమం

'టీడీపీ-జనసేన-బీజేపీ' అభ్యర్థులనే గెలిపించండి

ఏపీ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

కోటప్పకొండలోని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడి ఆశీర్వాదం లభించింది. మూడోసారి అధికారంలోకి వస్తాం. దేశాభివృద్ధి కోసం మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటాం. 'అభివృద్ధి ఏపీ'ని సాధిస్తాం. ఏపీలో మంత్రులు అవినీతి చేయడంలో పోటీ పడుతున్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి కోసం మీరందరూ ఎన్డీయేకు ఓటు వేయాలి!

- ప్రధాని మోదీ

కుప్పకూలిన రాష్ట్రాన్ని కలిసి నిలబెడతాం

కక్ష, విధ్వంసం, అవినీతికి జగన్ పర్యాయ పదం

ఆయనకు ఓటేయొద్దని సొంత చెల్లెళ్లే చెబుతున్నారు

ఎన్డీయే గెలుపు ఖాయం.. ఎవరూ ఆపలేరు: బాబు

కూటమిదే పీఠం

మోదీ రాక.. ఎన్డీయే పునఃకలయిక

5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు ఆనందం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ 3

మన గెలుపు ఖాయం!

రాష్ట్రంలో వేవ్ ఉంది.. ప్రజాగళం సభ తర్వాత బాబు, పవన్‌తో మోదీ వ్యాఖ్య



మంగమ్మ (ఫైల్)

భారతమ్మ (ఫైల్)

గుండెపోటుతో అత్త.. ఆమె మరణాన్ని తట్టుకోలేక కోడలి మృతి

గంటల వ్యవధిలో ఇద్దరి మరణం

యాదాద్రి జిల్లాలో ఘటన 14

ఆ ఒక్కటీ తప్ప..

యునిక్ నంబర్ లేకుండా మరోసారి ఎన్నికల బాండ్ల సమాచారం

ఈసారి రాజకీయ పార్టీలు ఇచ్చిన వివరాలు వెల్లడించిన ఈసీ

బీజేపీకి రూ.6,986.5 కోట్లు.. టీఎంసీకి రూ.1,397 కోట్లు

కాంగ్రెస్‌కు రూ.1,334 కోట్లు.. బీఆర్ఎస్‌కు రూ.1,322 కోట్లు

ఏపీలో వైసీపీకి రూ.442.8 కోట్లు.. టీడీపీకి రూ.181.3 కోట్లు

దాతల వివరాలనూ వెల్లడించిన డీఎంకే, అన్నాడీఎంకే, జేడీఎస్

మేఘా బాండ్లు.. డీఎంకేకి రూ.105 కోట్లు, జేడీఎస్‌కి 50 కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 17: ఎన్నికల బాండ్లకు సంబంధించి రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టుకు గతంలో సీల్డ్ కవర్లలో సమర్పించిన వివరాలను.. ఎన్నికల కమిషన్ ఆదివారం తన వెబ్‌సైట్‌లో పెట్టింది. అయితే, ఈసారి కూడా ఇంతకుముందులాగానే యునిక్ నంబర్ లేకుండా వాటిని వెల్లడించడం గమనార్హం. ఈ వివరాలతో ఏ పార్టీకి ఎన్ని విరాళాలు వచ్చాయో తెలుస్తుందిగానీ.. ఆ విరాళాలు ఎవరిచ్చిందీ తెలిసే అవకాశం లేదు. ఆయా పార్టీలు సుప్రీంకోర్టుకు ఇచ్చిన వివరాల ప్రకారం.. బీజేపీ అందుకున్న మొత్తం ఎలక్టోరల్ బాండ్ల విలువ రూ.6,986.5 కోట్లు. అందులో దాదాపు రూ.2,555 కోట్లు 2019-20లో పొందినవే. టీఎంసీ పార్టీ అందుకున్న బాండ్ల విలువ రూ.1,397 కోట్లు. బీజేపీ తర్వాత అత్యధికంగా

మిగతా 12వ పేజీలో...





కాళోజీ హెల్త్ వర్సిటీకి సుస్తీ!

నిర్వహణను గాలికొదిలేసిన గత ప్రభుత్వం

150 పోస్టులకు 20 మందే విధులు

రిటైర్డ్ ఉద్యోగులకు పునరావాస కేంద్రం

3 శాఖల్ని కంట్రోల్ చేస్తున్న దంతవైద్యుడు

తొమ్మిదేళ్లుగా వర్సిటీకి ఒక్కరే వైస్‌చాన్స్‌లర్

అంబుడ్స్‌మన్ లేకపోవడంతో వర్సిటీని డిఫాల్ట్‌లో పెట్టిన యూజీసీ

వరంగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి సమస్యల సుస్తీ చేసింది. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాల్సిన యూనివర్సిటీయే సమస్యలకు కేరాఫ్‌గా మారింది. ప్రధానంగా యూనివర్సిటీని సిబ్బంది కొరత వేధిస్తుండటంతో పరీక్షల

మిగతా 14వ పేజీలో...

ఢిల్లీలో వ్యాపారం.. లావాదేవీలు..

ఇక్కడ ఆందోళనలా?

మద్యం స్కాంలో కవిత అరెస్టుతో రాష్ట్రానికి, బీజేపీకి ఏం సంబంధం?

గ్యారెంటీలపై కాంగ్రెస్‌ను వెంటాడతాం

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

నేడు జగిత్యాలలో ప్రధాని మోదీ సభ

హైదరాబాద్/సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): "అక్రమ మద్యం వ్యాపారం ఢిల్లీలో జరిగింది. బినామీల ద్వారా డబ్బులు చేతులు మారాయి. కుంభకోణం అక్కడ జరిగితే.. తెలంగాణలో ఆందోళనలు చేయడం ఏంటి..? లిక్కర్ స్కాంలో కవిత అరెస్టయ్యారు. ఆ వ్యవహారంతో తెలంగాణకు, బీజేపీకి ఏం సంబంధం..?" అని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం సోమాజిగూడలోని హోటల్ కత్రియా టవర్‌లో జరిగిన 'అడ్వొకేట్స్ మీట్'లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 'తెలంగాణ ప్రశ్నిస్తోంది' పోస్టర్, వెబ్‌సైట్‌ను ఎంపీ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు తదితరులతో కలిసి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను ముఖ్యమంత్రి అయితే ముందుగా

మిగతా 2వ పేజీలో...



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అరూరి

కమలం గూటికి అరూరి రమేశ్

బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే 2

కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలోకి

వరంగల్ ఎంపీ అభ్యర్థిగా..?

33 అడుగుల రోడ్డు.. 35 వేల అద్దె!


రోడ్డును కలిపేసి షెడ్ వేసేశారు.. దర్జాగా కబ్జా చేసి, లీజుకిచ్చిన మాజీ డీఎస్పీ

- సైబరాబాద్ కమిషనరేట్ ఎదురుగా డైమండ్ హిల్స్ లేఅవుట్‌లో ఆక్రమణ
- కోర్టు వివాదాల్లో ఉండడంతో ఖాళీగా ప్లాట్లు
- ఎకరం పార్కు భూమిపై కన్నేసిన మాజీ డీజీపీ!
- ప్రధాన రోడ్డుకు ఆనుకొని అక్రమంగా 18 కమర్షియల్ భవనాల నిర్మాణం
- ఐఏఎస్ అధికారి ఆదేశాలనూ పట్టించుకోని జీహెచ్ఎంసీ ప్లానింగ్ అధికారులు
- మరో ధారావిగా మారుతున్న డైమండ్ హిల్స్!!

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం)



రోడ్డును ఆక్రమించి చేసిన నిర్మాణం



లేఔట్‌లో 33 అడుగుల రోడ్డు (పసుపురంగులో ఉన్నది)

ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా నిలవాల్సిన రక్షకభటులే బరితెగిస్తే.. కబ్జాలకు పాల్పడితే.. జనం ఎవరితో చెప్పుకోవాలి? సివిల్ వివాదాల్లో తలదూర్చబోమని.. తమది ఫ్రెండ్లీ పోలీసింగ్ అని రాష్ట్ర పోలీసు శాఖ చెబుతుండగా.. కొందరు పోలీసులు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు! 'సాంప్రదాయనీ.. సుప్పినీ.. సుద్దపూసనీ..' అనే పేరడీ పాట తరహాలో ప్రవర్తిస్తున్నారు. మాజీలుగా మారగానే ముసుగు తొలగిస్తున్నారు! వారికున్న పరిచయాలను, పలుకుబడిని ఉపయోగించుకొని దర్జాగా కబ్జాలకు పాల్పడుతున్నారు!! స్వాహా చేసిన భూములను లీజుకిస్తూ పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ ఎదురుగా ఖరీదైన భూములున్న కాలనీలో ఓ మాజీ డీఎస్పీ 33 అడుగుల రోడ్డునే మాయం చేయగా.. తానేమీ తక్కువ కాదంటూ ఉమ్మడి రాష్ట్రంలో డీజీపీగా పనిచేసిన వ్యక్తి ఏకంగా కాలనీ పార్కు స్థలాన్నే కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. 38 ఏళ్లుగా వివాదంలో ఉన్న లేఅవుట్‌లో స్థలాలకు అనుమతులిచ్చే హక్కు ఏ ప్రభుత్వ విభాగానికీ లేకపోవడంతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న మాజీ పోలీసు అధికారులు ఇష్టానుసారంగా కబ్జాలకు తెరలేపారు.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 50, 51, 52, 53/పీల్లో 59 ఎకరాల 24 గుంటల భూమి ఉండగా 1986లోనే అప్పటి పంచాయతీ అనుమతులతో లేఅవుట్ చేశారు. ఇందులో 534 వరకు ప్లాట్లు ఉండగా లేఅవుట్‌లో రోడ్లన్నీ కనీసం 30 నుంచి 50 అడుగుల మేర ఉండేవిధంగా ప్లాన్ చేశారు. హైదరాబాద్-ముంబై పాత రోడ్డులో సైబరాబాద్ కమిషనరేట్ ఎదురుగానే ఈ లేఅవుట్ ఉంటుంది. మధ్యతరగతి ప్రజలు కష్టపడి పొదుపు చేసుకున్న సొమ్ముతో 38 ఏళ్ల క్రితమే ప్లాట్లు కొనుక్కున్నారు. ఇంతలోనే కొందరు గచ్చిబౌలి గ్రామస్థులు ఆ భూమిపై తమకు హక్కులు ఉన్నాయంటూ కోర్టును ఆశ్రయించారు. లేఅవుట్‌లోని ప్లాట్ల యజమానులంతా డైమండ్ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 2001లో హుడా అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే భూ వివాదం ఉండడంతో లేఅవుట్‌కు అనుమతులు రాలేదు. అయితే లేఅవుట్‌లోని సర్వేనంబరు 50లో ఉన్న 17 ఎకరాల స్థలంపై కోర్టు వివాదం ముగిసిపోయింది. అందులోని ప్లాట్ల యజమానులు జీహెచ్ఎంసీ అనుమతులతో భారీ భవనాలు నిర్మించుకున్నారు. ప్రత్యేకంగా జనార్దన్ కాలనీగా ఏర్పడడంతో తాగునీరు, విద్యుత్తు.. ఇలా అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. మిగతా సర్వే నంబర్లలోని 36 ఎకరాల వివాదం కోర్టులో కొనసాగుతూనే ఉంది. ఆ భూమిలో 350 వరకు ప్లాట్లు ఉన్నాయి.

రోడ్డు మాయం చేసిన మాజీ డీఎస్పీ

పదేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ కూడా ప్లాట్లను కొనుగోలు చేసినవారికే హక్కు కల్పించగా, గచ్చిబౌలి గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. ఆ వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో డైమండ్ హిల్స్ కాలనీలో 38 ఏళ్ల నాటి పంచాయతీ అనుమతుల లేఅవుట్ ప్రకారమే ప్లాట్లున్నాయి. అప్పట్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు హద్దులు పెట్టుకొని, ప్రహరీలు నిర్మించుకొని ఉన్నారు. ఆయా ప్లాట్లలో నిర్మాణాల కోసం జీహెచ్ఎంసీకి వెళితే అనుమతులు నిలిపివేశారు. ఎప్పటికైనా న్యాయం జరుగుతుందని 38 ఏళ్లుగా ప్లాట్ల యజమానులు ఎదురుచూస్తుండగా, కొందరు మాత్రం గజం రూ.3 లక్షలు పలికే ఈ ప్రాంతంలో రూ.20-30 వేలకే అమ్మేసుకున్నారు. ప్రధానంగా సైబరాబాద్ కమిషనరేట్‌కు ఎదురుగా పాతముంబై రోడ్డును ఆనుకొని ఉన్న ప్లాట్ల యజమానులు విక్రయించారు. మరికొందరు లీజుకు ఇచ్చారు.

డైమండ్ హిల్స్‌లో పాతముంబై రోడ్డును ఆనుకొని ఉన్న 270ఏ ప్లాట్ విస్తీర్ణం 400 గజాలు, దాని వెనక భాగంలోని 270 ప్లాట్ విస్తీర్ణం 463 గజాలు. ఈ రెండు ప్లాట్లను ఆనుకొని పడమర వైపు 33 అడుగుల రోడ్డు ఉంది. అయితే డీఎస్పీ హోదాలో ఉన్నప్పుడు ఆ రెండు ప్లాట్లను కొనుగోలు చేసిన పోలీసు అధికారి.. ఆ తర్వాత ఏసీబీకి కూడా చిక్కారు. తన రెండు ప్లాట్లతో పాటు పడమర వైపునున్న 33 అడుగుల రోడ్డును సైతం ఓ గ్రానైట్, మార్బుల్ షాప్ కోసం లీజుకు ఇచ్చారు. 170 అడుగుల పొడవు, 33 అడుగుల వెడల్పు ఉండే రోడ్డులోనే షెడ్లు వేసేసి వ్యాపారం చేస్తున్నారు. అక్కడ రోడ్డుపై కూడా షెడ్డు వేసేసి మాజీ డీఎస్పీ.. నెలకు రూ.35 వేలు అద్దె తీసుకోవడం విశేషం.

పార్కుపై కన్నేసిన మాజీ డీజీపీ!

డైమండ్ హిల్స్ కాలనీలో పార్కు కోసం సుమారు 4 వేల చదరపు గజాల స్థలాన్ని వదిలారు. పార్కుగా అభివృద్ధి చేయకపోవడంతో గుట్టలు, కొండలతో నిండిపోయింది. చుట్టుపక్కల వ్యర్థాలన్నీ అందులోనే డంప్ చేస్తున్నారు. అయితే ఈ పార్కు స్థలంపై ఉమ్మడి రాష్ట్రంలో డీజీపీగా పని చేసిన వ్యక్తి కన్నేశారు. పలుమార్లు కబ్జా చేసేందుకు యత్నించగా ప్లాట్ల యజమానులు అడ్డుకున్నారు. ఇప్పటికే ఆ పార్కు స్థలంపై మాజీ డీజీపీ డాక్యుమెంట్లు కూడా సంపాదించినట్లు సమాచారం. దీంతో ఏ క్షణంలో ఆ పార్కు స్థలాన్ని మాయం చేస్తారోనని డైమండ్ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు.

అక్రమంగా కమర్షియల్ భవనాల నిర్మాణం..

డైమండ్ హిల్స్ కోర్టు వివాదంలో ఉన్న లేఅవుట్ కావడంతో జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులూ లేవు. కానీ, పాత ముంబై రోడ్డుకు ఆనుకొని భారీ కమర్షియల్ భవనాలు ఏర్పాటు చేశారు. ఇంకా నిర్మాణాలు చేస్తూనే ఉన్నారు. అయినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రోడ్డు వెంటే 18వరకు కమర్షియల్ నిర్మాణాలు అక్రమంగా వెలిశాయి. అందులో కార్ల షోరూమ్‌లు, గ్రానైట్ షాప్‌లు, కార్ లాంజ్‌లు, ఓ మూడు రెస్టారెంట్లు, ఓ బార్.. ఇలా పెద్దపెద్ద వ్యాపారాలు సాగుతున్నాయి. ఎవరైనా ప్లాట్ యజమాని తన ప్లాట్‌కు ప్రహరీలు ఏర్పాటు చేసుకుంటే వెంటనే జీహెచ్ఎంసీ ప్లానింగ్ విభాగం అధికారులు వచ్చి, కూల్చేస్తున్నారు. భారీగా షోరూమ్‌లు, షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకోని అధికారులు.. తమ ప్రహరీలను మాత్రం కూల్చేయడమేంటని ప్లాట్ల యజమానులు ప్రశ్నిస్తున్నారు.

ఐఏఎస్ అధికారి ఆదేశాలనూ పట్టించుకోని అధికారులు..!

డైమండ్ హిల్స్‌లో అక్రమంగా సాగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఇటీవల శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కమిషనర్ స్నేహ శబరీష్ మరుసటి రోజే డైమండ్ హిల్స్‌ను సందర్శించారు. కబ్జాలు తొలగించి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. కానీ, అధికారులు మాత్రం ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. అసోసియేషన్ ప్రతినిధులు వెళ్లి అడిగితే.. 'ఏ భవనాన్ని కూల్చాలో చెబితే.. కూల్చుతాం' అని సమాధానం ఇస్తున్నారు. లేఅవుట్‌లోని నిర్మాణాలన్నీ అక్రమమేనని చెబితే.. తమకు సంబంధం లేదంటున్నారని ప్రతినిధులు వాపోతున్నారు.

మరో ధారావి..?

డైమండ్ హిల్స్ లేఅవుట్ కోర్టు వివాదంలో ఉండడంతో మౌలిక సదుపాయాలు లేవు. చాలా ప్లాట్లు ఖాళీగా ఉండడంతో ఇతర రాష్ట్రాల కార్మికులు షెడ్‌లు వేసుకొని నివసిస్తున్నారు. ప్లాట్ల యజమానులు షెడ్‌లు వేయడంతో కూలీలు నివాసం ఉంటున్నారు. డ్రైనేజీ లైన్లు లేకపోవడంతో డైమండ్ హిల్స్ కాలనీ మురికికూపంగా మారింది. ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ కాలనీ ముంబైలోని ధారావి మురికివాడలా తయారవుతోంది. సాయంత్రమైతే చాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయి కూడా సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఇష్టానుసారంగా హెచ్‌టీ కనెక్షన్లు

డైమండ్ హిల్స్‌లో అనధికారికంగా జీ+1 అంతస్తుతో భారీ జిమ్ ఏర్పాటు చేశారు. దానికి విద్యుత్తు అధికారులు హైటెన్షన్ లైన్‌తో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇలా 10-15 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వివిధ షెడ్లకూ అధికారులు అనుమతి ఇచ్చారు. సాధారణంగా హెచ్‌టీ కనెక్షన్ తీసుకునేందుకు అన్ని రకాల అనుమతులున్నా, నెలల తరబడి నాన్చుతారు. కానీ, డైమండ్ హిల్స్‌లో ఎలాంటి అనుమతులు లేని భారీ షెడ్‌లకు, కమర్షియల్ భవనాలకు హెచ్‌టీ కనెక్షన్లతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేస్తున్నారు. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలున్నాయి.

లోకం తీరు



జగన్మోహిని అవతారంలో నృసింహుడు



యాదగిరిగుట్ట, మార్చి 17: బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహుడు ఆదివారం జగన్మోహిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారిని పట్టుపీతాంబరాలు, వజ్రాలు, ముత్యాలను పొదిగిన దివ్యాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో జగన్మోహిని అవతారంలో అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణతో ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయ తూర్పు రాజగోపురం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, బ్రహ్మోత్సవాల కోసం ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరఫున ఆదివారం యాదాద్రి నృసింహుడికి కల్యాణ పట్టువస్త్రాలను(మేల్చాట్) సమర్పించారు. కాగా, ఆదివారం సెలవు, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో యాదాద్రిలో భక్తజన సందడి నెలకొంది. స్వామివారి ధర్మ దర్శనానికి 3గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. ఆదివారం 30వేలకు పైగా భక్తులు యాదాద్రిని సందర్శించినట్లు, ఆలయ ఖజానాకు రూ.42.59 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలి?

- కాంగ్రెస్ నేతలు చెప్పేదొకటి.. చేసేదొకటి: దాసోజు
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ కుట్రలు: శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఒకపార్టీ గుర్తుతో ఎన్నికల్లో గెలిచాక.. మరో పార్టీలో చేరేవాళ్లను రాళ్లతో కొట్టాలని.. గతంలో రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంటి నేతలు వ్యాఖ్యానించారని బీఆర్ఎస్ నేత దాసోజుశ్రవణ్ పేర్కొన్నారు. అలాంటి వారు ఇప్పుడు బీఆర్ఎస్‌లో గెలిచిన నేతలను కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకుంటారని, ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలని ఆయన ప్రశ్నించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏముఖం పెట్టుకొని.. దానం మళ్లీ కాంగ్రెస్‌లో చేరారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నుంచి వెళ్లినవారిపై డిస్క్వాలిఫికేషన్ పిటిషన్ వేస్తామని, వారికి రాజ్యాంగబద్ధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గతంలో దానం నాగేందర్‌ను బీడీలమ్ముకునే వ్యక్తి అని విమర్శించిన రేవంత్.. ఇప్పుడు గాంధీభవన్‌లో బీడీలు అమ్మిస్తారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై.. బీఆర్ఎస్ పార్టీని బలహీనం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆ పార్టీ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ దొంగల పార్టీ అయితే.. ఆ పార్టీ నేతల ఇళ్ల వద్ద కిషన్‌రెడ్డి వాచ్‌మన్ ఉద్యోగం చేస్తున్నారా..? అట్లాంటి వారికి బీజేపీ ఎంపీ టికెట్లు ఎందుకు ఇస్తున్నారని నిలదీశారు. గిరిజనుల భూములను ఆక్రమించుకున్నారని సైదిరెడ్డికి వ్యతిరేకంగా బీజేపీ గతంలో ఆందోళన చేసిందని, అలాంటిది ఇప్పుడు ఆయనకు నల్లగొండ ఎంపీ టికెట్ ఎందుకు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.

కవిత నిర్దోషిగా వస్తారు: నాగం

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఎమ్మెల్సీ కవిత అక్రమంగా అరెస్టు చేశారని, కేసు వీగిపోతుందని, తొందర్లోనే ఆమె నిర్దోషిగా వస్తారని బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. అత్యున్నత న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉండగానే.. ఈడీ కవితను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ దురుద్దేశంతో అరెస్టు చేయడం తగదని, వాస్తవాలు తొందర్లోనే బహిర్గతమవుతాయని, న్యాయస్థానాలపై నమ్మకం ఉందని నాగం వెల్లడించారు.

బీఆర్ఎస్ కాలుతున్న ఇల్లులాంటిది: మల్లు రవి

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కాలిపోతున్న ఇల్లులాంటిదని.. అందుకే ఆ పార్టీ నేతలు తమను తాము రక్షించుకోవడానికి ఇతర పార్టీల్లోకి వలస వెళ్తున్నారని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. కాంగ్రెస్‌లోకి వస్తున్న నేతలందరూ కేసీఆర్ బాధితులేనని చెప్పారు. బీఆర్ఎస్ నేత మల్లారెడ్డికి కాంగ్రెస్‌లోకి రావడానికి ఆహ్వానమే లేదన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లిక్కర్ స్కాంలో కవిత అరెస్టును బీఆర్ఎస్, బీజేపీ ఒక రహస్య అవగాహనతో రక్తికట్టిస్తున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా నెగ్గే అవకాశం లేకపోవడంతో కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకునేందుకు బీజేపీకి లబ్ధి చేకూర్చేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

పెట్రో భారం ఏపీలోనే అధికం

- పెట్రోల్ రూ.109.87, డీజిల్ రూ.97.6
- దేశవ్యాప్తంగా ఏపీలోనే ఎక్కువ ధరలు
- ఆ తర్వాతి స్థానాల్లో కేరళ, తెలంగాణ
- కేంద్రం రూ.2 తగ్గించినా దక్కని ఊరట
- చాలా రాష్ట్రాల్లో రూ.100కుపైగానే ధరలు

న్యూఢిల్లీ, మార్చి 17: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలపై ఇటీవలే లీటరుకు రూ.2 చొప్పున తగ్గించినప్పటికీ చాలా రాష్ట్రాల్లో వినియోగదారుడికి ఊరట దక్కలేదు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్రో భారం అత్యధికంగా ఉంది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను పరిశీలిస్తే ఏపీనే టాప్‌లో నిలిచింది. కేరళ, తెలంగాణ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏపీలో లీటరు పెట్రోల్ రూ.109.87, డీజిల్ ధర రూ.97.6గా ఉంది. కేరళలో పెట్రోల్ రూ.107.54, డీజిల్ రూ.96.41, తెలంగాణలో పెట్రోల్ రూ.107.39, డీజిల్ రూ.95.63గా ఉన్నాయి. అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఢిల్లీ వంటి కేంద్రపాలిత ప్రాంతాల్లో పెట్రోల్ ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. స్థానికంగా విధించే సేల్స్ ట్యాక్స్ లేదా విలువ ఆధారిత పన్ను (వ్యాట్)లో వ్యత్యాసం వల్లే ధరల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, బిహార్ (జేడీ-యూతో పొత్తు), రాజస్థాన్, మహారాష్ట్రలోనూ పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగానే ఉన్నాయి. భోపాల్‌లో లీటరు పెట్రోల్ రూ.106.45, పట్నాలో రూ.105.16, జైపూర్‌లో రూ.104.86, ముంబైలో రూ.104.19గా ఉంది. ఇక పశ్చిమ బెంగాల్‌లో రూ.103.93 ఉండగా, ఒడిశా (భువనేశ్వర్ రూ.101.04), తమిళనాడు (చెన్నై రూ.100.73), ఛత్తీస్‌గఢ్ (రాయ్‌పూర్ రూ.100.37)ల్లోనూ పెట్రోల్ ధరలు రూ.100కంటే అధికంగా ఉన్నాయి. అండమాన్ నికోబార్ దీవుల్లో లీటరు పెట్రోల్ అత్యల్పంగా 82 ఉంది. డామన్ (రూ.92.49), ఢిల్లీ (రూ.94.76), గోవాలోని పనాజీ (రూ.95.19), ఐజ్వాల్ (రూ.93.68), గువాహటి (రూ.96.12)లోనూ ధరలు తక్కువగా ఉన్నాయి. అలాగే చాలా ఈశాన్య రాష్ట్రాల్లోనూ పెట్రోల్ ధరలు వంద కంటే దిగువనే ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు భారత్‌లోని మూడు ఆయిల్ కంపెనీలు ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ పెట్రోల్, డీజిల్ ధరలపై లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. అయినప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో స్థానిక పన్నుల బాదుడు కారణంగా వినియోగదారుడికి ఊరట లభించలేదు. విలువ ఆధారిత పన్ను (వ్యాట్) కారణంగా చాలా రాష్ట్రాల్లో పెట్రోల్ రేటు రూ.100 కన్నా దిగువకు దిగిరాలేదు.

పీఎంజీఎస్‌వై పనులకు గ్రహణం!

- పంచాయతీరాజ్ శాఖలో ఎక్కడి పనులు అక్కడే
- రూ.440 కోట్ల కేంద్ర నిధులకు బ్రేక్
- గత సర్కారు వైఫల్యం వల్లే ఈ దుస్థితి

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలు చేసే కొన్ని పథకాలకు రాష్ట్రాలు తమవంతు వాటాగా నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. అప్పుడే అభివృద్ధి పనులు సజావుగా సాగుతాయి. అయితే ఈ విషయంతో తెలంగాణలోని గత ప్రభుత్వం విఫలం కావడంతో.. కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు బ్రేక్ పడింది. ఫలితంగా రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖలో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. గతంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం కోసం రాష్ట్రం వాటా విడుదల చేయకపోవడంతో.. కేంద్రం నిధులను విడుదల చేయలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) పథకానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన రూ.440 కోట్ల నిధులు ఆగిపోయాయి. ఈ పథకానికి గత ప్రభుత్వం తన వాటాగా రూ.230 కోట్లు(రెండు క్వార్టర్లు) విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పీఎంజీఎస్‌వైకి సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాబార్డు ద్వారా రూ.200కోట్లు రుణం సేకరించి ఆ నిధులను పక్కదారి పట్టించింది. పైగా ఈ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో.. వాటి నిర్మాణాలకు సొంతంగా డబ్బులు వెచ్చించిన సర్పంచులు, కాంట్రాక్టర్లు నేటికీ గగ్గోలు పెడుతున్నారు. కొన్నిచోట్ల నిధుల లేమి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గ్రామీణ రహదారులు, బ్రిడ్జిల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఈ నెలలో కేంద్ర ప్రభుత్వం పీఎంజీఎస్‌వై పథకానికి తన వాటాగా 60% నిధులు.. సుమారు రూ.440 కోట్లు విడుదల చేయాలంటే.. ప్రస్తుత ప్రభుత్వం తక్షణం తన 40% వాటాగా రూ.230 కోట్లు విడుదల చేయాల్సి ఉంటుంది. లేదంటే ఇప్పటివరకు చేపట్టిన పనులు అసంపూర్తిగా, నిరుపయోగంగా మిగిలే ప్రమాదం ఉందని సంబంధిత వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటివరకు ఈ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఏజెన్సీలు ముందుకు రావడంలేదు. పూర్తి చేసిన పనులకు గాను ఏడాదిన్నర కాలంగా బిల్లుల మంజూరు కోసం తాము ప్రభుత్వానికి అనేక విన్నపాలు చేసినా ఎలాంటి ఫలితం కనిపించడం నిర్మాణాలు చేపట్టిన వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన పాపానికి పీఎంజీఎస్‌వై పనులకు గ్రహణం పట్టిందని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని రాష్ట్రప్రభుత్వ వాటా నిధులను తక్షణం విడుదల చేసి.. మార్చిలోనే రూ.440 కోట్లు కేంద్ర నిధులు రాబట్టాలని పలువురు కోరుతున్నారు.

ఢిల్లీలో వ్యాపారం.. ఇక్కడ ఆందోళనలా?

(మొదటిపేజీ తరువాయి)



లిక్కర్‌ను బ్యాన్ చేస్తానని అని కవిత అన్న మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసేందుకే ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాంలో దూరారా..? అని ప్రశ్నించారు. ఆమె చర్యతో తెలంగాణ ప్రజలకు ఏమైనా లాభం జరిగిందా..? అని నిలదీశారు. వంద రోజుల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఎక్కడ అమలయ్యాయని ప్రశ్నించారు. గ్యారెంటీలను అమలు చేసేదాకా వెంటాడతామని తెలిపారు. గ్యారెంటీల పేరుతో ఏ వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందో.. వారితో కలిసి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ప్రకటించారు. ప్రశ్నిస్తున్న తెలంగాణ పేరిట డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర సర్కారు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో మోదీ ప్రభుత్వం పేదలకు బియ్యం ఇవ్వలేకపోతోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరపడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బెల్టు షాపులను ప్రోత్సహించిన కల్వకుంట్ల కుటుంబసభ్యుల బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని కిషన్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ద్వారానే బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. రేవంత్‌కు ఎందుకు అభద్రతా భావమో అర్థం కావడం లేదన్నారు.

ఈ సర్కారులోనూ ఫోన్ల ట్యాపింగ్: ఈటల

మల్లాపూర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత సర్కారు తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్లు ట్యాప్ చేస్తోందని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు కేసీఆర్ తీరును తప్పుపట్టిన వారు.. అధికారం చేపట్టగానే అదే పోకడ అవలంబిస్తున్నారని విమర్శించారు. నాచారం డివిజన్ పరిధిలో బీజేపీ నాయకులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఈటల మాట్లాడారు. ప్రధాని మోదీపై రెండు నాల్కల ధోరణి అవలంబించిన కేసీఆర్‌కు పట్టిన గతే.. సీఎం రేవంత్‌కూ పడుతుందని వ్యాఖ్యానించారు. పెద్దన్న మోదీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అంటూనే.. మోదీని విమర్శించడం రేవంత్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని అన్నారు. రాహుల్ గాంధీకి నిధులు పంపేందుకు తెలంగాణలో బ్లాక్‌మెయిలింగ్ వసూళ్లకు పాల్పడుతున్న ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు.

నేడు జగిత్యాలలో ప్రధాని మోదీ సభ

జగిత్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సోమవారం జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్నారు. జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయం మైదానంలో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రధాని సభ కోసం భారీ సంఖ్యలో జనాన్ని సమీకరించే పనిలో బీజేపీ నేతలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే నిజామాబాద్ ఎంపీ అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ తదితరులు సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. నిజామాబాద్, కరీంనగర్ ఎంపీలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్.. పెద్దపల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ జన సమీకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

కమలం గూటికి అరూరి రమేశ్

- బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే
- కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలోకి
- వరంగల్ ఎంపీ అభ్యర్థిగా గ్రీన్‌సిగ్నల్?

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు అరూరి రమేశ్ బీజేపీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. రమేశ్ బీజేపీలో చేరడంతో ఇన్ని రోజులు పార్టీ మార్పుపై కొనసాగిన హైడ్రామాకు తెర పడింది. అరూరితో పాటు సుమారు 500 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన అరూరి ఓడిపోయారు. తర్వాత వరంగల్ ఎంపీ స్థానంపై ఆయన ఆశలు పెట్టుకున్న ఆయన బీజేపీ వైపు మొగ్గుచూపారు. బీజేపీ అధినాయకత్వం కూడా ఆయన రాకను స్వాగతించింది. వరంగల్ లోక్‌సభ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీకి గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చింది.

మొన్ననే చేరాల్సి ఉన్నా..

బీజేపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్న అరూరి.. ఈ నెల 13న విలేకరుల సమావేశంలో ఆ విషయాన్ని ప్రకటించేందుకు సిద్ధమవుతుండగా అనూహ్యంగా బీఆర్ఎస్ నాయకులు ఆయన ఇంటికి వచ్చి బీజేపీలో చేరవద్దని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ససేమిరా అనడంతో ఆయనను బలవంతంగా కారులో ఎక్కించుకొని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. కేసీఆర్ సైతం అరూరిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. వరంగల్ లోక్‌సభ నుంచి పోటీకి అవకాశం ఇస్తామని చెప్పారు. అయితే, దానికి అరూరి అంగీకరించలేదు. తాను పార్టీలోనే ఉంటానని ఆ రోజు ఆయన ప్రకటించారు. అయితే, అరూరి అడుగులు బీజేపీ వైపే పడుతున్నాయని వార్తలు వచ్చాయి. ఆదివారం ఆయన కాషాయ కండువా కప్పుకోవడంతో కొద్ది రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. ఈ సందర్భంగా రమేశ్ మీడియాతో మాట్లాడారు. దేశంలో అన్ని వర్గాల అభివృద్ధితో పాటు 30 ఏళ్ల పోరాటం తర్వాత మోదీ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ దిశగా అడుగులు పడుతున్నాయని.. అందుకే తాను బీజేపీలో చేరానని తెలిపారు.

కుప్పకూలిన రాష్ట్రాన్ని కలిసి నిలబెడతాం

- కక్ష, విధ్వంసాలకు జగన్ పర్యాయ పదం
- ఆయనకు ఓటేయొద్దని సొంత చెల్లెళ్లే పిలుపిస్తున్నారు
- లాండ్, శాండ్, వైన్, మైన్ సహా దేన్నీ వదల్లేదు
- ఎన్డీయే గెలుపు ఖాయం.. ఎవరూ ఆపలేరు: చంద్రబాబు



అమరావతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): "ఐదేళ్ల విధ్వంస పాలన.. దురహంకార ప్రవర్తనతో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైపోయింది. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే మేమందరం కలిశాం. కుప్పకూలిన రాష్ట్రాన్ని కలిసి నిలబెడతాం" అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రపంచ వేదికపై భారతదేశం దూసుకుపోతోందన్నారు. ప్రజలు అవకాశం ఇస్తే ఈ అభివృద్ధిని ఈ రాష్ట్రంలో కూడా చూపించి వారి జీవితాల్లో వెలుగులు తెస్తామని, మార్పు చూపిస్తామని ప్రకటించారు. ఎన్డీయేలో టీడీపీ చేరిన తర్వాత తొలిసారి పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఉమ్మడి భారీ బహిరంగ సభలో మోదీ సమక్షంలో ఆయన ప్రసంగించారు. "కక్ష, విధ్వంసం, అవినీతి, దోపిడీలకు జగన్ పర్యాయ పదం. లాండ్, శాండ్, వైన్, మైన్ సహా దేనినీ వదిలిపెట్టకుండా అడ్డగోలుగా దోచుకున్నారు. జగన్ మూడు ముక్కలాట పేరుతో అమరావతిని సర్వనాశనం చేశారు. అమరావతి పూర్తయి ఉంటే.. దేశంలో ఏపీ నంబర్ వన్‌గా మారేది. అప్పులు తేవడానికి చివరకు కలెక్టర్ కార్యాలయాలను కూడా తాకట్టు పెట్టే స్థితికి దిగజారారు. రాబోయే పాతికేళ్లలో మద్యంపై వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి, నడుపుతున్నారు" అని జగన్ పాలనపై మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో తెలుగు ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్‌ను సమూలంగా మారుస్తుందని, మూడు పార్టీల(తెలుగుదేశం, జనసేన, బీజేపీ) జెండాలు వేరైనా.. ఎజెండా ఒక్కటేనని.. అది సంక్షేమం, అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ అని వివరించారు. "ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో పరిశ్రమలు లేవు. పెట్టుబడులు లేవు. అభివృద్ధి లేదు. ఉపాధి లేదు. కనీసం రోడ్లు వేసే దిక్కు కూడా లేదు. ప్రజల జీవితాల్లో ఆనందం అనేదే లేకుండా చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమ కేసులు పెట్టి, రాజకీయాలను కలుషితం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రశ్నించిన వారిని జగన్ అణచివేశాడు. అతని అధికార దాహానికి సొంత బాబాయి కూడా బలయ్యాడు. వైసీపీ పునాదులు రక్తంతో తడిచాయని, జగన్ పార్టీకి ఓట్లు వేయొద్దని సొంత చెల్లెళ్లే రోడ్డెక్కి పిలుపిచ్చే పరిస్థితులు వచ్చాయంటే ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రజలు గెలవాలి. రాష్ట్రం నిలబడాలి" అని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీని చంద్రబాబు పొగడ్తలతో ముంచెత్తారు. "ప్రధాని మోదీ ప్రగతివాది. మన దేశాన్ని విశ్వగురువుగా నిలిపిన మహా శక్తి. అన్న యోజన, ఆవాస్ యోజన, కిసాన్ యోజన, ఆయుష్మాన్ భారత్, జలజీవన్ మిషన్ వంటి కార్యక్రమాలతో సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చారు. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, గతి శక్తి వంటి కార్యక్రమాలతో దేశంలో సంపద సృష్టించారు. సబ్ కా సాత్... సబ్ కా వికాస్ నినాదంతో దేశ ప్రజలకు నమ్మకం కలిగించారు. కరోనా సమయంలో ఎంతో శ్రమించి మనందరి ప్రాణాలు కాపాడారు. వంద దేశాలకు వ్యాక్సిన్ పంపారు. ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న మన ఎకానమీని పదేళ్లలో ఐదో స్థానంలోకి తెచ్చారు. రాబోయే రోజుల్లో మన దేశం అమెరికా, చైనాల తర్వాత మూడో స్థానంలో నిలబడబోతోంది" అని వివరించారు. కాసేపు ఆయన హిందీలో మాట్లాడారు. మోదీని పొగుడుతూ హిందీలో మాట్లాడడాన్ని ప్రధాని కూడా ఆసక్తిగా ఆలకించారు. వైసీపీ వైఫల్యాలను ఎండగట్టే సమయంలో చంద్రబాబు ఆంగ్లంలో మాట్లాడారు

అవినీతి వైసీపీ సర్కారును అంతమొందించండి

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మోదీ పిలుపు

(బొప్పూడి నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)



సభకు హాజరైన జన సందోహం

ఏపీలో అవినీతి వైసీపీ సర్కారును అంతం చేయాలని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వాన్ని పెకిలించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని.. ఇప్పటికే ఈ దిశగా సంకల్పం తీసుకున్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. వికసిత భారత్, అభివృద్ధి ఆంధ్ర కావాలంటే టీడీపీ -జనసేన- బీజేపీ కూటమినే గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏపీలో ఎన్డీయే సర్కారు ఏర్పడాలని, అధిక సంఖ్యలో కూటమి ఎంపీలను పార్లమెంటుకు పంపించాలని కోరారు. జగన్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే అని పేర్కొన్నారు. ఒకే కుటుంబం రెండు పార్టీలను నడుపుతోందని.. రెండు కత్తులు ఒకే వరలో చాలా తెలివిగా మిలాఖత్ అయ్యాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై కోపంగా ఉన్న ప్రజల ఓటును కాంగ్రెస్ వైపు మళ్లించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని.. పొరపాటున కూడా వైసీపీ వ్యతిరేక ఓటును చీల్చవద్దని ప్రజలను అభ్యర్థించారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులకే ఓటు వేయండి, వేయించండి అని విజ్ఞప్తి చేశారు. "ఐదేళ్లలో రాష్ట్రంలో పేదల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళలకు కొత్త అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పోర్టులతోపాటు బ్లూ ఎకానమీ విస్తరణ చేయాల్సి ఉంది. అవన్నీ జరగాలంటే ఏపీ అసెంబ్లీ, ఢిల్లీ పార్లమెంటులో ఎన్డీయే సభ్యులు ఉండాలి. అప్పుడే మీరు అభివృద్ధి భారత్, అభివృద్ధి ఆంధ్ర సాకారానికి మద్దతిచ్చినట్లు" అని తెలిపారు. ఆదివారం ఏపీలోని చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద నిర్వహించిన సభలో మోదీ పాల్గొన్నారు. సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఏపీకి వచ్చానని.. కోటప్పకొండలోని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడి ఆశీర్వాదం లభించిందని. ఈ ముగ్గురు దేవుళ్ల ఆశీర్వాదంతో మూడోసారి అధికారంలోకి వస్తామని.. దేశాభివృద్ధి కోసం మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటాం. అభివృద్ధి ఏపీని సాధిస్తామని మోదీ హామీ ఇచ్చారు. ప్రాంతీయ ఆకాంక్ష, జాతీయ ప్రగతిని సమన్వయం చేసేందుకు తమను ఆశీర్వదించాలన్నారు. 'భారత్ మాతాకీ.. జై' అంటూ ప్రసంగం మొదలు పెట్టిన మోదీ.. 'నా ఆంధ్ర కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు' అంటూ తెలుగులో అభివాదం తెలిపారు. ఎన్డీయేకు 400సీట్లు దాటేలా కూటమి అభ్యర్థులను గెలిపించాలని మూడు పార్టీల కార్యకర్తలను కోరారు. ఎన్డీయే కూటమి ప్రాంతీయ ఆకాంక్షలతోపాటు జాతీయ భావాలు కలుపుకొంటూ అడుగులు వేస్తుందని తెలిపారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఏపీ అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమని ప్రధాని మోదీ అన్నారు. "వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు రావాలి. ఎన్డీయే ప్రభుత్వం పేదలకు సేవ చేస్తుంది. పేదల గురించి ఆలోచన చేస్తుంది. దేశంలో 30 కోట్లమందిని పేదరికం నుంచి బయటికి తెచ్చింది"అని అన్నారు. 'ఎన్డీయే కూటమి భాగస్వాములందరినీ కలుపుకొని వెళ్తుంది. ఇండియా కూటమిలో అన్నీ వైరుధ్యాలే. ఒకరినొకరు తిట్టుకొంటూ వాడుకుని వదిలేసే విధానం అవలంబిస్తోంది'అని విమర్శించారు. "కేరళలో లెఫ్ట్, కాంగ్రెస్ తిట్టుకుంటాయి. బెంగాల్‌లో టీఎంసీ, లెఫ్ట్ దూషించుకుంటాయి. పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్ దుమ్మెత్తి పోసుకుంటాయి. దేశం కోసం దూరదృష్టి, ముందుచూపులేని వాళ్లు దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళతారో ఆలోచించాలి" అని ప్రజలను కోరారు. 'ఇండియా' కూటమి అవసరాలకు అనుగుణంగా పరస్పరం సహకరించుకునే స్వార్థపరుల బృందం అని ఎద్దేవా చేశారు.

శ్రీరాముడంటే ఎన్టీఆర్..

"శ్రీరాముడి భవ్య మందిరాన్ని అయోధ్యలో నిర్మించాం.. తెలుగు ప్రజలు ప్రతి ఇంటా రాముడికి స్వాగతం పలికారు" అని మోదీ పేర్కొన్నారు. తెలుగువారు రాముడిని గుర్తుకు తెచ్చుకుంటే మన కళ్ల ముందు మెదిలేది ఎన్టీఆర్ అని తెలిపారు. "రాముడు, కృష్ణుడిలా ఎన్టీఆర్ గొప్పగా కనిపించి ఆ దేవుళ్లిద్దరినీ ప్రజల మనసుల్లోకి తీసుకెళ్లారు. పేదలు, రైతుల కోసం ఎన్టీఆర్ చేసిన సేవను మనం గుర్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం కోసం ఆయన కాంగ్రెస్‌తో పోరాడారు. మా ప్రభుత్వం ఆయన శతజయంతి సందర్భంగా స్మారక నాణెం విడుదల చేసింది. పీవీ నరసింహారావుకు భారత రత్న ఇచ్చింది. కానీ.. కాంగ్రెస్ ఆ ఇద్దరినీ అవమానించింది" అని మండిపడ్డారు.

విజయం మనదే..

- చంద్రబాబు, పవన్‌లతో మోదీ మాటామంతీ


ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఘన విజయం ఖాయమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సభ ముగిసిన తర్వాత ఆయన కొద్దిసేపు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. 'సభ చాలా బాగా జరిగింది. ప్రజల్లో ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో వేవ్ ఉంది. మన గెలుపు ఖాయం' అన్నారు. చంద్రబాబు అరెస్టు తర్వాత వీరిద్దరూ కలుసుకోవడం ఇదే ప్రథమం కావడంతో అప్పటి పరిణామాల గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, వైసీపీ ప్రభుత్వ వ్యవహారాలను ప్రధానికి చంద్రబాబు, పవన్ వివరించారు. వారు చెప్పిన విషయాలను ప్రధాని శ్రద్ధగా విన్నారు.

మీది చాలా గట్టి స్వరం!

- వేదికపై చంద్రబాబుతో మోదీ ముచ్చట్లు

ఆరేళ్ల తర్వాత రాజకీయ వేదికపై తొలిసారి కలుసుకొన్న ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు ఆప్యాయంగా కబుర్లు చెప్పుకొన్నారు. సభకు జనం హాజరు అద్భుతంగా ఉందని, ప్రజానీకం విపరీతంగా తరలివచ్చారని మోదీ చంద్రబాబుతో చెప్పారు. ఆయన ప్రశంసకు పొంగిపోయిన చంద్రబాబు నమస్కారం పెట్టి ధన్యవాదాలు చెప్పారు. సభలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తుండగా మోదీ లేచి వచ్చి మైక్ తీసుకొన్నారు. కార్యకర్తలు విద్యుత్ లైట్ల టవర్‌పైకి ఎక్కి నిల్చున్నారని, తక్షణం కిందికి దిగాలని మోదీ విజ్ఞప్తి చేశారు. దీంతో కార్యకర్తలు వెంటనే టవర్ పైనుంచి దిగిపోయారు. చంద్రబాబు ప్రసంగించిన అనంతరం ఆయన కంచు కంఠాన్ని మోదీ ప్రశంసించారు. 'మీరు చాలా గట్టిగా మాట్లాడుతున్నారు. అంత గట్టిగా మాట్లాడితే మాకైతే గొంతు నొప్పి వస్తుంది. మీది చాలా గట్టి స్వరం' అని మోదీ అన్నారు. తాను అలా అలవాటుపడ్డానని, లేకపోతే సభలో ఊపు రాదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

కూటమిదే పీఠం: పవన్



ఏపీలో జనసేన-టీడీపీ-బీజేపీ కూటమిదే విజయమని జనసేనాని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. గంగమ్మ తల్లి హిమాలయాల నుంచి భూమ్మీదకు వచ్చి ఎలా సేదనిచ్చిందో.. మోదీ రాక, ఎన్డీయే పునఃకలయిక 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు ఆనందాన్నిచ్చిందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఉమ్మడిగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన భారీ బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. అభివృద్ధి లేక అప్పులతో నలిగిపోతున్న ఆంధ్రా ప్రజానీకం.. దాష్టీకం, దోపిడీతో నలుగుతున్న ఆంధ్ర ప్రజానీకం.. అవినీతి, అప్రజాస్వామిక విధానాలతో కొట్టుమిట్టాడుతున్న ఆంధ్ర ప్రజానీకం.. మోదీ రాక కోసం ఎదురు చూస్తోందన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతూ.. హ్యాట్రిక్ కొట్టబోతున్న మోదీకి ఆంధ్ర ప్రజల తరఫున, ఎన్డీయేలో భాగస్వాములైన మూడు పార్టీల తరఫున ఘనస్వాగతం పలుకుతున్నానని చెప్పారు. 'అయోధ్యకే రాముడిని తీసుకొచ్చిన ప్రధాని మోదీ ఇక్కడుంటే.. రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిన చిటికెడంత రావణాసురుడిని తీసేయడం అంత కష్టమా? 2014లో తిరుపతి బాలాజీ సాక్షిగా పొత్తు మొదలైంది. ఈ రోజు 2024లో బెజవాడ కనకదుర్గమ్మ సాక్షిగా వేరే రూపం తీసుకోబోతోంది. దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో మన ప్రభుత్వం స్థాపించే దిశగా వెళ్తున్నాం' అని అన్నారు. 2024లో గెలుపు ఎన్డీయేదే' అని పవన్ స్పష్టం చేశారు.

ముగిసిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం

- కమలేశ్ పటేల్‌కు ప్రపంచ శాంతి రాయబారి పురస్కారం
- కమలేశ్ ద్వారా ఆధ్యాత్మిక ఉద్యమం మరింత ప్రకాశించాలి: ధన్‌ఖడ్
- మహోత్సవంలో పాల్గొన్న వందకు పైగా దేశాల యోగా అభ్యాసకులు



ధన్‌ఖడ్ చేతుల మీదుగా కమలేశ్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న ప్యాట్రీసియా

షాద్‌నగర్/కొత్తూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్ జనరల్ సెక్రటరీ ప్యాట్రీసియా ఈ మహోత్సవ నిర్వాహకుడు కమలేశ్ డి పటేల్‌కు 'ప్రపంచ శాంతి రాయబారి' పురస్కారాన్ని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ చేతుల మీదుగా అందజేశారు. శాంతి మార్గాన్ని అన్వేషించాలని సంకల్పించడం, అందులో దేశవ్యాప్తంగా అన్ని కులాలు, మతాల వారిని ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని ధన్‌ఖడ్ అన్నారు. కమలేశ్ ద్వారా ఆధ్యాత్మిక, శాంతి ఉద్యమం మరింత ప్రకాశించాలని, 160 దేశాల్లోని జీవితాలను తాకిన ఈ ఉద్యమం తప్పనిసరిగా అద్భుతమైన ఫలితాలను ఇస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవంలో వందకు పైగా దేశాలకు చెందిన వేలాది మంది యోగా అభ్యాసకులు, దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన లక్షకుపైగా ప్రజలు కులమతాలకతీతంగా పాల్గొన్నారు. ఈ నెల 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, 16, 17వ తేదీల్లో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ మహోత్సవంలో పాల్గొని పలు సూచనలు చేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, దేశ, రాష్ట్ర ఉన్నతాధికారులు, వివిధ మతాలకు చెందిన ఆధ్యాత్మిక వేత్తలు, విద్యార్థులు హాజరయ్యారు. మహోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రదర్శనలు, ధ్యానం, యోగా సాధన వంటి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఎస్‌ఐబీలో.. ఎనిమిదేళ్లు ఏం చేశారు?

- యాక్సిలరేటరీ పదోన్నతి ఎందుకు ఇచ్చారు?
- మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుపై ప్రశ్నల వర్షం

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్‌ఐబీ)లో ఆధారాల ధ్వంసం కేసుల్లో ఆరోపణలను ఎదుర్కొంటున్న మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుపై పంజాగుట్ట పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రణీత్‌రావును ఏడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు శనివారం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే..! ఆదివారం ఉదయం ఆ మేరకు పంజాగుట్ట పోలీసులు అతణ్ని చంచల్‌గూడ జైలు నుంచి తమ కస్టడీకి తీసుకున్నారు. ఆ వెంటనే జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఓ రహస్య ప్రదేశంలో అతణ్ని విచారించింది. తొలుత సాధారణ ప్రశ్నలతో ప్రారంభించి, పలు కీలకాంశాలపై దృష్టి సారించింది. "ఎస్‌ఐబీలో ఎనిమిదేళ్లపాటు ఏం చేశారు? మీ రోజువారీ విధులేంటి?" అంటూ ప్రణీత్‌రావు కార్యకలాపాలను రికార్డు చేసినట్లు తెలిసింది. ప్రణీత్‌రావుకు వచ్చిన యాక్సిలరేటరీ పదోన్నతిపైనా పలు ప్రశ్నలను సంధించింది. "మీకు యాక్సిలరేటరీ పదోన్నతి ఎందుకు వచ్చింది? పదోన్నతికి ప్రభుత్వానికి సిఫారసు చేసిన అధికారి ఎవరు?" అనే అంశాలపై ప్రశ్నలు అడిగింది. ముఖ్యంగా ప్రణీత్‌రావుకు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన అనుభవం పెద్దగా లేదు. యాంటీ-టెర్రరిస్ట్ ఆపరేషన్లలోనూ పాల్గొనలేదు. ఎనిమిదేళ్లు ఒకేచోట పనిచేశారే తప్ప.. ఎస్‌హెచ్‌వోగా కూడా ఎక్కడా సేవలందించలేదు. అలాంటప్పుడు యాక్సిలరేటరీ పదోన్నతి రావడానికి కారణమేంటని ప్రశ్నించినట్లు తెలిసింది. "2018లో ఎస్‌ఐబీలో ఇన్‌స్పెక్టర్‌గా ఎంటరయ్యారు. 2023 వరకు అక్కడ ఏమేం చేశారు? ప్రత్యేకించి రెండు గదులు, 17 కంప్యూటర్లు, ప్రత్యేక ఇంటర్నెట్ కనెక్షన్ వంటి సదుపాయాలు కల్పించడానికి కారణమేంటి? మీరు ఏ అధికారికి బాధ్యులుగా పనిచేశారు?" అని ప్రశ్నలు వేసినట్లు సమాచారం. "మీరు ఎస్‌ఐబీలో పనిచేసిన ఎనిమిదేళ్లలో.. ఎందరో అధికారులు బదిలీపై వచ్చారు. మళ్లీ వేరేచోట్లకు బదిలీ అయ్యారు. వారి వద్ద మీ విధులు ఏమిటి?" అని సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. 2007 బ్యాచ్ అధికారి అయిన ప్రణీత్‌రావు గతంలో పనిచేసిన ఆయా ప్రాంతాల్లో ఆయన ప్రవర్తన, ఇతర అంశాలపైనా ప్రశ్నించారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వ పెద్దలతోపాటు.. ఓ ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐబీలోని పలువురు సిబ్బందికి ఈ కేసుతో ప్రమేయమున్నట్లు దర్యాప్తు అధికారులు ఆధారాలను సేకరించారు. ఫోన్‌ట్యాపింగ్‌లో వీరి పాత్రపై సోమవారం రెండో రోజు పోలీసు కస్టడీలో భాగంగా ప్రణీత్‌రావును ప్రశ్నించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆఫ్‌లైన్ కోటా పెంపు

- కోడ్ నేపథ్యంలో టీటీడీ తాజా నిర్ణయం

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు అందజేసే దాతలకు ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల ఆఫ్‌లైన్ కోటాను పెంచుతూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమల్లోకి రావడంతో ఎప్పటిలానే శ్రీవారి దర్శనాలు, తిరుమలలో వసతికి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల స్వీకరణను రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని వీఐపీలు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉంటాయని టీటీడీ స్పష్టం చేసింది. ఈ క్రమంలో ప్రస్తుతం తిరుమలలో శ్రీవాణి ట్రస్టు దాతలకు రోజుకు 400, తిరుపతి ఎయిర్‌పోర్టులో విమాన ప్రయాణికులకు వంద చొప్పున మొత్తం 500 టికెట్లను జారీ చేస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫారసులు రద్దయిన నేపథ్యంలో ఆదివారం నుంచి ఈ కోటాను పెంచింది. తిరుమలలో శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు ఇచ్చే దాతలందరికీ టికెట్లను ఇవ్వాలని నిర్ణయించింది. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయానికి తిరుమలలో 702 టికెట్లు పొందారు. అలాగే ఎయిర్‌పోర్టులో 145 టికెట్లు జారీ చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈకోటాలో మార్పులు చేయాలని టీటీడీ భావిస్తోంది. కాగా, తిరుమలలో శ్రీవాణి ట్రస్టు కౌంటర్లను పెంచి, భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించాలని టీటీడీ నిర్ణయించింది.

వేదనామయ జగత్తులో ప్రార్థన

ఫాల్గుణ మాసం నడుస్తోంది. ఉదయపు గాలుల్లో చలిపొడ పూర్తిగా తప్పుకుని, వేడి తెలుస్తోంది. మార్నింగ్ స్కూళ్ళూ, పరీక్షల కోసం ముందే వచ్చేసే స్కూల్ బస్సులూ, ఆఫీసుల కోసం ఏడింటికల్లా అపార్ట్‌మెంట్‌ల నుండి చీమలబారుల్లా బయటకొచ్చేస్తున్న కార్లూ, రయ్యిరయ్యిన దూసుకుపోయే డెలివరీ అబ్బాయిల బళ్ళూ అన్నీ కలిసి నగర జీవితపు రద్దీనంతా ఉదయాల్లోకి ఒంపుతున్నాయి. అట్లాంటి ఒక హడావుడి ఘడియలోనే నా బాల్కనీలోని తీవెలకు గుత్తులు గుత్తులుగా పూవులు పూయడాన్ని గమనించాను. ఆ పూవుల పక్కన సర్దుకు కూర్చుని, ఇన్నాళ్ళూ కనపడని ఓ బుజ్జి పిట్ట. ఆగీ ఆగీ తాకుతోన్న దాని తీయని పిలుపు.

"ఆ ఒక్క కూజితంతో కోకిల/ నా నగర జీవితాన్నంతా ఒక మూలకు తుడిచేసింది" అన్న వాడ్రేవు చినవీరభద్రుడి కవితాపాదాల్లోని బలం అనుభవంలోకి వచ్చిన క్షణాలవి. కాసేపు బయట హోరన్ల రొద నుండి తప్పించుకుని, నా క్షణాలను ఆ కోకిల కూత చుట్టూ, విప్పారబోతున్న పూలరెక్కల చుట్టూ తిప్పుకున్నాను. అక్కడ నిలబడ్డ ఆ కాసేపట్లోనే 'కోకిల ప్రవేశించిన కాలం' కవితా సంపుటిలోని పంక్తులు ఒకటొకటిగా జ్ఞాపకమొస్తూంటే అనిపించింది, కవిత్వం చేసే మంచిపని, జీవితంలోని కొన్ని అపురూపమైన క్షణాలను గుర్తుపట్టగల సున్నితత్వాన్ని పాఠకుడిలో మేల్కొల్పడమని. దైనందిన జీవితాన్నంతా పక్కకు తుడిచి, కాసేపొక రసజగత్తులో తిప్పి తీసుకురాగలగడమని.

మనం నగరాల్లో జీవిస్తున్నాం కానీ,
ఎవరి పల్లెల్ని వాళ్ళు తడుముకుంటూనే ఉన్నాం
కిక్కిరిసి జీవించవలసి వస్తున్నందుకు
ఖేదించడం లేదన్నట్టు నటిస్తూనే
ఆ బాల్యకాల వైశాల్యాల్నే
పునః పునః స్మరిస్తున్నాం

- అన్న చినవీరభద్రుడి చురుకైన గమనింపుని, 'కోకిల ప్రవేశించిన కాలం' సంపుటిలో చదివినప్పుడు, ఒక్క కోకిలను అడ్డం పెట్టుకుని, ఈ కవి నగర జీవితాన్ని పక్కకు నెట్టుకోవడం గమనించినప్పుడు, నాకు అర్థమైనదిదే. మనం పాతబడిన కవి సమయాలనుకునేవి- అది కోయిలైనా, పూవులైనా- నిజానికి ఎన్నటికీ పాతబడవు. ఎందుకంటే, వాటికి మనలోని బాల్యకాల స్మృతులను సజీవంగా ఉంచడమెలాగో తెలుసు. మనలోని ఆశని, మనలోని వసంతాన్ని.

BBB

కోకిలకూ వసంతానికీ, వసంతానికీ కవిత్వానికీ ఏదో అవినాభావ సంబంధముంది. పువ్వెడు వసంతం కోసం కవిత రాసిన శేషేంద్ర, "వసంత ఋతువు వచ్చిందో లేదో ఆ కోకిల కంఠం ఎలా పేలిపోతోందో చూడు" అంటారు. తొలిపొద్దు తెమ్మెర త్రోవలో పయనమై పరువెత్తు కోయిల గొంతున చిక్కిన వసంతగీతిని కృష్ణశాస్త్రీ గానం చేశారు. "పూలపూజలు సల్పిన మోహనుడు వసంతుడాతని రాక నీవింత చాటనేల..." అని ఆ బుల్లిపిట్టను నిగ్గదీసిన రాయప్రోలు, దానిని కన్నె పూబోండ్లకు రాయబారాలు గావించే దూతగా భావన చేస్తారు. కోకిల మీద అపురూపమైన పద్యాలెన్నింటినో రాసిన ఈ 'కోకిలస్వామి' కవిగారి ఇంటి ముందు గున్నమామిడి చెట్టు ఉండేదిట. లలితానామ పారాయణం చేసి వరండాలో కూర్చోగానే కొమ్మ మీద కోకిల కుహూకుహూరావాలు చేసి రచనకు ప్రేరేపించేదట. అందుకే, "మామిడికొమ్మ మీద కల మంత్రపరాయణుడైన కోకిల స్వామికి మొక్కి" ఈ అభినవ స్వరకల్పనకు ఉద్యమించితిన్...అని రాసుకున్నారాయన. ఆ కోకిల వాల్మీకి అనుకోవడంలోనూ దోషం లేదన్నది వేరే సంగతి.

కానీ, భద్రుడి కోకిల మాత్రం వీళ్ళందరి ఊహల కన్నా భిన్నమైనది. ఎందుకంటే, భద్రుడి కోకిల మాత్రమే, వసంత కాలపు వైభోగంతో పాటు, ఆ సౌందర్యానికి ఆగి నిలబడి కైమోడ్పులేని నగర జీవితపు ఇబ్బందిని కూడా పసిగట్టింది. అందుకే అది తన గానంతో ఈ మనిషిని ఒక్క చరుపు చరిచి ఇంకో దిక్కుకి తిప్పే ప్రయత్నం చేసింది.

వసంతకాల సాయంకాలం
నగరం తన పనిలో తానున్నది,
60 లక్షల మంది మనుషులకు
అరవై లక్షల వ్యాపకాలు

సంధ్యాకాంతి బంగారం కురుస్తున్నా
సేకరించుకునే తీరిక లేదెవ్వరికీ
రావి చెట్లు మరకతాలు చిమ్ముతోన్నా
ఏరుకునే వ్యవధి లేదెవరికీ

అదిగో, అట్లాంటి కాలాల్లోనే ఈ వసంతసూచక కోకిలకంఠం వినవచ్చిందని రాస్తారు. ఆ కంఠం ఒక సూచన. తీరిక లేని వ్యాపకాల్లో తలమునకలుగా ఉన్న నగరజీవికి, జీవన మాధుర్యం వైపు తల తిప్పి చూడమనే హెచ్చరిక. బహుశా అందుకు, ఈ కోకిల పిలుపు అడవులకో పల్లెలకో మాత్రమే సొంతమైంది కాదని చెప్పినందుకు, అందరి కంటే ఎక్కువగా ఈ కోకిల కావలసినది, ఈ కోకిల కంఠాన్ని సొంతం చేసుకోవలసింది నగర జీవేనని గుర్తుపట్టినందుకు, ఈ నగర జీవితపు ఏకాకితనాన్ని ముక్కలు చెయ్యగలిగిన శక్తి కోకిల కూజితానికి ఉందని గుర్తు చేసినందుకు, భద్రుడి కోయిల ప్రత్యేకము, అపురూపమూ కూడా. అందుకే ఆ కవిత్వం, "లోకమొక కోకిల కోసం ఎంత ఎదురు చూసిందో/ కోకిల కూడా లోకం కోసమంతగానూ ఆరాటపడింది" అని నమ్మించగలిగింది. కోకిలలానే, "నువ్వు పాడవలసిన పాట నువ్వే పాడాల"ని ఉత్సాహపరిచింది.



BBB

'కోకిల ప్రవేశించిన కాలం' కవిత్వాన్ని చేతుల్లోకి తీసుకోగానే, క్షణాల మీద పాఠకుడిని పట్టి నిలబెట్టేది ఆ పదాల్లోని సారళ్యం. ఒక్కో పాదం చదువుతుంటే కళ్ళ ముందు పరుచుకునే నిస్తుల భావసౌందర్యం ముగ్ధుల్ని చేస్తూంటుంది. నిరాడంబరత్వం, సూటిదనం కలగలిసిన ఆ పదచిత్రాలు రేకెత్తించే స్ఫురణలు అలౌకికమైన ఆనందాన్ని హృదయంలోకి ఒంపుతాయి. ఉదాహరణకు, కోకిల కూజితం గురించే చూడండి, కవి ఎన్ని రకాలుగా చెప్తాడో,

"అది నేను దాటి వచ్చిన ఏ అడవుల్లోంచో
దూసుకొచ్చిన శరంలాగా నన్ను గుచ్చుకుంటున్నది
నా చిన్ననాటి స్నేహితుడెవ్వడో మా ఊరి నుంచి
బిగ్గరగా పిలుస్తున్నట్టు నన్ను కుదిపేస్తున్నది."

వేదనామయ జగత్తులో ప్రార్థనలాగా/ వినిపిస్తున్నది దాని పలుకు - అని కవి రాశాడంటే, అది ఎట్లాంటి శాంతినీ, ఓదార్పునీ, బలాన్ని ఇస్తుందో ఊహించగలం కదా.

"ఇంటి ముందు ఆటోలో అతిథి వచ్చిన చప్పుడైనట్టు/
నిద్రాలోకపు కొసన ఎవరి సెల్‌ఫోన్‌లోనో
లతా మంగేస్కర్ రింగ్‌టోన్‌గా వినవస్తున్నట్టుందా పిలుపు"

కోకిల ఇట్లా వదులుకోలేని బంధమై ప్రతి వసంతంలోనూ చుట్టుముట్టింది ఈ కవినేనేమో! ఆ ప్రేమా, ఆ ప్రేమలోని బలమైన ఆకర్షణా, పాఠకుడినీ ఏదో ఒక చోట తాకకుండా పోవు. తెలవారుతూండ గానే పలకరించే పక్షి కూతలని తలుచుకుంటూ కవి "ఎక్కడో ఓ పక్షి కిలకిలతో ఆకాశం తలుపు తెరుస్తుంది" అంటారు కొండ మీద అతిథి సంపుటిలో. పక్షుల కిలకిలలతోనే ఈ లోకంలో వెలుగులు నిండుతున్నాయనడం అపురూపమైన మాట. ఈ వాక్యంలోని సౌందర్యాన్ని గురించి ఆలోచించిన కొద్దీ రసజ్ఞ పాఠకులకు కొత్త అర్థాలు స్ఫురిస్తూనే ఉంటాయి.

ఎక్కడి నుండి వస్తుందో కోకిల
సరసులాంటి నీ తెల్లవారుఝాములో
అల్లరిపిల్లవాడిలా ఒక జ్ఞాపకం విసుర్తుంది
ఇక వలయాలు వలయాలుగా మనసు చిట్లిపోతుంది

- ఈ కవి మనసు ఇక్కడితో తృప్తి చెందలేదు. దీని తరువాత వచ్చిన నీటి రంగుల చిత్రం సంపుటిలో రాస్తారిలా :

ఆఫీసులో పని మధ్య, చుట్టూ కాగితాలు, ఎదట
పార్కులో ఒకటే మారాం చేస్తున్న కోకిల
- -
చిన్నపిల్లలా కోకిల నా చుట్టూ గీపెడుతూ
పిలవగానే పరుగెత్తుకు రమ్మంటున్నది, చిన్నప్పుడు
ఏ పిల్లవాడూ ఆటల కోసం నన్నిట్లా పిలవలేదు, నవ
యవ్వనవేళ ఏ యువతీ నన్నిట్లా అల్లరి పెట్టలేదు

- ఎట్లాంటి ఊహ! కోయిలను బాల్యకాల స్నేహితుడిగా, యవ్వన కాలాల్లో కవ్వించే యువతిగా భావన చేయడమా! అలా రాయడానికి కోయిలను కేవలం ఒక కవితా వస్తువుగా చూడగల మనసు సరిపోతుందా! తరిగిపోయిన కాలాల స్మృతిగీతాన్ని ప్రతి వసంతంలోనూ పునః పునః గానం చేసే కోకిలను తన నుండి వేరు చేసుకుని చూడలేని హృదయమైతేనే తప్ప ఇట్లాంటి కవిత్వాన్ని రాయలేదు. రాయలేదు.

BBB

కోకిలను నెపంగా ముందుంచుకుని, జీవన సౌందర్యాన్నంతా పరచిన ఆ కవితలను పక్కన పెడితే, ఈ పుస్తకంలో మననం చేసుకోదగిన కవితలు ఇంకా ఎన్నో ఉన్నాయి. తీపిపూల గాలి, పూర్తిగా పూసిన పూవు లాంటి పొద్దుటి ఎండ కుమ్మరించిన పసుపు రంగు, కానుగ చివుళ్ళ నిగనిగలతో శోభిల్లే నగర వైభవం, పండుటాకుల వేప కొమ్మల మధ్య ధూపం వేసినట్టున్న తొలి వెన్నెల, వేకువ చంద్రుడి పచ్చకర్పూర లోకం... ఇలా కవిత కవితలోనూ రసం చిప్పలజేస్తున్నట్టున్న పద బంధాలను ఎవరికి వారే చదువుకోవాలి. ఆ పదాల్లోని నిర్మలత్వంలో తెప్పరిల్లి లేవాలి. దైనందిన జీవితపు హడావుడిలో నుండి, ఆవహించే అలసట నుండీ కొన్ని క్షణాల పాటైనా మనిషిని పక్కకు నెట్టగల శక్తి ప్రకృతికి తప్పకుండా ఉంటుంది. కానీ కవి అన్నట్టు,

ఒక కోకిల లోకం కోసం గొంతు సవరించాలంటే/ లోకం కూడా కోకిల కోసం చెవులు రిక్కించాలి.

అన్న మాటను జ్ఞాపకముంచుకోవాలి. కాళిదాసూ చెప్పాడు, రత్నం నన్నెవరు ధరిస్తారని అన్వేషించదు, ధరించదలచినవారే రత్నం కోసం అన్వేషిస్తారని. కాబట్టి వెదుక్కోవాలి ఆ పిలుపుల కోసం. ఆ పిలుపులు వినపడే త్రోవలు పరిచిన ఇట్లాంటి పుస్తకాల కోసం. చెవులు రిక్కించాలి. ఎవరికి వారే. ఎందుకంటే, మొదలవుతోందిప్పుడే, కోకిల ప్రవేశించే కాలం.

మానస చామర్తి
79754 68091



ఊరిడిసి పోతప్పుడు

దేవులాటలన్నీ ఒక్క మోపున
ముసురుకున్నప్పుడు
నిద్రలేని మాపులు కొన్ని
కనుగుడ్ల మీద కలత సూదులు
గుచ్చుతయి

పొదుగుబట్టి పాలుగుడిసె మేకపిల్లను
బల్మీటికి పట్టి గుంజుకపోయినట్టు
బస్తీవైపు బతుకు తొవ్వొకటి
బలవంతంగా తెరుసుకుంటది

పాత పుస్తకాలు సినిగిన బట్టలు
ఇరిగిన కుర్సీలు తెగిన చెప్పులు
ఇవే కదా
ఇక్కడ వదిలేసి పోతున్నవి
మరి గిదేం సిత్రమో...
బరువు తగ్గుతుంటే
భారం పెరిగినట్టయితుంది

సంతోషాలను తోర్నపాకు కట్టి
ఈ బజాట్లనే కదా ఊరేగింది
కలతలన్నిటిని ముక్కలుగా నరికి
ఈ ఆడకట్లనే కదా ఎగజల్లింది
వస్తువులైతే ఎట్లనో వదిలేసి పోతా
మరి జ్ఞాపకాలనెలా వదలను?

ఎక్కడికిపోయినా తోకూపుకుంట
సందుమూలదాంక సాగదోలే విశ్వాసాన్ని
ఎన్ని బండ్లుకట్టి ఎంట తోలుకపోను?

ఎంటబడి ఉర్కొచ్చిన లేగదూడ
నెనరుగా నాకిన తడి అచ్చులు
ఒల్లంతా నాకిప్పుడు
కనిపించని పుట్టుమచ్చలు

తిన్నావా నాయన అని
కడుపు నింపే ముచ్చట్లు
ఆపదకు సాపదకు
అక్కరకొచ్చే సోపతులు
రేపు ఇక..
పిల్లలకు చెప్పుకునే నీతి కథలు

తూప్రాసిలో ఊరబిక్కెల
అరుపులు
సాయమాను కింద
బల్లెపీట మీది దరువులు
యాదికొచ్చినప్పుడల్లా
దించుకోలేని బరువులు

నీడను మోసిన నేలను
గుండె పొరల్లో సర్దుకొని
శ్వాసలు తీసిన గాలిని
తిత్తుల నిండా నింపుకొని
నెత్తురు పంచిన అమ్మనూ
నెత్తిన తిప్పిన అయ్యనూ
ఎద పుటల్లో దుఃఖ పదాలుగా
రాసుకుని
బతుకు పడవనెక్కి
మెతుకు వేటకు పోతున్న

భారమైన గుండెతో...
ఇయ్యాల నేను
నా ఊరిడిసి ఎల్లిపోతున్న

తుల శ్రీనివాస్
99485 25853

ప్రతి ఫాసిస్టుకి సత్యంతో పేచీ ఉంటది

తెలుగు ప్రజలకూ, బెంగాలీ సాహిత్యానికీ అవినాభావ సంబంధం ఉంది. ఠాగూర్, బంకించంద్ర చటర్జీ, శరత్ బాబులు ఇక్కడ ఇంటింటికి పరిచయమయ్యారు. ఇప్పుడు మీ కవిత్వం తెలుగులోకి అనువాదం అయింది. ఎలా ఫీలవుతున్నారు?

నన్ను ఇలా పరిచయం చేస్తున్నందుకు, మొట్టమొదట మీకు కృతజ్ఞత చెప్పుకుంటున్నాను. తెలంగాణ ప్రజలతో నాకు సరికొత్త గాఢానుబంధం ఉందని భావిస్తాను. అది ఏమిటంటే చెప్పలేనేమో కానీ రమాసుందరి (మాతృక ఎడిటర్), ఉదయమిత్ర, వేణుగోపాల్, వరవరరావు లాంటి వారల సహచర్యంతో, నాకు నా సొంత గడ్డమీద ఉన్నట్లే అనిపిస్తది. మీకు ఒక విషయం చెప్పాలి నా మొదటి పుస్తకం 'The Musings of the Dark' 2019లో అచ్చయినప్పుడు, రమాసుందరి మొదటి ప్రతిని ఫేస్‌బుక్‌లో ఉంచి, ప్రపంచానికి నన్ను పరిచయం చేశారు. ఆమె నాకు Language of Pains కవితను ఆడియో చేసి పంపారు. ఆ కవిత చదువుతూ, ఆమె కళ్ళు చెమర్చడం ఒక మర్చిపోలేని అనుభూతి. తెలంగాణ ప్రజలతో నాకున్న భావోద్వేగ అనుబంధం ఇటువంటిదే.

మీరు సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చారు కదా. మీరు ఉంటున్న 'సిలిగురి' కూడా వెనుకబడ్డ ప్రాంతమే. అయినా మీకు జాతీయ, అంతర్జాతీయ అంశాలమీద ఈ పట్టు ఎలా వచ్చింది?



పలకరింపు

మౌమితా ఆలం

నేను ఉత్తర బెంగాల్లోని మారుమూల ప్రాంతం నుండి వొచ్చాను. అది పూర్తిగా లోతట్టు ప్రాంతం. 'తీస్తా' నది ఒడ్డున నివసించేదాన్ని. అక్కడే పుట్టి పెరిగాను. బాల్యమంతా అమ్మమ్మ, పిన్నమ్మ సాన్నిహిత్యంలో గడిచిపోయింది. నాకు మా అమ్మా నాయనలతో పెద్ద అనుబంధాలు ఏమి లేవు. వాళ్ల ఒక లోతట్టు ప్రాంతంలోని టీ తోటల్లో పనిచేసేవాళ్ళు. చిన్నప్పటినుంచి మా 'కాలా' (పిన్ని) నా చదువుపట్ల శ్రద్ధ వహించేది. మా ఊరికి 20కి.మీ. దూరంలో గల స్కూలులో నాకు అడ్మిషన్ దొరికింది (1996-97). ప్రయాణమంతా దారుణంగా ఉండేది. నేను సైకిల్ నేర్చుకునే దాకా, రెండు కిలోమీటర్లు బురద బాటలో నడిచి, ఆ తర్వాత ఒక రిక్షా తీసుకొని బస్టాండ్‌కు చేరుకునేదాన్ని. కానీ, ఆ ప్రయాణమే తర్వాతి కాలంలో, ఒక వరంగా మారింది. స్కూలుకు వచ్చి పోయేటప్పుడు, అక్కడి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడేదాన్ని. వాళ్లు కూడా నాతో అంతే ఆప్యాయంగా ఉండేవాళ్ళు. ఆ పల్లె జనాల వల్లనే నాకు దయ, దృఢత్వం, నిరాడంబరత అబ్బినాయి. ప్రజలతో గల ఈ సాన్నిహిత్యమే నాకు రాజకీయ స్పృహను కలిగించింది.

పట్టణంలో డిగ్రీ పూర్తి చేశాను. ఈ లోపున మా చిన్నమ్మ పెళ్లయిపోయింది. ఆమె భర్త (వరుసకు చిన్నాయన) సరాసరి మా ఇంటికి వచ్చేసాడు. ఇంట్లోకి అతగాడి ప్రవేశంతో నా జీవితం దుర్భరమైపోయింది. భయంకర బాధల పల్లవి నా బాల్యం. కళ్ళు మూసుకుంటే చాలు, ఇప్పటికీ అది నన్ను వెంటాడుతది. అసలు నాకు బాల్యం అనేది లేకుంటేనే బాగుండును అనిపించేది. అర్ధరాత్రి నన్ను లైంగికానందం కోసం తడిమే ఆ హంతక హస్తాలు ఇప్పటికీ వెంటాడుతున్నట్టు అనిపించి రాత్రులు నిద్ర పట్టదు.

ఇంగ్లీష్ సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్ చేశాను. మూడేళ్ళకు టీచర్‌ని అయ్యాను. ఆ క్రమంలోనే, నేను ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లాడాను. నా కుటుంబం ఒప్పుకోక పోవడంతో వాళ్లతో అన్ని సంబంధాలు తెగిపోయాయి. పోనీ కాపురమైనా నిలుస్తదేమో అనుకుంటే, అది కూడా మూన్నాళ్ళ ముచ్చటే అయింది. నిత్యం తిట్లతో, హింసతో కాపురం నిత్యాగ్ని గుండమైంది. నాకు 2019లో విడాకులు వచ్చినా, 2017నుండి నేను నా భర్తతో విడిపోయే ఉన్నాను. నాకు ఎనిమిదేళ్ళ పాప ఉంది. తానే నా సర్వస్వం నేను కాలేజీ చదివేటప్పుడు బుక్స్ కొనడానికి సరిగా డబ్బులు ఉండేవి కావు. ఉద్యోగం వచ్చాక పుస్తకాలు కొని బాగా చదవడం మొదలు పెట్టాను. ఆ ప్రయాణం కొనసాగింది. నా కలహాల కాపురంలో పుస్తక పఠనం ఒక ఉపశమనంగా ఉండేది.

మీరు చాలా సాహసంగా రచనలు చేస్తున్నారు. పబ్లిషర్స్‌తో సమస్యలు ఏమీ ఉండవా?

ప్రతి ఫాసిస్టుకి సత్యంతో పేచీ ఉంటది. నేను రాస్తున్నానంటే నడుస్తున్న కాలానికి ప్రతినిధిగా రాస్తున్నా. సంతోషకరమైన విషయం ఏమిటంటే, ఇప్పటికీ కొన్ని పత్రికల్లో నిరసన కవితలకు చోటు దొరుకుతున్నది. 'ద వైర్', 'అవుట్‌లుక్', 'కౌంటర్ కరెంట్స్', 'నాగరిక్.నెట్', 'ఉత్తర్ బాంగా సంబత్' లాంటివి నా కవితల్ని వేసుకుంటున్నాయి ఎన్. రవిశంకర్ గారు నా కవితలకు చేసిన అనువాదాన్ని కొన్ని మలయాళ పత్రికలు స్వీకరిస్తున్నాయి. తెలుగులోనైతే 'మాతృక' నాకు మొదటి నుంచి గొప్ప మద్దతుగా నిలుస్తోంది.

మామూలు పదాలతో ఇంత క్లిష్టమైన విషయాలను ఎలా చెప్పగలుగుతున్నారు? మీపై ప్రభావాలు?

నా కవితలు జోల పాటలు కావు. అవి ప్రజల్ని చైతన్యం చేయడానికి రాసినవి. నా పదాలకు కార్మికుల, కర్షకుల, దగాపడ్డ మహిళల చెమట వాసన ఉంటది. నా అక్షరాలు నా చుట్టూ జరిగే హింసకు నిరంతర సాక్ష్యాలు. కులం, మతం, వర్గం, జెండర్ పేరు మీద నా చుట్టూ హింస అల్లుకుంటున్నది. నన్నెవరు ప్రభావితం చేశారు అనేది చెప్పడం కష్టమే. కానీ, అరుంధతీరాయ్, ఆగా షాహిద్ అలీ, వరవరరావు, నాజుల్ ఇస్లాం... మొదలైన వాళ్ళ రచనల్ని ఇష్టంగా చదువుకుంటాను

ఇప్పుడు కుల, మత, భాషల్లో ఆధిపత్య ధోరణులు ఎక్కువయ్యాయి. జెండర్ వివక్ష కొనసాగుతూనే ఉంది. దీనికి పరిష్కారం ఏమిటి?

నేను రాజకీయ నాయకురాల్ని కాదు. కానీ రాజకీయ స్పృహ కలిగిన ఓ కవయిత్రిగా, వ్యాస రచయిత్రిగా నేను చెప్పేది ఏమంటే, కేవలం వర్గ స్పృహ కలిగిన రాజకీయాలు మాత్రమే అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలవు. సరైన మార్గంలో నడిపించగలవు

మతోన్మాద రాజకీయ వాతావరణంలో, ఒక ముస్లిం మహిళగా మీరెట్లా ఫీల్ అవుతున్నారు. నిత్యం వెంటాడబడి, వేధించబడి, హత్యకు గురయ్యే మహిళలకు మీరిచ్చే సందేశం ఏమిటి?

ఇప్పుడు ముస్లిం మహిళల పరిస్థితి అతిదారుణంగా ఉంది. చాలా వివక్షను ఎదుర్కొంటున్నారు. రోజురోజుకి మతోన్మాదుల చేతుల్లో ముస్లిం మహిళలు బలవుతున్నారు. 'బుల్లి బాయ్ సుల్లి డీల్స్' యాప్ వంటి నీచ నికృష్టమైన యాప్స్‌ని చూస్తున్నాం. ఫాసిజం యొక్క అనేక పార్శ్వాలు మమ్మల్ని, మా కలల్ని ధ్వంసం చేస్తున్నాయి. ఒక ముస్లిం మహిళగా మమ్మల్ని చిన్నచూపు చూడడం మాకు ఎరుకనే. అది మా వెన్ను మీద పాము పొరాడినట్లుంటుంది. కానీ సాధ్యమైనంతగా ఎదిరించాలి. చదువుకునే విషయంలో మనం వెనుకంజ వేయొద్దు. విద్యాధికులైన మహిళలు ముందుకొచ్చి, అట్టడుగున అవమానాలకు గురవుతున్న ముస్లిం మహిళలకు చేయూతను ఇవ్వాలి. జ్ఞానమే ఆయుధంగా ఫాసిస్టులను ఓడించాలి. ఎందుకంటే ఫాసిజానికి అజ్ఞానమే ఆధారం.

మీరు ఇప్పుడు నవ యువ కవులకు ప్రతినిధి గదా. వాళ్లకూ, అంతిమంగా తెలుగు వాళ్లకూ మీరిచ్చే సందేశం ఏమిటి?

ప్రపంచం రక్తమోడుతుంటే, చంద్రుని అందం మీద పద్యం రాయొద్దన్నదే నా సందేశం.

ఇంటర్వ్యూ, అనువాదం: ఉదయ మిత్ర

(ఉదయమిత్ర అనువాదంలో మౌమితా ఆలం కవిత్వం 'రాయగూడని పద్యం' సంపుటిగా ఇటీవల విడుదలైంది)

ఓ స్త్రీవాది ఒప్పుకోలు/

A Feminist's confession



నేనీ వేళ వచనమై పోవచ్చు
వాచ్యమై తేలొచ్చు
మౌనమై మిగలడం కన్న మిన్న!

అవును
నేను స్త్రీ వాదిని
ఇరవయ్యో శతాబ్దపు సాహితీ సంద్రాన
ఉప్పెనలా ఎగసి పడిన
ఎనభై దశకపు మహిళను ప్రేమిస్తాను
ద్వితీయ శ్రేణి తృతీయ శ్రేణులు కాదు
మనిషి మనిషీ సగౌరవంగా మెలిగే
సమాజ సౌందర్యాన్ని కళ్ళకు కట్టినందుకు

2.
నడిచే స్వతంత్రమిచ్చామని అడుగులు నీవేననుకోకు
చదివే స్వేచ్ఛ ఇచ్చామని జ్ఞానం ప్రదర్శించే అతి చేయకు
ఉద్యోగం చేసుకోమన్నామని నిర్ణయం నీదేననుకోకు
ప్రతీ రంగంలో చోటిచ్చామని అంతా నీవేననుకోకు
ఆకాశంలో సగమనే భ్రమలు వీడు
అడుగున ఉన్న నేలే నువ్వంటూ
అడుగడుగునా తీర్పరులు కొలువు తీరిన
ఈ లోకుల న్యాయస్థానంలో
ఇచ్చేదెవ్వరు
తీసుకోవడం ఏమిటని
సమానత్వ వాదన వినిపించే ప్రతిసారీ
బోనులో నిలబడ్డ ముద్దాయిలా
అనివార్యంగా
నేనొక ప్రమాణం చేసి తీరాలి
నేను పురుష ద్వేషిని కాను
పురుషులందు పుణ్యపురుషులు వేరయా అని పాడి తీరాలి

3.
కలువల్లాంటి కళ్ళు కాస్తా ప్రశ్నల కొడవళ్ళు నింపుకుంటే
బదులుగా నను బందీ చేసేందుకు
నీ చేతుల్లో రెండు బేడీలు
మాతృత్వం, పవిత్రత; సదా సిద్ధం
లేదా
కొత్త విశేషణాలతో నను నిర్వచిస్తుంటావ్
బరులు తెగించిన లకార ముకార పదాలు వరుస కడతాయి
చులకన చూపుల, ఛీత్కారాల, అవమానాల అస్త్రాలతో
వివస్త్రను చేసినంత పని చేసి
నా ఇంటిని ఒంటిని కుటుంబాన్ని భవిష్యత్తుని
నడిరోడ్డు మీద పందేరేనికి పెడతావు
నిజమెంతో అబద్ధమెంతో లోకానికి అవసరం లేనిచోట
పుకార్ల పునాదుల మీద ఆధిపత్యాలు చెలరేగే చోట
అయితే గియితే
ఆగిపోతాను
లేదా
ఆత్మహత్య చేసుకుంటాను
లేదంటే
నడుంబిగించి కడదాకా కదనస్ఫూర్తి నింపుకుంటూ నడుస్తుంటాను

4.
పక్కపక్కనే నడుస్తున్నట్టుంటూ
నిన్న కుడివైపు తుమ్మావు
ఇవాళ ఎడమవైపు దగ్గుతున్నావేం అంటావ్
నా దిక్కేదో నువ్వే నిర్ధారిస్తావ్
నాకు ఎరుకలో ఉన్న సంగతులు పలుకుతుంటా
ఆయా సంగతులు శ్రుతిబద్ధంగా ఉన్నా
అబ్బే ఏం బాలేదని తేలిక చేస్తావ్
ఇంకో తెలియని రాగంలో బాణీ ఎందుకు కూర్చలేదంటావ్
వర్ణవర్ణములుగా వేలెత్తి చూపి
గీతాలను కొట్టివేస్తావ్
నా కొంగుతో ఆకలిని వార్చుకుంటాను
అదే కొంగును కాల్చి
నీ ఆకలి చూపుల ముఖంపై విసిరి కొడతాను
నేనొక భావజాలమై ప్రవహిస్తుంటే
పాయలు పాయలుగా చీల్చి
ఉధృతిని నిలువరిస్తావ్
అలక్ష్యం నీ ఆయుధం
విలువ లేకుండా చేయడం నీ లక్ష్యం

5.
నా ఒంటిని
మెడను
కాళ్ళను
వేళ్ళను చుట్టుకున్న అలంకారాలతోనో
నా నుదుటి కుంకుమ రంగులతోనో
చివరికి
నా ముఖకవళికలు
నేను కూర్చున్న తీరు
నిల్చున్న
నడిచిన
నవ్విన
ఏడ్చిన తీరులతో
నన్ను
నా వ్యక్తిత్వాన్ని అంచనా కడుతుంటావ్
నీ విశ్లేషణలు విని
ఆశ్చర్యపోవాలి
ఒప్పుకుని తీరాలి
నో ఆప్షన్
నీదైన సిద్ధాంతంలో
నన్ను నన్నుగా ఆవిష్కరించుకోనివ్వని అనేక సూత్రాలు

నాకు ఊపిరాడనివ్వని గదుల్లో
ఎంతో ప్రయాస పడి కిటికీలు తెరుచుకుంటాను
ఇనుప బీగాలెన్నింటి తుప్పునో విదిలించి
తలుపులు తెరుస్తుంటాను
శీలం నీ జేబులోని ట్రంప్ కార్డ్
ఎప్పటికప్పుడు
నా చుట్టూ అల్లబడ్డ అపనిందల అపోహల వలలను తెరపైకి తెస్తావు
కొత్త భయాలను నిర్మించి
ముందడుగు వేయనివ్వని రేఖల్ని గీయగల నీకు
కొత్త లక్ష్మణరూపాలెన్నో
అగ్నిప్రవేశం చేయలేని కాలం కదా
నీ హద్దుల నిప్పుల కుంపట్లో
భస్మం కాని సీతను నేను
ఫీనిక్స్‌ను
నీ కంటికి వృత్త గణికను
గడ్డిపోచను

6.
సరే అలాగే కానీయ్
ఒకే ఒక్క ప్రశ్న
పైన చెప్పిన అన్ని నేను - నువ్వుల్లో
నేను! - నేనే!
నువ్వు!? - ఎవరు!?

ఫణిమాధవి కన్నోజు
76598 34544

'అనల్పం' కవితా సంపుటి

బోధి ప్రచురణలు, తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శేషభట్టర్ రఘు కవితా సంపుటి 'అనల్పం' ఆవిష్కరణ సభ మార్చి 25 సా.6గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షత ఏనుగు నరసింహారెడ్డి; పుస్తకావిష్కరణ సిద్ధార్థ; వక్తలు అంబటి సురేంద్ర రాజు, కొప్పర్తి, ప్రసాదమూర్తి.

బోధి ప్రచురణలు

ప్రపంచ కవితా దినోత్సవసభ

కవిసంధ్య, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మార్చి 24 సా.5.30గంటలకి రవీంద్ర భారతి సమావేశ మందిరం, హైదరాబాద్‌లో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కవిత్వంపై కొప్పర్తి ప్రత్యేక ప్రసంగం; కవితల పోటీ బహుమతుల ప్రదానం; కవి సంధ్యపత్రిక, కవిత్వ గ్రంథాల ఆవిష్కరణ; కవి సమ్మేళనం ఉంటాయి. శిఖామణి, కొలకలూరి ఇనాక్, కె.శివారెడ్డి, మామిడి హరి కృష్ణ తదితరులు పాల్గొంటారు.

దాట్ల దేవదానం రాజు

'నాగలి కూడా ఆయుధమే..!'

విల్సన్ రావు కొమ్మవరపు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే..!' పరిచయ సభ మార్చ్ 21 సా.4గంటలకు తిరుపతిలోని యూత్ హాస్టల్ నందు జరుగుతుంది. అధ్యక్షత తోట వెంకటేశ్వర్లు, ముఖ్య అతిథి భూమన్, పుస్తక పరిచయం పి.సి.వెంకటేశ్వర్లు. సభలో వై. సుభాషిణి, ఆర్.సి. కృష్ణస్వామిరాజు, పల్లిపట్టు నాగరాజు, పాల్గొంటారు.

తోట వెంకటేశ్వర్లు

'పలకల నుంచి పలుకుల వైపు'

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు మార్చ్ 24న బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉ.10గంటల నుంచి ఒక రోజంతా సాహిత్య సభలను మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్ సభలను ప్రారంభిస్తారు. కందుకూరి శ్రీరాములు 'పలకల నుంచి పలుకుల వైపు' కవితా సంపుటిని ముఖ్య అతిథి శివారెడ్డి ఆవిష్కరిస్తారు. విశిష్ట అతిథులు నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్; ఆత్మీయ అతిథులు నాళేశ్వరం శంకరం, విరహత్ అలీ. రెండో విభాగంలో 'సాహిత్యం సమకాలీనత' అంశంలో కవిత్వం మీద దర్భశయనం శ్రీనివాసాచార్య, కథ - నవల మీద ఎస్.రజని, విమర్శ - పరిశోధన మీద లక్ష్మణ చక్రవర్తి ప్రసంగిస్తారు. మూడో విభాగంలో 38 కవులు పాల్గొంటున్న కవిసమ్మేళనం జరుగుతుంది.

బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ సారస్వత పరిషత్తు పురస్కారాలు

తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు సూచనలు, గ్రంథాలు ఆహ్వానిస్తున్నాం. 2022, 2023 సంవత్సరాల్లో తొలిసారి ముద్రితమైన పుస్తకాలను పంపాలి. పద్య/ గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, సాహిత్య విమర్శ ఇతరాలు, యువ పురస్కారం అనే ఏడు విభాగాల్లో పురస్కారాలు ఉంతాయి. పోటీకి పంపేవారు జన్మతః తెలంగాణ వారై ఉండాలి. పుస్తకాలు కవిత్వం 60, విఎగతా ప్రక్రియల్లో 100 పుటలకు తక్కువ కాకుండా మూడు ప్రతుల చొప్పున ఏప్రిల్ 25లోగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, ఆబిడ్స్, హైదరాబాద్-1 కు పుస్తకాలను పంపాలి. ఈమెయిల్ telanganasaraswathaparishath@gmail.com కి పుస్తకం వివరాలు ముఖ్యంగా పుస్తకం పేరు, రచయిత పేరు, ముద్రణ పొందిన సంవత్సరం, పుటల సంఖ్య పేర్కొంటూ సూచనలు పంపవచ్చు. 20 - 35 ఏళ్ల మధ్య వయసున్న వారు యువ పురస్కారం కోసం తమ రచనల్ని మూడేసి ప్రతుల చొప్పున పంపాలి. వివరాలకు: 9603727234.

తెలంగాణ సారస్వత పరిషత్తు

ప్రణాళికతో ర్యాంకు 'పది'లం

- పరీక్ష కేంద్రాల్లో ఒత్తిడికి గురికావొద్దు
- ప్రశ్నపత్రాన్ని 15 నిమిషాల పాటు క్షుణ్ణంగా చదవాలి
- ఉదయం పూట ముఖ్యాంశాలు రివిజన్ చేసుకోవాలి
- పదోతరగతి విద్యార్థులకు టీచర్ల సూచనలు
- నేటి నుంచి ప్రారంభమవుతున్న పరీక్షలు


ఫైల్

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదోతరగతి వార్షికపరీక్షలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభమవుతున్నాయి. ఏప్రిల్ 2 వరకు జరగనున్న పరీక్షలను సమర్థవంతంగా రాసేందుకు విద్యార్థులు సిద్ధం అవుతున్నారు. మంచి మార్కులు సాధిస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి జీవితానికి తొలిమెట్టు అయిన పదో తరగతిలో 10 జీపీఏ సాధించడం ద్వారా ఇంటర్మీడియట్‌తోపాటు ఆపై ఉన్నత చదువుల్లో మరింత ప్రతిభ కనబరిచే అవకాశం ఉంటుందని సబ్జెక్టు నిపుణులు సూచిస్తున్నారు. ప్రణాళికతో చదివితే విజయకేతనం

మిగతా 7వ పేజీలో..

ప్రత్యేక బస్సులు

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేలా గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. రూట్‌పాస్ ఉన్న విద్యార్థులు గ్రేటర్‌జోన్‌లో ఏ ప్రాంతానికైనా బస్సుల్లో వెళ్లే సౌకర్యం ఉంటుందని, హాల్‌టికెట్ చూపిస్తే సరిపోతుందని అన్నారు. వివరాల కోసం కోఠి - 9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్ 9959226154 కమ్యూనికేషన్ సెంటర్లను సంప్రదించవచ్చని తెలిపారు.


శారీ రన్‌లో పాల్గొన్న మహిళలు


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలతో నారా బ్రాహ్మణి

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

శారీ రన్‌లో నారా బ్రాహ్మణి 8

నగరంలో నీటి డిమాండ్ పెరగడంతో ట్యాంకర్లు దారితప్పుతున్నాయి. ప్రధానంగా పది వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్లు అత్యధికం పక్కదారి పడుతున్నాయి. డొమెస్టిక్ పేరుతో బుకింగ్ చేసి కమర్షియల్ అవసరాలకు మళ్లిస్తున్నారు. వీటిని సైడ్‌ట్రాక్‌లోకి మళ్లించడంలో అటు ఫిల్లింగ్ స్టేషన్ల ఆపరేటర్లు, కొన్ని ట్యాంకర్ల యజమానులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. బుకింగ్ చేసినవారికి మాత్రం నాలుగు రోజులైనా ట్యాంకర్లు రావడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా ప్రైవేటు ట్యాంకర్లను బుకింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



డొమెస్టిక్ ట్యాంకర్లు కమర్షియల్‌కు..!

- దారితప్పుతున్న ట్యాంకర్లు
- పలు ప్రాంతాల్లో అరకొరగానే సరఫరా

హైదరాబాద్ సిటీ, మార్చి17 (ఆంధ్రజ్యోతి) గ్రేటర్‌తో పాటు ఔటర్ పరిధిలో వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు 70 వరకు ఫిల్లింగ్ స్టేషన్లున్నాయి. ఒక్కో ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద రెండు, మూడు నుంచి 30కి పైగా ట్యాంకర్లున్నాయి. బుకింగ్ ప్రకారం ట్యాంకర్లు వెళ్లాల్సి ఉండగా, పలు ప్రాంతాల్లో కొన్ని అవి దారితప్పుతున్నాయి. డొమెస్టిక్ బుకింగ్ చేసిన ట్యాంకర్లు కమర్షియల్ అవసరాలకు తరలుతున్నాయి. వీటి డిమాండ్ అధికంగా ఉన్న జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, వెంకటగిరి, కొండాపూర్,మాదాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట, మూసాపేట తదితర ప్రాంతాల్లోనే పక్కదారి పడుతున్నాయి.

ట్రాకింగ్ లేకపోవడంతో..

పలు ప్రాంతాల్లోని హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులతో కొందరు ట్యాంకర్ల యజమానులు కుమ్మక్కవుతున్నారు. డొమెస్టిక్ బుకింగ్‌లు యజమానులే చేస్తుండగా, ట్యాంకర్లు మాత్రం హోటల్‌కు లేదా హాస్టళ్లకు వెళ్తున్నాయి. ప్రతి రోజూ క్రమం తప్పకుండా కొన్ని ట్యాంకర్లు వాటర్‌బోర్డు నీటిని తీసుకెళ్లి కమర్షియల్ అవసరాలకు పోస్తున్నట్లు తెలిసింది. వీటికి ట్రాకింగ్ లేకపోవడంతో ఎక్కడకు వెళ్తున్నాయో అధికారులకు తెలియడం లేదు.

ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారం

రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ, నార్సింగ్ మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మణికొండ మున్సిపాలిటీలోని పాషాకాలనీ, వైఎస్ఆర్ కాలనీ, ఇందిరా కాలనీ, డాబర్‌హిల్స్ ఎత్తైన ప్రాంతంలో ఉండడంతో ప్రెషర్ సరిపోక నీళ్ల రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మణికొండ ప్రాంతంలో ట్యాంకర్లు బుక్ చేసినా వేళకు రాకపోవడం సమస్యగా మారింది. బుక్ చేసిన మూడు, నాలుగు రోజులకు వస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇక ప్రైవేటు ట్యాంకర్ల వారు రూ. 1,500, రూ. 2000 తీసుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు.

- కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంత ప్రజలు నీటి కోసం అల్లాడిపోతున్నారు. భూగర్భ జలాలు పడిపోవడంతో బోరుబావుల నుంచి కూడా నీరు రావడం లేదు.
- శేరిలింగంపల్లి నియోజవర్గంలో నెలరోజులుగా బుకింగ్‌లు రెండింతలు పెరిగి రోజూ 1200 వరకు బుక్ అవుతుండడంతో సమస్య ఎదురవుతున్నది.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ జలమండలి సెక్షన్ల పరిధిలో వాణిజ్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని 20వేల లీటర్ల ట్యాంకర్లను అధికంగా ఏర్పాటు చేశారు. వీటిని లాడ్జిలు, హోటల్ నిర్వాహకులు మాత్రమే బుక్ చేసుకుంటారు. ఈ ట్యాంకర్లకే అధిక నీరు వెళ్తుండడంతో చిన్న ట్యాంకర్లకు నీరందక బస్తీల్లో సరఫరా నిలిచిపోతున్నది.
- ఎల్లారెడ్డిగూడ వాటర్ వర్క్స్ పరిధిలో హాస్టల్‌లు, అపార్ట్‌మెంట్‌లు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం రోజూ 350వరకు బుక్ చేసుకుంటున్నారు. అయితే, ఇక్కడ రిజర్వాయర్ లేకపోవడంతో రోజుకు 100 నుంచి 120 ట్యాంకర్ల ద్వారా నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో బుక్ చేసిన మూడు రోజులకు కూడా నీటి సరఫరా అయ్యే పరిస్థితి లేదు.
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో యథేచ్ఛగా అక్రమ నీటిదందా కొనసాగుతోంది.
- జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్‌లో మూతపడిన ఓ పరిశ్రమ బల్క్ సరఫరా అనుమతి ముసుగులో యథేచ్ఛగా ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటి దందా చేస్తోంది.
- జీడిమెట్ల వాటర్‌బోర్డు సెక్షన్‌లో ఉన్న రెండు ఫిల్లింగ్ స్టేషన్ల ద్వారా పరిశ్రమలకు రాత్రి వేళ నీటిని అక్రమ పద్ధతిలో సరఫరా చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.
- కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల్లో తీవ్రంగా మంచినీటి ఎద్దడి నెలకొంది. బుకింగ్ చేసిన రెండు రోజుల తర్వాతే సరఫరా జరుగుతోంది.




వాటర్ బిల్లు స్లిప్

జలగలు..!

జలమండలిలో అవినీతి అధికారులు

- చిక్కుతున్నది చిన్నచేపలే..
- తప్పించుకుంటున్న తిమింగలాలు
- ట్యాంకర్ బిల్లుల విడుదలకు రూ.1.70 లక్షలు డిమాండ్
- ఏసీబీ దాడుల నేపథ్యంలో ఓ అధికారిపై వేటు
- సూత్రధారిపై చర్యలు శూన్యం!

హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే జలమండలిలో అవినీతి చేపలు ఏసీబీకి చిక్కుతున్నాయి. అయితే.. తిమింగలాలు మాత్రం తప్పించుకుంటున్నాయి. తాజాగా.., రూ.లక్ష లంచం తీసుకుంటూ బోర్డులోని సీనియర్ అసిస్టెంట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏసీబీకి చిక్కగా, పట్టుబడాల్సిన అధికారి తప్పించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వాటర్‌బోర్డులో రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌కు ట్యాంకర్ రెన్యువల్ చేసే అధికారం లేదు. బిల్లులను విడుదల చేయడానికి ఆమోదముద్ర వేసే అర్హత లేదు. కిందిస్థాయి సిబ్బంది పెట్టిన దస్త్రాన్ని పరిశీలించి ఆమోదముద్ర కోసం ఉన్నతాధికారికి పంపడమే సీనియర్ అసిస్టెంట్ బాధ్యత. కేవలం ఒకరి నుంచి మరొకరికి దస్త్రాన్ని పరిశీలించి బదలాయించే వాటర్‌బోర్డులోని సీనియర్ అసిస్టెంట్.. బిల్లుల మంజూరుకు రూ.1.70 లక్షల లంచం డిమాండ్ చేశాడు. మొదటివిడతగా లక్ష లంచం తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్‌తో పాటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సూత్రధారి తప్పించుకోవడం వెనుక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వాటర్‌బోర్డులో ఆపరేషన్ మెయింటెనెన్స్, ప్రాజెక్టు, రెవెన్యూ, ఐటీ.. ఇలా వివిధ విభాగాలు

మిగతా 8వ పేజీలో..

ఇబ్బందులను పట్టించుకోవడం లేదు..

భూగర్భ జలాలను పెంచుకుందామనే ఆలోచన పాలకుల్లో కనబడటం లేదు. అందుకు ఉదాహరణే మియాపూర్ పటేల్‌చెరువు, గంగారం పెద్దచెరువులు. వీటిలోని నీటిని బయటకు పంపి చెరువులను ఎండగట్టారు. అభివృద్ధి పనుల పేరుతో ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉంది. దీంతో బోర్లలో నీరు రావడం లేదు. కనీసం ట్యాంకర్ల సంఖ్య పెంచి నీటి సరఫరా చేయాలి.

- తాడిబోయిన రామస్వామియాదవ్, ఆదర్శనగర్, లింగంపల్లి



నాలుగు రోజులైనా రావడం లేదు

ట్యాంకర్ బుక్‌చేసిన నాలుగురోజుల వరకు రావడం లేదు. గతంలో ఉదయం బుక్‌చేస్తే సాయంత్రం, లేదా మరుసటిరోజు వచ్చేది. 15రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- జనార్దన్‌రావు, మసీద్‌బండ, కొండాపూర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సాయంత్రం: 6.32 గం.

సహర్ : మంగగళవారం ఉదయం: 5.00 గం.

మియాపూర్‌లో చెడ్డీగ్యాంగ్ కలకలం 6

అర్ధరాత్రి ఓ స్కూల్లోకి చొరబడి దోపిడీ

నేటి నుంచి ప్రజావాణి రద్దు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో..

నెక్ట్స్ ఎవరో?

- బీఆర్ఎస్ నుంచి వలసలు షురూ..
- కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం, ఎంపీ రంజిత్‌రెడ్డి
- ఎన్నికల్లోపు మరికొందరు చేరతారని ప్రచారం
- ఇప్పటికే పలువురితో చర్చలు పూర్తి
- మధ్యవర్తుల ద్వారా ఇంకొందరి ప్రయత్నం
- పార్టీ నిరసన కార్యక్రమాలకూ పలువురు దూరం
- మల్లారెడ్డి నివాసంలో ఎమ్మెల్యేల భేటీ
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి రాగిడి

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మర్నాడే మహానగరంలో బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్ తగిలింది. గ్రేటర్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే, శివారు నియోజకవర్గానికి చెందిన సిటింగ్ ఎంపీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరి కొందరూ అదే దారిలో ఉన్నారన్న ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల నాటికి గులాబీ గూటిలో ఉండే వారెందరు? పక్కపార్టీల కండువాలు కప్పుకునేది ఎవరు..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకమంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇప్పటికే కలిశారు. మరికొందరు త్వరలో భేటీ అవుతారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో ఎన్నికల వేళ నగరంలో బీఆర్ఎస్ పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. శనివారం రాత్రి కూడా తాను కాంగ్రెస్‌లో చేరేది లేదని చెప్పిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మర్నాడే హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా సీఎం రేవంత్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్‌మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరగా.. ఇంకొందరు చేరుతారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గోషామహల్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరారు. ప్రజాప్రతినిధులే

మిగతా 8వ పేజీలో..


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దీపాదాస్‌మున్షీతో దానం

అభ్యర్థులెవరు..?

మే 13వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనుండగా, ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు లోక్‌సభ స్థానాలకుగాను మల్కాజ్‌గిరి నియోజకవర్గం అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తనయుడు సాయికిరణ్ మరోసారి బరిలో దిగుతారని ఇన్నాళ్లు ప్రచారం జరిగింది. తాజాగా శ్రీనివాస్‌యాదవ్ పోటీ చేస్తారన్న అంశం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి ఎవరు అభ్యర్థి అన్నది సస్పెన్స్‌గా మారింది. హైదరాబాద్ నుంచి పోటీలో ఎవరిని నిలుపుతారన్న దానిపై స్పష్టత లేదు.

తనిఖీలు మొదలు..

- తొలిరోజు 9.11 లీటర్ల మద్యం, రూ.1.46 లక్షల విలువైన వస్తువులు సీజ్


వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో ప్రభుత్వవిభాగాలు అప్రమత్తమయ్యాయి. కోడ్ ఉల్లంఘనల గుర్తింపుతోపాటు.. నిబంధనలకు విరుద్ధంగా తరలించే నగదు, మద్యాన్ని పట్టుకునేందుకు ప్రత్యేకబృందాలు రంగంలోకి దిగాయి. ప్రాంతాలవారీగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసిన పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఒక్కో నియోజకవర్గంలో మూడు చొప్పున స్పెషల్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ సర్వైలెన్స్ బృందాలు 24 గంటలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నాయి. మొదటిరోజు నిర్వహించిన తనిఖీల్లో పోలీస్ శాఖ ద్వారా రూ.1.46 లక్షల విలువైన వస్తువులతోపాటు అక్రమంగా తరలిస్తోన్న 9.11 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదైనట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. ప్రస్తుతం ఉదయం, రాత్రి వేళల్లో రెండు బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని, త్వరలో బృందాల సంఖ్యను మూడుకు పెంచనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో మే 13వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ముందు జాగ్రత్తగా పార్టీలు, అభ్యర్థులు ప్రలోభ పర్వాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో నగదు తరలింపు, మద్యం అక్రమ నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేవారు సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, రోనాల్డ్‌రోస్ ప్రకటించారు.

తగ్గిన చికెన్ ధర

- లైవ్ కిలో రూ. 110, స్కిన్‌లెస్ కిలో రూ. 220



హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో చికెన్ ధరలు తగ్గాయి. శని, ఆదివారాల్లో పలు దుకాణాల్లో లైవ్ కోడిని కిలో రూ.110, స్కిన్‌లెస్ కిలో రూ.220కి విక్రయించారు. శివారు ప్రాంతాల్లోని పౌల్ట్రీ ఫారంలలో కోళ్ల లభ్యత పెరగడంతో ధరలు అందుబాటులోకి వచ్చాయి. గత ఆదివారం లైవ్ కోడి కిలో రూ. 200-220, స్కిన్‌లెస్ కిలో రూ.280 నుంచి 310 వరకు పలికింది. ప్రస్తుతం ధర తగ్గినా కొన్నిచోట్ల పాతరేట్లనే అమలు చేస్తూ వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. నాటుకోడి ధర మాత్రం యథావిధిగా ఉంది. పలుచోట్ల కిలో రూ.380 నుంచి 400 వరకు విక్రయిస్తున్నారు.

యథావిధిగా కార్పొరేషన్ల కొనసాగింపు

● ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గతంలో వైఎస్ఆర్ హయాంలో ఏర్పాటైన విశ్వకర్మ కార్పొరేషన్ యథావిధిగా కొనసాగుతుందని, దీనిలో ఎలాంటి అనుమానాలు వద్దని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ సంఘాల కార్పొరేషన్‌లు అదనం మాత్రమేనని, గతంలో ఏర్పాటైన అన్ని కార్పొరేషన్లు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం ప్రతినిధి బృందం ఆదివారం వేం నరేందర్‌రెడ్డిని కలిసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చోల్లేటి కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులు భిక్షపతిచారి, నాయకుడు జి.భీష్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి : సీపీ

● యశోద ఫౌండేషన్ 'మస్తీ' ఆవిష్కరణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ శ్రీనివాసరెడ్డి, లంకా రమాదేవి, తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిరుపేద చిన్నారుల జీవితాల్లో మార్పు కోసం యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మస్తీ' యాప్‌ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఓఎస్డీ లంకా రమాదేవితో కలిసి ఆదివారం ప్రారంభించారు. విద్యతో ఒక తరాన్ని మార్చవచ్చని రమాదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో యశోద ఫౌండేషన్ ఫౌండర్ సంతోష్ కావేటి, ఎఫ్టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్, ఫిక్కీ ఎఫ్ఎల్వో చైర్‌పర్సన్ రీతూ షా, ఆడియో ఇంజనీర్ సాజిదాఖాన్, సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సోమదత్తాకారక్, బచ్‌పన్ బచావో ఆందోళన్ లీగల్ కన్సల్టెంట్ శ్రీహర్షిత చడా, ఫుడ్4థాట్ సహ వ్యవస్థాపకుడు షెఫాలీరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజావాణి రద్దు

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేటి నుంచి జూన్ 4వ తేదీ వరకు నిలిపేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత యథావిధిగా ప్రజావాణి ఉంటుందని, ప్రజలు గమనించాలని సూచించారు.

మియాపూర్‌లో చెడ్డీగ్యాంగ్ కలకలం


ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు ధరించి చోరీకి పాల్పడుతున్న దొంగలు

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చాలా రోజుల తర్వాత నగరంలో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ దొంగలు అలజడి సృష్టించారు. మియాపూర్ పరిధిలోని ఓ స్కూల్లోకి చొరబడిన చెడ్డీగ్యాంగ్ ముఠా దోపిడీకి పాల్పడింది. స్కూల్ ఆఫీస్ రూమ్‌లోని క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 7.85 లక్షలు ఎత్తుకెళ్లారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరల్డ్ వన్ స్కూల్ ఉంది. శనివారం స్కూల్ టైమింగ్స్ ముగిసిన తర్వాత సిబ్బంది తాళాలు వేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు దొంగలు స్కూల్‌లోకి చొరబడ్డారు. చేతులకు గ్లౌజ్‌లు, ముఖానికి మాస్కులు ధరించి చెడ్డీల మీదనే వచ్చారు. ఆఫీస్ కార్యాలయంలోకి చొరబడి క్యాష్‌కౌంటర్‌లో ఉన్న డబ్బును తీసుకొని ఉడాయించారు. ఈ దృశ్యాలన్నీ సీసీటీవీల్లో రికార్డయ్యాయి. అయితే, ఇది చెడ్డీగ్యాంగ్ పనా..? లేక డబ్బు గురించి తెలిసిన వారే చెడ్డీగ్యాంగ్‌పై అనుమానం వచ్చేలా పథకం ప్రకారం చోరీకి పాల్పడ్డారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్కూల్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి దొంగల కోసం గాలిస్తున్నారు.

24న ఆల్ ఇండియా నీట్ మాక్ టెస్ట్

చార్మినార్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా నీట్ మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. మార్చి 24న పదకొండు ప్రాంతీయ భాషల్లో మాక్ టెస్టు నిర్వహిస్తున్నామని సొసైటీ కార్యదర్శి సయ్యద్ ఖదీరుల్లా ఖాద్రీ ఆదివారం ఓ ప్రకటనలతో తెలిపారు. నీట్ పరీక్ష కోసం సిద్ధమయ్యే అభ్యర్థులకు ఈ మాక్ టెస్ట్ ఎంతో దోహదపడుతుందన్నారు. 180 ప్రశ్నలకు మొత్తం 720 మార్కులు ఉంటాయని, 3 గంటల సమయంలో పరీక్ష పూర్తి చేయాలన్నారు. నెగిటివ్ మార్కులు ఉంటాయని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని అన్నారు. ఇతర వివరాల కోసం 8500212306 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేపు ఉచితంగా యూఎస్ఏ, కెనడా అడ్మిషన్ డే

పంజాగుట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అమెరికా, కెనడా దేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం ఈనెల 19న సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో ఉచితంగా యూఎస్ఏ, కెనడా అడ్మిషన్ డేను నిర్వహిస్తున్నట్లు యూని ఎక్స్‌పర్ట్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆపరేషన్ హెడ్ ఉమా ఆదివారం తెలిపారు. అమెరికా, కెనడాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులు, తల్లిదండ్రులు వీసా రిక్రూట్మెంట్స్, అడ్మిషన్ రిక్రూట్మెంట్స్, స్కాలర్‌షిప్ ఆప్షన్స్ లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్స్ ట్రావెల్ అప్డేట్స్ ప్రవేశానికి హామీ తదితర అంశాలపై నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9912328645 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

● బీఆర్ఎస్ పార్టీ జల్‌పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్


షర్ఫుద్దీన్ హమేద్

పహాడిషరీఫ్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ సమంజసం కాదని, రాజకీయ లబ్ధి కోసం అక్రమంగా అరెస్ట్ చేశారని ఆ పార్టీ జల్‌పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ అన్నారు. బీజేపీ, ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నదని ఆయన అన్నారు. ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీ ఎర్రకుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజాప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను ఎదుర్కోలేక ఈడీ, సీబీఐ అధికారులతో కేసులు పెట్టించి వేధిస్తున్నదని ఆరోపించారు.

బీజేపీవి దిగజారుడు రాజకీయాలు

● నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్


గడ్డం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీవి దిగజారుడు రాజకీయాలు అని నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన గోషామహల్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో పటిష్ఠంగా ఉన్న బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక, ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలపై ఈడీని ప్రయోగించి బీజేపీ లాభపడాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నాయకులపై ఈడీ, ఐటీ, సీబీఐలను ఉసిగొల్పి బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


హేమంత్

మదీన, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం అయ్యారు. గౌసనగర్‌లో వి. హేమంత్, పూల్‌బాగ్‌లో నసీమ్ ఇలా ఇద్దరు కనిపించకుండా పోయారు. వివరాల్లోకి వెళితే...

బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌసనగర్‌కు చెందిన వి.వెంకటేశ్ కుమారుడు వి.హేమంత్ కుమార్(17) విద్యార్థి. ఈనెల 15వ తేదీ రాత్రి తన గదిలోకి వెళ్లి నిద్రపోయాడు. తెల్లవారి లేచిచూసేసరికి హేమంత్ కుమార్ కనిపించలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అతని కోసం అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు బండ్లగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 87126 61571 ఫోన్ నంబర్‌లో సమాచారమివ్వాలని కోరారు.

పూల్‌బాగ్‌లో..


నసీమ్

బిహార్‌కు చెందిన అబ్బాస్ బైత కుమారుడు నసీమ్ బైత(19) పూల్‌బాగ్‌లో బంధువుల ఇంట్లో ఉంటూ మాదన్నపేట ఈద్గా సమీపంలోని ఓ వర్క్‌షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 15న పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన నసీమ్ బైత అక్కడికి వెళ్లలేదు. ఇంటికీ రాలేదు. ఆందోళన చెందిన బంధువులు అతని కోసం స్వస్థలమైన బిహార్‌తోపాటు నగరంలో తెలిసిన చోట వాకబు చేశారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712571899 నంబర్‌లో సమాచారమందించాలని కోరారు.

గొలుసుకట్టు మోసాలపై కఠిన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న గురుప్రీత్ సింగ్ ఆనంద్

పంజాగుట్ట, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి): గొలుసుకట్టు మోసాలు నియంత్రించడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రీత్ సింగ్ ఆనంద్ డిమాండ్ చేశారు. కొన్ని సంస్థలు పేర్లు మార్చుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నాయని, అలాంటి సంస్థల వలలో అమాయకులు పడవద్దని ఆయన సూచించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అనూజా కొటేచా, తెలంగాణ హెడ్ ఫణీంద్రతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల శంకర్పల్లి పీఎస్ పరిధిలో తండ్రి, తన ముగ్గురు కుమారులను చంపి, ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. క్యూనెట్ సంస్థ 1998 నుంచి వివిధ పేర్లతో చట్టవిరుద్ధమైన పోంజీ స్కీమ్‌లను అమలు చేస్తోందని, దీని బారినపడ్డ ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వేల సంఖ్యలో మల్టీలెవెల్ మార్కెటింగ్ సంస్థలు ఉన్నాయని, ఈ గొలుసు కట్టు వ్యాపారాలు సోషల్ టెర్రరిజంలా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. గొలుసుకట్టు, తదితర ఆర్థిక నేరాలపై దర్యాప్తు చేయడానికి, నివారించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సు కిందకు దూసుకు వెళ్లిన కారు

ఆర్టీసీ బస్సు కిందికి దూసుకెళ్లిన కారు

రాజేంద్రనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజేంద్ర నగర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఏఆర్ఐ) గేటు సమీపంలో ఓ కారు.. ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయినది. రాజేంద్రనగర్ బస్సు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ29 జెడ్ 3199)ను డ్రైవర్ ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో మలుపు తిప్పుతుండగా, వెనకాల నుంచి వచ్చిన వేగంగా ఓ కారు పక్కకు తప్పించే క్రమంలో బస్సు కిందకు దూసుకెళ్లింది. ఆ వెనుకాలే వచ్చిన లారీ.. కారును ఢీకొట్టడంతో బస్సుకిందకు వెళ్లడంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైనది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రాజేంద్రనగర్ ఏఆర్ఐ గేటు వద్ద ఆర్టీసీ బస్సు కిందకు కారు దూసుకువెళ్లిన విషయంలో తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని రాజేంద్రనగర్ ఎస్ఐ భానుప్రకాశ్ తెలిపారు.

● కొన్ని నెలలుగా వెలగని వీధిదీపాలు
● రాకపోకలకు స్థానికుల ఇబ్బందులు
● కూలిపోయిన బాక్స్‌డ్రెన్ పై కప్పు

అంధకారంలో ఉప్పుగూడ రైల్వే అండర్ బ్రిడ్జి



ఉప్పుగూడ ఆర్‌యుబీ బ్రిడ్జి


కూలిపోయిన బాక్స్ డ్రైన్ పైకప్పు

చాంద్రాయణగుట్ట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కొంత కాలం క్రితం ఉప్పుగూడ రైల్వే గేటు వద్ద అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జిని (ఆర్‌యూబీ)ని నిర్మించారు. అనంతరం దాని నిర్వహణ గాలికొదిలేయడతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పుగూడ అండర్ బ్రిడ్జి కింద నుంచి రోజూ కొన్ని వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్‌యూబీలో ఏర్పాటు చేసిన వీధిదీపాలు కొన్ని నెలలుగా వెలగకపోవడంతో అంధకారంలో కూరుకుపోయింది. అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ఓ పక్క నేలకొరిగింది. ఆర్‌యూబీలో నిర్మించిన బాక్స్‌డ్రైన్ పైకప్పు కూలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైళ్లు దిగికి బయటకు వస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులు చీకటిలో దారి కనిపించక అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జి కింద కొందరు పోకిరీలు గుమ్మికూడి దారిన పోతున్న వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. స్థానికులు అక్రమంగా తమ వాహనాలను పార్క్ చేస్తున్నారు.

అధికారులు స్పందించడంలేదు



ఉప్పుగూడ అండర్ బ్రిడ్జి సమస్యలను సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, బల్దియా విభాగం, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

- ఇ.సుమన్‌కుమార్, స్థానికుడు


అండర్ బ్రిడ్జి వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/pGX1UsK లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

ఆస్తిపన్ను పరిష్కార వేదికలో తొమ్మిది దరఖాస్తులు

రాజేంద్రనగర్, మార్చి17(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆస్తిపన్ను వేదిక కార్యకమం డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఆస్తిపన్ను తగ్గించాలని, ఇంటి నెంబర్‌లో తప్పులను సవరించాలని, పాతఇంటి నెంబర్‌ను తొలగించాలంటూ తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ రవికుమార్ త్వరలో చర్యలో వాటికి పరిష్కారం చూపుతామని అన్నారు.

పల్లెచెరువు కట్టమైసమ్మ దేవాలయంలో బోనాలు


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

రాజేంద్రనగర్, మార్చి17(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం గంగపుత్ర సంఘం, మత్స్యసహకారం సంఘం ఆధ్వర్యంలో సామూహిక బోనాలు, జాతర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దయ ప్రజలందరిపై ఉండాలని పూజలు చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పల్లెచెరువు కట్టమైసమ్మ దేవాలయంలో బోనాలు, జాతర జరపుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం సభ్యులు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు గంట శంకర్, జి.సత్యనారాయణ, నన శ్రీనివాస్, పాండు యాదవ్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వాకర్స్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

పబ్లిక్ గార్డెన్స్‌లో వాకర్స్‌కు వైద్య శిబిరం

అఫ్జల్‌గంజ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ఆదివారం వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 300 మంది వాకర్స్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా ఆధ్వర్యంలో కామినేని హాస్పిటల్ సిబ్బంది వారికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు.

తలపై బోనంతో హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి

మైసమ్మ అమ్మవారికి బోనం సమర్పించిన మాధవీలత

చాంద్రాయణగుట్ట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత ఆదివారం కందికల్‌గేట్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పల్లెచెరువు మైసమ్మ అమ్మవారిని దర్శించుకొన్నారు. మాధవీలత తలపై బోనం ఎత్తుకుని అమ్మవారికి ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరి వచ్చి బోనం సమర్పించారు. అనంతరం గౌలిపురాలోని బీజేపీ నాయకుల ఇళ్లకు వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా కలిసి తనకు మద్దతునివ్వాలని కోరారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండా ఎగురవేయడానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని ఆమె కోరారు.


తలపై బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న మాధవీలత

ఎన్ఆర్ఐల భూముల కబ్జాపై దర్యాప్తు జరిపించాలి

● మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు


మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రావు

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, శామీర్‌పేట మండలం, బొమ్మరాజుపేట గ్రామంలో ఎన్ఆర్ఐలకు చెందిన 920 ఎకరాల భూ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. భూ కబ్జా వెనుక మాజీమంత్రుల హస్తం ఉందని ఆరోపించారు. ధరణి కమిటీ వాస్తవాలను సేకరించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొమ్మరాజుపేట గ్రామం పరిధిలోని సర్వే నెంబర్ 323 నుంచి 409 వరకు గల 1,049 ఎకరాల భూమిలో 920 ఎకరాలను కబ్జా చేశారని ఆరోపించారు. మాజీ ఎంపీ దుగ్గిరాల బలరామకృష్ణ 1965లో ఈ భూమిని మీర్ రహ్మత్ అలీతోపాటు మరో ఆరుగురి నుంచి కొనుగోలు చేశారని తెలిపారు. ఆయన వారసులైన దుగ్గిరాల అమరేందర్‌బాబుతోపాటు మరో 20 మంది పేరిట భూమి రిజిస్టర్ అయిందన్నారు. భూ హక్కుదారులు విదేశాల్లో స్థిరపడడంతో కొంతమంది నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన రైతు సంఘం నేతలకు కొంతమంది మాజీమంత్రులు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. కోర్టు ఆదేశాలు అమలు చేసి జిల్లా కలెక్టర్ ద్వారా పూర్తి ఆధారాలు సేకరిస్తే అసలైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. కలెక్టర్ విచారణను కూడా కొన్ని రాజకీయ శక్తులు అడ్డుకుంటున్నాయని, రైతు సంఘం నేతలు ధర్నాల ముసుగులో ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతానని ఆయన హెచ్చరించారు.

ప్రణాళికతో ర్యాంకు 'పది'లం

(5వ పేజీ తరువాయి)

ఎగురవేస్తారని పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులకు వారు పలు సూచనలు చేశారు.

కేంద్రానికి వెళ్లే ముందు ఇవి చూసుకోవాలి..

- హాల్‌టికెట్, బ్లూ, బ్లాక్ పెన్నులు, పెన్సిల్, రబ్బర్, షార్ప్‌నర్, స్కేల్, తదితర వస్తువులను సరిచూసుకుని ఒకపౌచ్‌లో పెట్టుకోవాలి. పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- పరీక్షా కేంద్రాలకు ఎలక్ట్రానిక్ వస్తువులను, స్మార్ట్ వాచ్‌లను తీసుకెళ్లవద్దు.
- రోజూ రాత్రి 10 గంటలలోపు నిద్రపోయి, మరుసటి రోజు ఉదయం 5 గంటలకు మేల్కొవాలి. పరీక్షకు సంబంధించిన ముఖ్యాంశాలను ఉదయం పూట చదువుకోవాలి.

కేంద్రంలో పాటించాల్సిన పద్ధతులు..

- ఇన్విజిలేటర్ ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌పై మీ పేరు ఉందో.. లేదో సరిచూసుకోవాలి. ఇన్విజిలేటర్ చెప్పే సూచనలు తప్పకుండా పాటించాలి.
- కనీసం 15 నిమిషాలపాటు ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి బాగా రాయగలిగే జవాబులను టిక్ చేసుకోవాలి.
- రాసిన అడిషనల్స్‌ను వరుసక్రమంలో పెట్టాలి. అన్ని సమాధానాలకు ప్రశ్నల నంబర్లు సరిగా వేశారో.. లేదో చూసుకోవాలి.
- జవాబుపత్రంలో ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే అక్కడ క్రాస్‌మార్కు ఉంచి పీటీఓ అని రాయాలి.
- తీసుకున్న అడిషనల్ షీట్స్ నంబర్ల సంఖ్యను ఓఎంఆర్ షీట్‌పై తప్పనిసరిగా వేయాలి.
- గణితంలో సిద్ధాంతాలను వరుస క్రమంలో రాయాలి. ఫిజిక్స్ బయాలజీలో చిత్రాలను అందంగా వేసి వాటి పేర్లను, ఆవశ్యకతను వివరించాలి.

తల్లిదండ్రులు చేయాల్సినవి..

- పరీక్షలపై భయం పోగొట్టేందుకు తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యాన్ని ఇవ్వాలి. పరీక్ష బాగా రాస్తావని తరచూ వారిలో నమ్మకాన్ని పెంచాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో వారికి తోడుగా ఉండి, సబ్జెక్టులపై పునశ్చరణ చేయించాలి. ముఖ్యమైన పాయింట్స్‌ను గుర్తుంచుకునే విధంగా షార్ట్‌నోట్స్ రాయించాలి.
- ఉదయం 5 గంటలకు నిద్రలేపి 7 గంటల వరకు చదివించాలి. పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందు వెళ్లేలా సిద్ధం కావాలి. పిల్లలు సెంటర్ లోపలికి వెళ్లేవరకు అక్కడే ఉండాలి.
- పరీక్ష బాగా రాయకున్నప్పటికీ.. మరో పరీక్షలో ఎక్కువ స్కోర్ చేసే విధంగా ప్రోత్సహించాలి.

ఎక్కడి నుంచి వచ్చిందో చూడాలి



పరీక్షా కేంద్రంలో విద్యార్థులు టెన్షన్‌కు గురి కావొద్దు. ప్రశ్నను జాగ్రత్తగా చదవాలి. ఎక్కడి నుంచి వచ్చిందో గమనించాలి. వచ్చిన వాటిని త్వరగా రాయాలి. గణితంలో వాస్తవ సంఖ్యలు, బహుపదులు, సమితులు, సాంఖ్యాకశాస్త్రం, సంభావ్యత, నిరూపణ రేఖాగణితం, రేఖీయ సమూహాల వ్యవస్థ, శ్రేణులు, జామితిలోని నిర్మాణాలను చూసుకుంటే 60శాతం మార్కులు కచ్చితంగా సాధించవచ్చు.

- నర్సింహారెడ్డి, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, జీహెచ్ఎస్ నల్లకుంట

విశ్వాసంతో పరీక్ష రాయాలి..

ఏ ప్రశ్న వచ్చినా.. రాయగలను అనే విశ్వాసంతో విద్యార్థి పరీక్ష రాయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోల్చడం, నీవు సరిగా రాయలేవు, మర్చిపోతావు అనే మాటలను అనకూడదు.

- డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కౌన్సెలింగ్ థెరపిస్ట్

స్వప్రయోజనాల కోసమే నందకిశోర్ రాజీనామా


మాట్లాడుతున్న ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి): స్వప్రయోజనాల కోసమే నందకిశోర్ వ్యాస్ రాజీనామా చేశారని, ఆయన వెళ్లిపోయినంత మాత్రాన పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని గోషామహల్ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన గోషామహల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి గెలవాల్సిన బీఆర్ఎస్, ఆయన అసమర్థత కారణంగా ఓడిపోయినదని విమర్శించారు. ఆయన గెలుపునకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రచారం చేశారని, నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసిన 60వేల ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. ఓటమి చెందగానే బీఆర్ఎస్ పార్టీని వీడి, నందకిశోర్ వ్యాస్ కాంగ్రెస్‌లో చేరడం దుర్మార్గ చర్యగా ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఆయన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్‌అహ్మద్, మహ్మద్ సలీం, మహ్మద్ గౌస్, అక్బర్ అలీ షరీఫ్, నరేశ్‌గౌడ్, నగేశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 2కే రన్



ర్యాలీగా వస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ విద్యార్థులు

తార్నాక, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం ఓయూ ఎన్‌సీసీ గేట్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు 'సే నో టు డ్రగ్స్' నినాదంతో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దకాలంగా యువత మాదకద్రవ్యాలు, మద్యంమత్తులో తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందన్నారు. గంజాయి, మత్తు పదార్థాలతో వ్యాపారం చేసే వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్ మూర్తి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, టి. నాగరాజు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, జావిద్, అశోక్‌రెడ్డి, రవినాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



తెలంగాణ పట్టణ మౌలిక సదుపాయాలు ఆర్థిక సంస్థ చైర్మన్ చల్లా నరసింహారెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఆదివారం చల్ల నరసింహారెడ్డిని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు యూసుఫ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి పూలదండ వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పహాడిషరీఫ్ , మార్చి 17 (ఆంధ్రజ్యోతి).

కొమురవెల్లిలో భక్తుల రద్దీ

● దర్శనానికి 4 గంటల సమయం
● స్వామివారికి రూ.5.70 లక్షల విలువైన రుద్రాక్ష మాల బహూకరణ


మల్లన్నకు రుద్రాక్ష మాల సమర్పిస్తున్న భక్తులు

కొమురవెల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తొమ్మిదోవారం సందర్భంగా సుమారు 30వేల మంది మల్లికార్జునస్వామిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. భక్తులు మల్లన్నకు బోనం నివేదించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు.

విజయచల గుట్టపై ఉన్న ఎల్లమ్మతల్లికి ఒడిబియ్యం పోసి, బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి మల్లన్నకు సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లికి చెందిన భీమనబోయిన ఉమారాజు అనే భక్తుడు రూ.5.70 లక్షల విలువ గల 8.42 గ్రాముల బంగారు తీగతో అల్లిన 10 అడుగుల పొడవు రుద్రాక్షమాలను, హైదరాబాద్ ఖాజాగూడకు చెందిన ధనుంజయ్‌గౌడ్ అరకిలో వెండి పళ్లెంను ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పి. లక్ష్మారెడ్డి, ఆలయ ఈవో బాలాజీశర్మ, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో స్వామికి బహూకరించారు.

మల్లన్నను దర్శించుకున్న గోల్డ్‌మన్

మల్లన్నను హైదరాబాద్‌కు చెందిన గోల్డ్‌మన్ శ్రవణ్ దర్శించుకున్నారు. భారీ జనసందోహంలో మెడలో 2.5కిలోల బంగారు ఆభరణాలతో మల్లన్న దర్శనానికి రావడంతో జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి : బ్రాహ్మణి

హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయంతో పాటుగా మహిళలకు మంచి గుర్తింపును చీర తీసుకువస్తుందని, మహిళా సాధికారితకు ప్రతీకగా నిలుస్తుందని హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి అన్నారు. టాటా గ్రూప్‌కు చెందిన తనైరా సంస్థ బెంగళూరుకు చెందిన జేజే యాక్టివ్‌తో కలిసి పీపుల్స్‌ప్లాజా వద్ద తనైరా శారీ రన్‌ను ఆదివారం ఉదయం నిర్వహించింది. దాదాపు మూడు వేల మంది మహిళలు చీరలు కట్టుకుని రన్, వాక్ చేశారు. రన్‌ను ప్రారంభించిన బ్రాహ్మణి ఆరోగ్యం ఆవశ్యకతను వివరించారు. మహిళలతో సెల్ఫీలు దిగి ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే, మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఇప్పటికే కోల్‌కతా, పూణె, బెంగళూరుల్లో విజయవంతంగా తనైరా శారీ రన్స్ నిర్వహించామని తనైరా సీఈఓ అంబుజ్ నారాయణ్ చెప్పారు. ఈ శారీ రన్ అచంచలమైన భారతీయ మహిళ స్ఫూర్తికి నివాళి అని పేర్కొన్న ఆయన మహిళలు తమ వారసత్వాన్ని గర్వంగా స్వీకరించేలా చీర చేస్తుందని అన్నారు.







నెక్స్ట్ ఎవరో?

(5వ పేజీ తరువాయి)

కాకుండా నియోజకవర్గ, ద్వితీయ శ్రేణి నాయకులూ పార్టీ వీడుతోన్న నేపథ్యంలో నగర గులాబీ శ్రేణులూ గందరగోళానికి గురవుతున్నాయి.

వారంతా టీడీపీ నుంచి వచ్చిన వారే..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాల్లో 16 స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుంది. విజేతలుగా నిలిచిన ఎమ్మెల్యేల్లో మెజారిటీ సభ్యులు టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారే. రేవంత్ గతంలో టీడీపీలో కీలకంగా వ్యవహరించడం, ప్రస్తుత ఎమ్మెల్యేలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్న నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరేందుకు వారు మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలతో చర్చలూ పూర్తయ్యాయని సమాచారం. పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ నుంచి జరుగుతోన్న ప్రయత్నాల కంటే మధ్యవర్తుల ద్వారా తాము హస్తం గూటికి వస్తామని రాయబారాలు నడుపుతోన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉంటున్నారు. ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో పార్టీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాల్లో నూ పలువురు ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడం గమనార్హం.

- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలు త్వరలో కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కొన్నాళ్ల క్రితం రేవంత్ రాజకీయ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో వీరు భేటీ అయ్యారు. తాజాగా ఆయన బెంగళూరులో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలిశారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. రేవంత్‌పై గతంలో తీవ్ర విమర్శలు చేసిన మల్లారెడ్డి ఇప్పుడు స్వరం మార్చారు. ఆదివారం మల్లారెడ్డి నివాసంలో మల్కాజ్‌గిరి లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం జరిగింది. పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఏం చేయాలన్న దానిపై చర్చించారు. మల్లారెడ్డి పార్టీని వీడతారన్న ప్రచారం నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.
- గతంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శివారు ప్రాంతానికి చెందిన ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పార్లమెంట్ ఎన్నికల్లోపు హస్తం గూటికి చేరే అవకాశముందని తెలుస్తోంది. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలోని కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన సూచన మేరకు ముగ్గురు కార్పొరేటర్లు సీఎంను కలిసినట్టు తెలిసింది.
- శివారు నియోజకవర్గానికి చెందిన మరో ఎమ్మెల్యే కాంగ్రెస్ నుంచి పిలుపు కోసం ఎదురు చూస్తున్నట్టు సమాచారం. కవిత అరెస్టుపై శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఆయన పాల్గొనలేదు.
- సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఓ ఎమ్మెల్యే కూడా కొన్నాళ్ల క్రితం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తమ సామాజికవర్గం నాయకుడి ద్వారా మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం.
- శివారు ప్రాంతంలోని మరో ఎమ్మెల్యే కూడా పార్టీని వీడేందుకు సిద్ధపడుతున్నట్టు తెలిసింది. టీడీపీలోని పూర్వ పరిచయాల ద్వారా ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు అనుచరులు చెబుతున్నారు. రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టే ఆ ఎమ్మెల్యే అధికార పార్టీలో ఉండడం అన్ని విధాలా శ్రేయస్కరమని భావిస్తున్నారని సమాచారం.
- గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఓ ఎమ్మెల్యే సైతం తిరిగి సొంతగూటికి చేరతారని చెబుతున్నారు. ఈ ప్రచారాన్ని సదరు ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు ఖండిస్తున్నా.. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అధికారం ఎక్కడుంటే దానం అక్కడే..

పిల్లిమొగ్గలు వేస్తూ చివరకు కాంగ్రెస్ గూటికి ● సమాచారం లేని నాయకులు, కార్యకర్తలు

ఖైరతాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూశాడు. అది దొరకగానే సొంతగూటికి వచ్చేస్తానని కోరాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్. శనివారం ఓ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని చెప్పాడు. అయోమయంలో ఉన్న నాయకులు, కార్యకర్తలను మరింత విస్మయానికి గురిచేస్తూ ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నాడు దానం నాగేందర్. ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కనీస సమాచారం లేకుండా అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన దానంపై అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. అధికారం ఎక్కడుంటే దానం అక్కడే అన్నట్లుగానే ఆయన అవకాశవాద రాజకీయాలు చేస్తూ అటు పార్టీలను, ఇటు కార్యకర్తలను మోసం చేస్తూ సొంత లాభం కోసం పాకులాడుతున్నారని ఆయన సన్నిహితులే గుర్రుగా ఉన్నారు.

గత చరిత్ర తిరగేస్తే..

దివంగత సీఎల్పీ నేత పి.జనార్దన్‌రెడ్డి శిష్యుడిగా రాజకీయ అరంగ్రేటం చేసిన దానం నాగేందర్ ఆసిఫ్‌నగర్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో కాంగ్రెస్ ఎమ్మెల్యే టిక్కెట్ దక్కకపోవడంతో ఆఘమేఘాలపై టీడీపీలో చేరి టిక్కెట్ తెచ్చుకొని గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. టీడీపీ ఎమ్మెల్యే పదవికి దానం రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వచ్చినా, అనూహ్యంగా జరిగిన ఉప ఎన్నికలో ఓటమి చవిచూశారు. 2009లో పీజేఆర్ మరణానంతరం అనూహ్యంగా ఖైరతాబాద్ నియోజకవర్గానికి వచ్చి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ వచ్చిన అనంతరం 2014 ఎన్నికల్లో ఓడిపోయారు. టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో అందులో చేరారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచినా, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్ ఆగ్రహం

దానం నాగేందర్ పార్టీ మారడంపై అటు కాంగ్రెస్ పార్టీలోనూ, ఇటు బీఆర్ఎస్ పార్టీలోనూ వ్యతిరేకత కనబడుతోంది. కనీస సమాచారం లేకుండా పార్టీ మారడంపై బీఆర్ఎస్ వర్గాలు కోపంగా ఉన్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన తనను సంప్రదించకుండా దానంను ఎలా పార్టీలోకి చేర్చుకుంటారని విజయారెడ్డి ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అపారమైన నమ్మకమున్నా ప్రస్తుత కార్యకర్తలను సంప్రదించకపోవడం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి ఏమిటని విజయారెడ్డి వర్గీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, దానంకు అత్యంత సన్నిహితులు సైతం గుర్రుగా ఉన్నారు. ఈ విషయమై త్వరలోనే చర్చించుకొని కార్యాచరణ ప్రకటిస్తామని వారు చెబుతున్నారు.

నా గెలుపు ఖాయం : రాగిడి

● మల్లారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశం

బోయినపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తన గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, బొగ్గారపు దయానంద్‌గుప్తా, కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత సోదరి నివేదిత ఆదివారం బోయినపల్లిలోని మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల వ్యూహాలపైన చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాగిడి మాట్లాడుతూ తన గెలుపు కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఐటీ రంగం బలోపేతానికి మాజీ మంత్రి కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. బీజేపీని ఎదుర్కొని మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని విమర్శించారు.


సమావేశమైన మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని ఆలిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపీజీవీబీ ఈయూ మాజీ ప్రధాన కార్యదర్శి కారింగు భిక్షమయ్య పదవీ విరమణ సన్మానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులకు, వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులకు వ్యత్యాసం, వివక్ష లేకుండా సమర్థవంతంగా బ్యాంకింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రవికాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కె.ప్రతాప్‌రెడ్డి, పి.వేణురావు, రాజు, కె.కె. మక్వ, జె.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలులో రంజాన్ ఉపవాసం

సైదాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో 400 మందికి పైగా ఖైదీలు రంజాన్ ఉపవాస దీక్ష(రోజా) ప్రారంభించారు. వీరిని జైలు అధికారులు ప్రత్యేక బ్యారక్‌లో ఉంచారు. రోజా ఆచరించే ఖైదీలు సూర్యోదయానికి ముందే భోజనం తీసుకోవడం, సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఇతర ప్రార్థనల కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. ఖైదీలకు పలు స్వచ్ఛంద సంస్థలు పండ్లు అందించేందుకు ముందుకు వచ్చాయని చెప్పారు. జైలు క్యాంటీన్‌లో సైతం పండ్లు అందుబాటులో ఉంచారు.

యూకేలో అవకాశాలపై శిక్షణ


డాక్టర్ మోసోభి

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యూకేలో మెడికల్ ప్రాక్టీస్ పొందేందుకు మూడు దశలు ఉంటాయని, అందులో ఇంగ్లిష్ పరీక్ష, ఉక్మాలా స్టెప్-1, స్టెప్-2 పరీక్షలు పాస్ కావాల్సి ఉంటుందని ఉక్మాలా సీఈవో, ఫౌండర్ మోసోభి తెలిపారు. అపోలో మెడికల్ కాలేజీలో అపోలో ఎడ్యుకేషన్ యూకే ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మాస్టర్ క్లాస్‌లో డాక్టర్ మోసోభి వైద్య విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు. భారతదేశం, యూకే మధ్య వైద్య విద్య శిక్షణా అవకాశాలను మెరుగుపరిచేందుకు అపోలో ఎడ్యుకేషన్ యూకే అడుగులో ఇది ఒక భాగం అని తెలిపారు.

సమ్మిళిత పురోభివృద్ధే నిజమైన అభివృద్ధి

తెలంగాణ మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొ.విజ్జులత



హైదరాబాద్ చాప్టర్ మహిళా విభాగం ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న మహిళలు

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సమ్మిళిత పురోభివృద్ధి మాత్రమే నిజమైన అభివృద్ధి అని, మహిళల వ్యక్తిగతమైన అంశాలు చర్చించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ఉమెన్ ప్రొఫెషనల్స్ ఉమ్మడిగా కృషి చేయాలని, ఇందుకు సహచర పురుషులు చేదోడు వాదోడుగా ఉండాలని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొ.ఎం.విజ్జులత అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ మహిళా విభాగం ప్రథమ వార్షికోత్సవాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను కలుపుకొనిపోవడంలో పురుషుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం రిటైర్డ్ ప్రొ. పద్మజా షా మాట్లాడుతూ పబ్లిక్ రిలేషన్స్‌లో భాగమైన సంక్షోభ నియంత్రణ మహిళలకు ఉండే సహజసిద్ధమైన నైపుణ్యమన్నారు. సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షురాలు సి.వనజ మాట్లాడుతూ వృత్తిలో ఉండే సమస్యలను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు మహిళలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. మహిళా విభాగం కన్వీనర్ డా.అనిత మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పీఆర్ఎస్ఐలో మహిళల కోసం ఒక ప్రత్యేక విభాగం ఆరంభించిన ఘనత హైదరాబాద్ చాప్టర్‌దేనన్నారు. ఎన్ఎండీసీ అధికారి శ్రీనివాసరావును నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ డా.శ్రీబాల, కో-ఆర్డినేటర్ ధన్యచౌదరి, సలహాదారులు సి.రమాదేవి, ఆనందిత ముఖర్జీ సిన్హా పాల్గొన్నారు.

తొమ్మిది మంది వృత్తి నిపుణులకు సన్మానం

నాగ స్వప్న వాయువేగుల(టీసీపీవేవ్ ప్రైవేట్ లిమిటెడ్), శ్రీలక్ష్మి కొడుకుల(మెడికవర్ ఆస్పత్రి), డా.ఉషా అయ్యర్ (డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్), ముక్తా కుమార్ (కోనక్షన్స్ ఇమేజ్), తేజస్విని పడగడల(టెక్ కోవ్స్ట్), కొత్తపల్లి ప్రసన్న (జెనిసిస్ బీసీడబ్ల్యూ), అరుణ బుద్ధవరపు(జస్ట్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్), అభ్యుదయ కారంచేటు (వెల్స్ ఫార్గో), డిల్లోరిస్ బారువా(అరెటీన్స్ టెక్)లను ఈ సందర్భంగా సన్మానించారు.

సత్యాన్ని చెప్పడమే సాహసం : ప్రొ.హరగోపాల్

● 'రాయగూడని పద్యం' ఆవిష్కరణ



'రాయగూడని పద్యం' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో మౌమితా ఆలం, విమల, సంధ్య, రమాసుందరి, ప్రొఫెసర్ హరగోపాల్, తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పీడితులు, బాధితులు, అణగారినవర్గాల పక్షాన రాయడం కవుల బాధ్యత అని ప్రముఖ కవయిత్రి మౌమితా ఆలం అన్నారు. "ప్రతి నిర్బంధంలోనూ కవులు ప్రజల గొంతును వినిపిస్తారు. ఆశాదీపాల్లా నిలుస్తారు. కనుకనే నియంతలకు కవులను చూస్తే భయం, అందుకే అక్రమంగా జైలుకు పంపడం చూస్తుంటాం" అని వ్యాఖ్యానించారు. పాలమూరు అధ్యయన వేదిక, మాతృక సంయుక్తంగా ప్రచురించిన మౌమితా ఆలం కవిత్వానికి ఉదయమిత్ర తెలుగు స్వేచ్ఛానువాదం 'రాయగూడని పద్యం' సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. మౌమితా ఆలం మాట్లాడుతూ దేశ పాలకులు ప్రజల కోసం కాకుండా, కార్పొరేట్ శక్తుల కోసం పనిచేస్తుండడం శోచనీయమన్నారు. భాషలు వేరైనా పీడితులంతా ఒక్కటై ధిక్కార భాషను సృష్టించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సామాజికవేత్త ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ సత్యాన్ని చెప్పడమే సాహసమైపోయిన కాలంలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మౌమిత కవిత్వం భాషల సరిహద్దును చెరిపేస్తుందని కవి శ్రీరాం పుప్పాల పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ సమాజాల్లోని బీభత్సాన్ని ఈ కవిత్వం ద్వారా మౌమిత చర్చకు పెట్టారని పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధి రాఘవాచారి అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి విమల మోర్తల, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, అనువాదకుడు ఉదయమిత్ర, యువ కవులు సాత్విక నన్నెబోయిన, దొంతం చరణ్, రచయిత్రి రమాసుందరి, తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్వేచ్ఛా ప్రతినిధులు

30, 31 తేదీల్లో కాన్ఫరెన్స్ ఏఐ డేస్-2024

రాయదుర్గం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్‌పై భారతదేశంలో అతి పెద్ద కాన్ఫరెన్స్ ఏఐ డేస్-2024ను ఈ నెల 30, 31 తేదీల్లో నగరంలోని జేఎన్‌టీయూలో నిర్వహిస్తున్నట్లు స్వేచ్ఛా తెలంగాణ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వై.కిరణ్‌చంద్ర తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వేచ్ఛా తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో రెండువేల మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 70మందికిపైగా స్పీకర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐ పాలన, విధానపరమైన అంశాలపై చర్చలు జరుగుతాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నం.9959154371, 9963980259లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

మూడేళ్ల బాలికపై 13 ఏళ్ల బాలుడి అత్యాచారం

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలికపై 13 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కర్మన్‌ఘాట్‌లో వెలుగులోకి వచ్చింది. పక్కపక్క ఇళ్లలో రెండు కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. ఓ కుటుంబంలోని మూడేళ్ల చిన్నారి ఇంటి డాబాపై ఆడుకుంటుండగా.. పక్కింటి 13 ఏళ్ల బాలుడు డాబాపైకి వెళ్లాడు. ఒంటరిగా ఆడుకుంటున్న చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి బిగ్గరగా ఏడుస్తూ వెళ్లి తల్లికి చెప్పడంతో ఆమె బాలుడిని, అతడి తల్లిదండ్రులను నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

జలగలు..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. నీళ్లు రాకపోయినా, వీధుల్లో మురుగు ముంచెత్తినా.. వాటర్‌బోర్డునే సంప్రదిస్తుంటారు. ప్రతీనెలా సుమారు రూ.110కోట్ల నుంచి రూ.130కోట్ల వరకు వ్యయం ఉండే వాటర్‌బోర్డులో వివిధ పనులకు సంబంధించి లక్షల రూపాయలు అక్రమంగా చేతులు మారుతున్నాయనే ఆరోపణలున్నాయి.

రెవెన్యూ విభాగంపై భారీగా ఆరోపణలు

వాటర్‌బోర్డులోని రెవెన్యూవిభాగం ట్యాంకర్ల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తోంది. ట్యాంకర్లు తిరిగే ట్రిప్పుల కంటే అధికంగా నమోదు చేస్తూ.. యజమానుల నుంచి ఆ విభాగంలోని కొందరు ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే.. బిల్లుల జారీలోనూ కొన్ని కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ బోర్డు ఆదాయానికి గండి కొడుతున్నారు. నీటి వినియోగం అధికంగా జరిగి బిల్లు అధికంగా వచ్చే సందర్భాల్లో యజమానికి ముందుగానే సమాచారం ఇచ్చి మీటర్లు మార్చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నిర్వహణ అధ్వానం

వాటర్‌బోర్డులో ఆపరేషన్ మెయింటనెన్స్ విభాగం మరింత అధ్వానంగా మారింది. ఈ విభాగంలో జీఎంలు, సీజీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు ఎన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లో పాతుకుపోయి ఉన్నారు. పదేళ్లకుపైనే అయినా.. వారిని కదిలించే పరిస్థితి లేదు. సివరేజీ ఎయిర్‌టెక్ మిషన్లకు సంబంధించి టెండర్ దక్కించుకున్న వారికి లెటర్ ఆఫ్ ఆర్డర్ (ఎల్ఓఏ) ఇచ్చేందుకు వాటర్‌బోర్డు నిర్వహణ విభాగంలోని ఓ ఉన్నతాధికారి ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిసింది. ఒక్కో వాహనానికి రూ.70 వేలు డిమాండ్ చేయడంతో సంస్థ ఎండీ ఆయనను మందలించినట్లు సమాచారం. దాంతో అప్పటికప్పుడు ఎల్ఓఏ జారీ చేశారు. నీటి కనెక్షన్ల జారీలో నిర్వహణ విభాగానికి చెందిన హఫీజ్‌పేట, కొంపల్లి, కుత్బుల్లాపూర్, సైనిక్‌పురి, కూకట్‌పల్లి, పటాన్‌చెరు డివిజన్లలో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే పలువురు ఏసీబీకి చిక్కుతున్నారు.

బదిలీలకు ఎండీ మోకాలడ్డు?

మణికొండ ప్రాంతానికి డివిజన్-18లో జీఎం కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. నీటిసరఫరాలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు. ఒక ప్రాంతానికి ఎక్కువగా, మరో ప్రాంతానికి మరోవిధంగా అందిస్తున్నారు. కొత్త కనెక్షన్ల మంజూరులో పెద్దఎత్తున కలెక్షన్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో జీఎంను బదిలీ చేసి డివిజన్-3కి చెందిన జీఎంను నియమించారు. ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టగానే, మరుసటి రోజే మరోచోటుకు బదిలీ చేశారు. పాత జీఎంనే కొనసాగిస్తూ కొత్తగా ఉత్తర్వులిచ్చారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, వాటర్‌బోర్డు ఎండీనే ఆయన బదిలీని అడ్డుకున్నట్లు చర్చనీయాంశం అవుతోంది. అత్యధికమంది జీఎంలు వివిధ డివిజన్లలో ఏళ్లతరబడి పని చేస్తున్నారు. ఈక్రమంలో ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న వారిని బదిలీ చేయాలని ఇంజనీర్ల అసోసియేషన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇటీవల వినతిపత్రం సమర్పించింది.

మహిళా రైతులకు 'ఆశా'జ్యోతి...

చదువు అంతంతమాత్రం. ఎన్నడూ గ్రామాన్ని దాటి వెళ్ళలేదు. అడుగడుగునా ఆంక్షలు. ఈ అవరోధాలన్నిటినీ దాటి... జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకొనే స్థాయికి ఎదిగారు సాగర్ కున్వర్. రాజస్థాన్‌లోని మారుమూల పల్లెకు చెందిన ఆమె చొరవ వందలాది మందికి ఉపాధి కల్పించింది. ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.

"పెళ్ళయ్యేవరకూ పుట్టిల్లు, ఆ తరువాత అత్తిల్లు. ఆడపిల్లలు వాటికే పరిమితం కావాలి. చదువు, ఉద్యోగం వాళ్ళ పని కాదు... ఇది మా ప్రాంతంలో బాగా పాతుకుపోయిన అభిప్రాయం. దాన్ని ప్రతిఘటించడం కాదు కదా... వ్యతిరేకంగా మాట్లాడడం కూడా మహా నేరం. అటువంటి పరిస్థితుల్లో... ఒక మహిళగా నా కాళ్ళ మీద నేను నిలబడి, ఇతర మహిళల శ్రేయస్సు కోసం ప్రయత్నించడానికి ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. నేను పుట్టింది, పెరిగింది రాజస్థాన్ రాష్ట్రం పాలి జిల్లాలోని ఒక చిన్న గ్రామం. అనేక ఆంక్షల మధ్య చదవడం, రాయడం మాత్రమే నేర్చుకోగలిగాను. పదహారేళ్ళకే నాకు పెళ్ళయింది. ఇంటి పనులు, పిల్లలు పుట్టాక వాళ్ళ బాధ్యతలు, పెరట్లో ఆవుల సంరక్షణ, కోళ్ళ పెంపకం, నా భర్తకు వ్యవసాయంలో సాయం చెయ్యడం... అలా కొన్నేళ్ళు గడిచిపోయాయి. మా



కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. ఎదుగుతున్న పిల్లలకు మంచి చదువులు చెప్పించి, ప్రయోజకుల్ని చేయడం గురించే ఆలోచించేదాన్ని. నేను ఎప్పుడూ మా గ్రామం దాటి బయటకు వెళ్ళలేదు. కుటుంబ ఆదాయాన్ని పెంచడానికి ఏం చేయాలనేది అర్థమయ్యేది కాదు. అలాంటి పరిస్థితుల్లో నాకొక ఆశాకిరణం కనిపించింది. అదే 'ఆశా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' (ఎఎంఎంపిసిఎల్). పాల సేకరణ కోసం పారదర్శకమైన ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి, ఉత్పత్తి పెరుగుదలకు సాంకేతిక సహకారాన్ని అందించడం కోసం టాటా ట్రస్ట్ వారి 'డెయిరీ మిషన్' తదితర సంస్థల ద్వారా మా జిల్లా కేంద్రంలో 2016లో అది ఏర్పాటయింది. దాని ప్రతినిధులు మా గ్రామానికి వచ్చి... ఆ సంస్థలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రచారం చేశారు. ఊళ్ళో మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ సొసైటీలో సభ్యులుగా మహిళలే ఉండాలని వాళ్ళు స్పష్టం చేసినా... ఇంట్లో మగవారికి భయపడి పేర్లు ఇవ్వడానికి అందరూ జంకారు. నేనూ కాస్త తటపటాయించినా ధైర్యం చేశాను. మొదటి సభ్యురాలుగా నా పేరు నమోదు చేయించుకున్నాను. ఆ తరువాత ఒక్కొక్కరూ చేరారు.

ఇంట్లో పెద్ద యుద్ధమే జరిగింది...

సొసైటీ ఏర్పాటయ్యాక నాకు చదవడం, రాయడం వచ్చని ఆ సంస్థ నిర్వాహకులకు తెలిసింది. "మీ ఊళ్ళో సేకరించే పాల వివరాల్ని రోజూ నమోదు చెయ్యడానికి ఒకరు కావాలి. బుక్‌కీపర్‌గా చేరండి" అని అడిగారు. ఆ సంగతి ఇంట్లో చెబితే పెద్ద యుద్ధమే జరిగింది. "ఇదంతా నా పిల్లల భవిష్యత్తు కోసమే" అని నేను గట్టిగా వాదించి ఒప్పించాను. కానీ ఉద్యోగంలో చేరాక... గ్రామస్తుల దుర్భాషలను, బెదిరింపులను తీవ్రస్థాయిలో ఎదుర్కోవాల్సి వచ్చింది. ఊళ్ళో మహిళల్ని చెడగొడుతున్నావని నా మీద విరుచుకుపడ్డారు. భౌతిక దాడులకు కూడా ప్రయత్నించారు. అవన్నీ తట్టుకున్నాను. వీలైనంతమంది మహిళలను సొసైటీలో చేర్పించాను. మరోవైపు గోబర్ గ్యాస్ ప్లాంట్లలోని వ్యర్థాలను సేకరించడం, సేంద్రియ ఎరువుల తయారీ లాంటి అంశాల్లో 'ఆశా' సంస్థకు చెందిన నిపుణుల నుంచి శిక్షణ పొంది, యూనిట్లు ప్రారంభించాను. మా పొలంలో సాగు చేయడం, పశువుల పెంపకం లాంటి పనుల్లో నాకున్న నైపుణ్యం బమనాకు ఎంతో సాయపడింది. ఆ తరువాత మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ స్వయంసహాయక బృందానికి నన్నే ఛైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే చర్యలను వివరించడం, మహిళా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చేయడం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం... ఇవీ నా ప్రధాన బాధ్యతలు. దీని కోసం మా చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాను. మొదట్లో సేంద్రియ పద్ధతులు అనుసరించడానికి ఎక్కువమంది ముందుకురాలేదు. కానీ అది పర్యావరణానికీ, సమాజానికీ ఎంత మేలు చేకూరుస్తుందో ఎన్నోసార్లు వివరించిన తరువాత రైతుల ధోరణిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం మా స్వయంసహాయక బృందంలో 400 మందికి పైగా సభ్యులున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా బృందాల ఏర్పాటులో నేను క్రియాశీలంగా వ్యవహరించాను. జిల్లా, రాష్ట్రస్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాను. 'ఆశా'లో బుక్‌కీపర్‌గా తీసుకొనే వేతనం తప్ప... మిగిలిన పనులన్నీ ఉచితంగా, స్వచ్ఛందంగా చేస్తున్నాను.

అది కలలా అనిపిస్తోంది...

దేనికోసమైతే నేను కలలు కన్నానో... దాన్ని నిజం చేసుకున్నాను. నాకు వచ్చే వేతనంతో మా పిల్లల్ని బాగా చదివిస్తున్నాను. మా అమ్మాయి బెంగళూరు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్, మా అబ్బాయి స్థానికంగా ఇంటర్ చదువుతున్నారు. మహిళా రైతుల శ్రేయస్సు కోసం, సేంద్రియ సాగు కోసం నేను చేసిన కృషికి ప్రశంసలతో పాటు పురస్కారాలు కూడా దక్కాయి. కిందటి ఏడాది ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో... 'దూరదర్శన్ కిసాన్' నన్ను సత్కరించింది. అలాగే ఈ ఏడాది జనవరిలో 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (పిఎఫ్ఓ) ఎక్సలెన్స్' అవార్డు అందుకున్నాను. సభ్య రైతుల పురోభివృద్ధి కోసం పాటుపడిన వ్యవ



సాయ ఉత్పాదక సంస్థలను గుర్తించి ప్రోత్సహించడానికి ఇచ్చే పురస్కారం అది. ఎంతోకాలం మా ఊరు దాటని నేను దేశ రాజధానిలో జాతీయ స్థాయి పురస్కారాలను అందుకోవడం కలలా అనిపిస్తోంది. ఒకప్పుడు నన్ను తీవ్రంగా వ్యతిరేకించినవారే ఇప్పుడు నా సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ఈ గౌరవాన్ని నేను నా శ్రమతోనే సాధించుకున్నాను. వందలాది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదం చేశాననే సంతృప్తి నాకుంది. వ్యవసాయ రంగంలో మహిళలు ఎక్కువమందే ఉన్నా వారి కష్టానికి గుర్తింపు ఉండదు. మంచి భవిష్యత్తు కావాలంటే మహిళలు ధైర్యం చేసి అడుగు ముందుకు వెయ్యాలి. అప్పుడు వారు తమ జీవితాల్లోనే కాదు... సమాజంలో కూడా సానుకూలమైన మార్పు తేగలరు."

'ఆడపిల్ల చదువు దేశానికి వెలుగు' అన్నది నిన్నటి నినాదం. నిరుపేద యువతుల వివాహానికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, పెళ్లికానుకల పథకాలు నేటి విధానం. దీన్ని నిరసిస్తున్నారు ప్రముఖ సామాజిక వేత్త, ఎంవీఎఫ్ వ్యవస్థాపకురాలు **ప్రొఫెసర్ శాంతా సిన్హా**. అమ్మాయిల చదువుకు కాకుండా, పెళ్లికి పథకాలు పెట్టడమేంటని నిలదీస్తున్నారు. అసలు ఎవరినడిగి ఈ పథకాలు రూపొందించారని ఆమె ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పార్టీలన్నీ యువతుల ఉన్నత విద్యను ప్రోత్సహించే స్కీములను మేనిఫెస్టోలలో పెట్టాలంటున్న ఆమె... కరోనా అనంతర పరిణామాల గురించి 'నవ్య'తో సంభాషించారు.



పెళ్లికి కాదు... చదువుకు పథకాలు పెట్టండి...

"కల్యాణలక్ష్మి', 'షాదీముబారక్' లు కాదు... మాకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలి'- అని అమ్మాయిలందరూ అడుగుతున్నారు. బాగా చదువుకొని తన కాళ్ళమీద తాను నిలబడాలని సగటు యువతి కోరుకుంటోంది. అయితే, ఉన్నత విద్యను అభ్యసించడానికి గ్రామీణ అమ్మాయిలకు సరైన వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో పదో తరగతి లేదా ఇంటర్ తర్వాత చాలామంది తల్లితండ్రులు పెళ్లిచేయడానికే మొగ్గు చూపుతున్నారు. ఉన్నత విద్య ఖరీదు కావడం కూడా దీనికి మరొక ప్రధాన కారణం. ఈ పదేళ్ళలో సుమారు 12లక్షల మంది అమ్మాయిల వివాహానికి 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకం ద్వారా 10.5 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చింది. వారంతా 18 ఏళ్ళు నిండినవారే కానీ, ఇంటర్ లేదంటే డిగ్రీ చదువుతుండగా పెళ్లి పీటలెక్కారన్నమాటే కదా! అలా పెళ్లి పేరుతో మనమే అమ్మాయిలను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నాం. వారి కలలను చిదిమేస్తున్నాం. అదే సొమ్మును కనుక ప్రభుత్వం అమ్మాయిల చదువుకు కేటాయిస్తే, వారంతా ఉన్నత చదువులు పూర్తి చేసి కోరుకున్న రంగాలలో రాణిస్తారు కదా! తద్వారా సామాజికాభివృద్ధికి తోడ్పడతారు. పితృస్వామ్య హింస నుంచి మహిళలను రక్షించేది చదువు ఒక్కటే. అలాంటిదాన్ని వారికి దూరం చేస్తున్నాం. అటు ఆంధ్రప్రదేశ్‌లోనైనా, ఇటు తెలంగాణలోనైనా... పెళ్లికానుక, కల్యాణ లక్ష్మి లాంటి పథకాల ద్వారా అమ్మాయిల జీవితం పెళ్లితో సార్థకమవుతుందన్న పురుషాధిక్య భావజాలాన్ని ప్రభుత్వాలు సమాజంమీద మరింత రుద్దుతున్నాయి. అసలు రాజకీయ పార్టీలు ఎవరిని అడిగి ఈ పథకాలు రూపొందిస్తున్నాయి? ఇలాంటి పథకాలు ప్రకటించే ముందు నాయకులు అమ్మాయిల అభిప్రాయాలు తెలుసుకున్నారా.?

> **బాల్యవివాహాలు ఆగాయి...**
>
> ఎంవీఎఫ్ పనిచేస్తున్న గ్రామాలలో వలంటీర్ల ప్రోత్సాహంతో కిశోర బాలికలంతా కలిసి సంఘాలుగా ఏర్పడ్డారు. ప్రతి శని, ఆదివారాలు వారంతా కలిసి కూర్చొని వ్యక్తిగత, సామాజిక సమస్యలమీద చర్చించుకొంటారు. ఆ క్రమంలో అమ్మాయిల భాగస్వామ్యం లేకుండా గ్రామసభలు నిర్వహించడానికి వీల్లేదని కూడా వారంతా కలిసి పోరాడారు. కొన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అయితే స్థానిక నాయకులను డిమాండ్ చేసి మరీ అమ్మాయిల కోసం ప్రత్యేకంగా లైబ్రరీ, సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. బాలికలు గ్రామ సభల్లో తమ సమస్యలను చర్చిస్తున్నారు. అలా ఒక గ్రామంలో ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని స్కూలుకు వెళ్ళడానికి బస్సు సౌకర్యం కోసం అమ్మాయిలంతా కలిసి ధర్నా చేసి, విజయం సాధించారు. పదోతరగతి చదువుతున్న ఒక అమ్మాయికి ఇంట్లోవాళ్ల పెళ్లి నిశ్చయించారు. ఆ విషయం బాలికా సంఘం దృష్టికి రావడంతో... వారంతా అమ్మాయి కుటుంబాన్ని కలిసి నచ్చజెప్పి మరీ పెళ్లి ఆపించారు. ఇలా ఒకటి, రెండు కాదు... బాలికా సంఘాల ప్రతినిధులు ఎన్నో బాల్య వివాహాలను అడ్డుకున్నారు. జెండర్ అసమానతలకు వ్యతిరేకంగా హక్కుల సాధన కోసం వారంతా కలిసి 'తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య' ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

రాహుల్‌తో సంభాషణ...

సూర్యాపేట, వికారాబాద్, రంగారెడ్డి, గద్వాల్ జిల్లాలలో లింగ సమానత్వం సాధన దిశగా 'మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్' (ఎంవీఎఫ్) ద్వారా పనిచేస్తున్నాం. ఈ క్రమంలో చాలామంది గ్రామీణ అమ్మాయిలతో మాట్లాడినప్పుడు "మా పెళ్లికి కాదు, చదువుకోడానికి పథకాలు పెట్టండి" అని వారంతా అడుగుతున్నారు. ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాను. ఆయనతో రెండుసార్లు సంభాషించిన సందర్భంలో... తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అస్సలు బాగాలేదని చెప్పాను. "గత పదేళ్ళలో పాఠశాల విద్య కేంద్రీకృతం అయింది. తరగతి గదిలో అధికారుల జోక్యం పెరిగింది. రోజూ పిల్లల హాజరు లాంటి డేటా అప్‌లోడ్‌తోనే ఉపాధ్యాయులకు సరిపోతోంది. ఇకవారికి పాఠాలు బోధించే సమయం మిగలడంలేదు. కరోనా తర్వాత దేశ వ్యాప్తంగా బాలకార్మికులు పెరిగారు. దీని మీద ప్రభుత్వాలకు ఒక అంచనా లేదు" అని కూడా వివరించాను. పిల్లలకు సంబంధించి విధాన నిర్ణయాలలో మార్పు అవసరమని కొన్ని సూచనలు కూడా ఇచ్చాను. అవన్నీ రాహుల్ సావధానంగా విని, సానుకూలంగా స్పందించారు.

బాలకార్మికులు పెరిగారు

రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో బాలలకు వయసు వారీగా పథకాలు ప్రవేశపెట్టాలి. మరీ ముఖ్యంగా 14 నుంచి 18ఏళ్ళ మధ్యలో ఎక్కువమంది చదువుకు దూరమవుతున్నారు. అందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఎక్కువ. కనుక పిల్లలందరికి సమానమైన విద్యను అందించాలి. పదోతరగతి తర్వాత అకడమిక్స్ పట్ల ఆసక్తిలేనివారికి... వారి అభిరుచి మేరకు ఆసక్తి కలిగిన రంగంలో నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించాలి. సమాజంలో అసమానతలను తొలగించేది చదువు ఒక్కటే. కనుక అందరికీ ఒకేలాంటి విద్యావకాశాలు కల్పించడంద్వారా మాత్రమే సమానత్వాన్ని సాధించగలం. అంతేకానీ, 'వృత్తివిద్యా కోర్సులను పేద విద్యార్థులే చదవాలి, ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటివి సంపన్నుల కోసం' లాంటి విద్యా విధానంతో సమాజానికి ఒనగూరేదేమీలేదు. కనుక కనీసం 18ఏళ్ళలోపు పిల్లలందరికి తారతమ్యాలు లేకుండా, నాణ్యమైన ప్రమాణాలతో కూడిన సమానమైన విద్యావకాశాలు కల్పించాలి. ఆ విధమైన పాలసీలు రాజకీయ పార్టీలు రూపొందించాలి. అలాంటి విధానాల కోసం ప్రజలు రాజకీయ నాయకులను గట్టిగా నిలదీయాలి.

అన్నిచోట్లా ఇదే పరిస్థితి...

గ్రామాల నుంచి చదువు కోసం నగరాలకు లేదంటే పట్టణాలకు వెళుతున్న అమ్మాయిలకు సరైన వసతి సౌకర్యాలు ఎక్కడా సక్రమంగా లేవు. హైదరాబాద్‌లోని కొన్ని పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలతో పాటు మాసబ్‌ట్యాంక్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థినిలకు హాస్టల్ వసతి ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. అలాంటి విద్యా సంస్థలు మన కళ్ళ ముందు బోలెడు కనిపిస్తాయి. మరి అలాంటి కాలేజీలలో చదివే అమ్మాయిలు ప్రైవేటు హాస్టళ్ళలో ఉండాలంటే నెలకు ఖర్చు పదివేల రూపాయలకు తక్కువ అయితే కాదు కదా. కూలీ నాలీ చేసుకొని బతికే కుటుంబాల నుంచి వచ్చిన అమ్మాయిలు అంత మొత్తం భరించగలరా.? ఒక్క హైదరాబాదే కాదు, విజయవాడ, తిరుపతి, కర్నూలు, మహబూబ్‌నగర్, వరంగల్... ఇలా ప్రతి పట్టణంలోనూ ఇదే పరిస్థితి. ఒక అమ్మాయి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వస్తే, ఆశ్రయం ఇచ్చేందుకు ఒక్క షెల్టర్ హోమ్ అయినా ఉందా? పోనీ వారికి ఈవ్‌టీజింగ్, లైంగిక దాడులు లాంటి వాటి నుంచి భద్రత కల్పించగలుగుతున్నామా. అసలు అమ్మాయిల చదువుకు సంబంధించి... ఒక్క పార్టీకైనా విధానమంటూ ఒకటుందా? ఇవన్నీ ఆలోచించకుండా, పెళ్లికానుకలు ఇచ్చి చేతులు దులుపుకొంటామంటే మాత్రం సరికాదు.

> **పంచాయతీ భాగస్వామ్యంతో...**
>
> గద్వాల్ జిల్లాలో పత్తి పంట చేతికొచ్చిన సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదులన్నీ చాలావరకు ఖాళీగా కనిపిస్తుంటాయి. అలాగే ప్రకాశం, గుంటూరు జిల్లాలలో మిచ్చి కోతలప్పుడూ అదే పరిస్థితి. బడిలో ఉండాల్సిన పిల్లలు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. లాక్‌డౌన్ తర్వాత బాల కార్మికులు మరింత పెరిగారు. దీనిమీద ప్రభుత్వాలకు ఒక అంచనా లేదు. ముఖ్యంగా ఎనిమిదో తరగతి తర్వాత చాలామంది చదువుకు దూరమవుతున్నారు.
>
> ఎక్కడికక్కడ స్థానిక నాయకుల భాగస్వామ్యంతో బడి బయట పిల్లలను గుర్తించి... గ్రామంలోని బాలలంతా పాఠశాలలో ఉండేలా కార్యచరణ చేపట్టడం ఇప్పుడు చాలా అవసరం. 'పిల్లలు రోజూ స్కూలుకు వెళుతున్నారా? లేదా?' అన్నది కూడా గ్రామ పంచాయతీలు పర్యవేక్షించాలి. బాలకార్మిక రహిత గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యతను స్థానికులకు అప్పగించాలి. అంతేకానీ, ఉన్నతాధికారులు కార్యాలయాల్లో కూర్చొని కార్యక్రమాలు చేపట్టడం వల్ల అవి క్షేత్రస్థాయిలో అమలుకావు.

బ్రిడ్జి కోర్సులు ఉండాయి...


ఉమ్మడి ఏపీలో సర్వశిక్షా అభియాన్ 1994 నుంచి 1996 వరకు బ్రిడ్జి కోర్సులు నిర్వహించింది. నిజానికి బడి బయట పిల్లలను తిరిగి చదువుకు చేరువ చేసేందుకు అది చాలా మంచి కార్యక్రమం. సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కేంద్రాలుగా... మూడు నెలల పాటు పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన అనంతరం వారి చదువు ఎక్కడైతే ఆగిందో, మళ్లీ అదే తరగతిలో వారు కొనసాగేందుకు అవకాశం కల్పించడం ద్వారా కొన్ని వేలమంది విద్యావంతులు కాగలిగారు. ఒక ఏడాదైతే మూడు లక్షలమంది పిల్లలు బ్రిడ్జి కోర్సులో చేరి చదువు కొనసాగించారంటే మాటలు కాదు. అంత మంచి కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలి. ఆనాడు నాగార్జున, సమర్జిత్ రె, కె.రాజు లాంటి ఐఏఎస్‌ల ప్రత్యేక శ్రద్ధ వల్ల ఇలాంటి మంచి కార్యక్రమాలన్నీ రూపుదిద్దుకున్నాయి. ఆ స్ఫూర్తి ఇప్పుడు అవసరం. విద్యా విధానంలో కేరళ దేశానికే తలమానికంగా నిలిచింది. ఆ రాష్ట్రంలో బాల కార్మికులు లేరు. ప్రాథమిక విద్యకు వారు ఇస్తున్న ప్రాధాన్యతను కళ్లారా చూశాను. విద్యా, వైద్య రంగాల విషయంలో కేరళ నుంచి మనం చాలా నేర్చుకోవాలి. కేపిటలిజం మనుగడకైనా విద్యావంతులు అవసరం. కనుక ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను ప్రతి ఒక్కరికి అందించడం ద్వారానే వ్యవస్థ ముందుకువెళుతుందన్న సంగతి పాలకులు గుర్తించాలి."

● **సాంత్వన్,** ఫొటో: రాజ్‌కుమార్

నవ్య | చిత్రజ్యోతి

ఫైట్స్‌లోనూ మెగాస్టారే





కసి, కృషి కలగలసిన వ్యక్తిత్వం చిరంజీవి సొంతం. యువతను ఉర్రూతలూగించే డ్యాన్స్‌లు చేసినా, మాస్‌ను మైమరపించే ఫైట్స్ చేసినా ఆయన నమ్ముకున్నది తన కష్టాన్నే. దీనికి నిదర్శనంగా నిలిచే సంఘటన 'విశ్వంభర' సెట్స్‌లో మరోసారి ఆవిష్కృతమైంది. చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇటీవలే మొదలైన తాజా షెడ్యూల్‌లో భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. సాధారణంగా రిస్కీ ఫైట్స్ అనగానే చాలామంది హీరోలు పక్కకు తప్పుకొని డూప్‌ను పెడతారని చెబుతుంటారు. కానీ చిరంజీవి మాత్రం అందుకు ససేమిరా అంటున్నారు. ఈ వయసులోనూ అత్యంత కష్టమైన యాక్షన్ సీక్వెన్స్‌లోనూ స్వయంగా పాల్గొంటున్నారు. తాళ్లతో బంధించి గాల్లోకి లేపడం, రాతి నేల పైన స్టంట్స్ చేయడం వల్ల ఒళ్లు హూనమౌతున్నా పంటి బిగువున భరిస్తున్నారు తప్ప డూప్‌ను మాత్రం వాడడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఈ వయసులో కూడా ఆయన అలా కష్టపడడం చూసి సెట్‌లో జనాలు ఆశ్చర్యపోతున్నారట. హిట్ కొట్టాలనే పట్టుదల, వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధత అలాంటిది మరి. సోషియో ఫైన్స్ ఫాంటసీగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో వీఎఫ్ఎక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. వచ్చే సంక్రాంతికి 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకు రానుంది.

సరికొత్త సాహసం...

హీరో నిఖిల్ సిద్ధార్థ్ కార్తికేయ-2 చిత్రంతో పాన్ ఇండియా లెవెల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో వచ్చిన కార్తికేయ-2 ముగింపు అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించింది. ముగింపు సన్నివేశాల్లో కార్తికేయ-3 ఉంటుందని దర్శకుడు సంకేతాలిచ్చారు. దీంతో కార్తికేయ-3 చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులకి తెరదించుతూ.. త్వరలోనే కార్తికేయ-3 వస్తోందని నిఖిల్ ప్రకటించారు. "డాక్టర్ కార్తికేయ త్వరలోనే సరికొత్త సాహసాన్ని అన్వేషించేందుకు సన్నద్ధమవుతున్నారు" అని పోస్ట్ చేశారు. ఈ చిత్రాన్ని మొదటి రెండు భాగాలతో పోలిస్తే మరింత లార్జర్ స్కేల్‌లో, భారీ బడ్జెట్‌తో నిర్మించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. చందు మొండేటి దర్శకత్వంలో నిఖిల్, కలర్స్ స్వాతి జంటగా నటించిన కార్తికేయ మొదటిభాగం 2014లో రిలీజై సూపర్ హిట్‌గా నిలిచింది. 2022లో వచ్చిన రెండో భాగం నిఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా మారింది. ప్రస్తుతం నిఖిల్ పాన్ ఇండియా లెవెల్లో తెరకెక్కుతున్న పీరియాడికల్ మూవీ 'స్వయంభు'లో నటిస్తున్నారు.



ప్రశంసలూ.. అవార్డులూ



పద్మవిభూషణ్ గ్రహీత, తెలంగాణ మహాకవి, కాళోజీ నారాయణ రావు జీవిత కథగా తెరకెక్కిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. డాక్టర్ ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించారు. టైటిల్ రోల్‌లో మూల విరాట్ (అశోక్ రెడ్డి) నటించారు. విజయలక్ష్మీ జైనీ నిర్మించారు. గతేడాది ఈ చిత్రం రిలీజైంది. ప్రదర్శితమైన ప్రతీ చోటా విమర్శకుల ప్రశంసలతో పాటూ అవార్డులనూ కొల్లగొడుతోంది. తాజాగా ఈ చిత్రం ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో ఫీచర్ ఫిక్షన్ కేటగిరీలో స్పెషల్ జ్యూరీ అవార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ "గతంలోనూ ఈ చిత్రం పలు అవార్డులు కైవసం చేసుకుంది" అని చెప్పారు.



'ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అవార్డ్స్ 2024' వేడుక ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. నటుడు మురళీమోహన్, వీకే నరేశ్, గీత రచయిత చంద్రబోస్, నటి రోజారమణి, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ హంగామా



ఆశిష్ గాంధీ, అశోక్, వర్ష, హ్రితిక హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'హద్దులేదురా'. రాజశేఖర్ రావి దర్శకత్వం వహిస్తున్నారు. వీరేష్ గాజుల బళ్లారి నిర్మిస్తున్నారు. మార్చి 21న విడుదలవుతోంది. ఆదివారం, ఈ చిత్రం ట్రైలర్‌ను డైరెక్టర్ గోపీచంద్ మలినేని విడుదల చేశారు. దర్శకుడు రాజశేఖర్‌కి ఇది మొదటి చిత్రమైనా, ఎన్నో చిత్రాల అనుభవం ఉన్న డైరెక్టర్‌లా చిత్రాన్ని అద్భుతంగా తీశారు. ఫ్రెండ్షిప్‌తో పాటు మంచి యాక్షన్ కూడా ఉంది అని ప్రశంసించారు. దర్శకుడు మాట్లాడుతూ "ఎలాంటి హద్దులూ పెట్టుకోకుండా జీవితాన్ని నచ్చినట్లు బ్రతకాలని ఈ చిత్రానికి 'హద్దులేదురా' అనే టైటిల్ పెట్టాం" అని తెలిపారు.

అరుంధతి హాస్యంతో...



వెన్నెల కిశోర్, కమల్ కామరాజు ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రానికి 'ఓసేయ్ అరుంధతి' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. విక్రాంత్ కుమార్ దర్శకత్వంలో గూడూరు ప్రణయ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'కామెడీ థ్రిల్లర్ జానర్‌లో 'ఓసేయ్ అరుంధతి'ని నిర్మిస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'అరుంధతి అనే మధ్య తరగతి ఇల్లాలి కథ ఇది. సత్యనారాయణ స్వామి వ్రతం చేయాలనుకున్న అరుంధతికి ఓ సమస్య ఎదురవుతుంది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ ప్రధానంగా సాగుతుంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్. సినిమాటోగ్రఫీ: సాయి చైతన్య మాటేటి

ఆ సినిమాకు సీక్వెల్ కాదు



కథ బాగా నచ్చి 'ఓం భీమ్ బుష్' చిత్రంలో భాగమయ్యాను. శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ కూడా నటిస్తున్నారనేసరికి ఆసక్తి కలిగింది. మేం ముగ్గురం కలసి 'బ్రోచేవారెవరురా' చేశాం. అయితే ఇది ఆ సినిమాకు సీక్వెల్ కాదు. పూర్తి భిన్నంగా ఉంటుంది' అని ప్రియదర్శి అన్నారు. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో వీ సెల్యులాయిడ్‌తో కలసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ఈ నెల 22న విడుదలవుతోన్న సందర్భంగా ప్రియదర్శి సినిమా విశేషాలను పాత్రికేయులతో పంచుకున్నారు.

● ఇందులో నా పాత్ర పేరు డాక్టర్ వినయ్ గుమ్మడి. ముగ్గురు స్నేహితులం తింగరి పనులు చేసి సమస్యల్లో ఇరుక్కుంటాం. మా పాత్రల మధ్య సంఘర్షణ నుంచి మంచి హాస్యం పుడుతుంది. అసభ్యత లేకుండా దర్శకుడు కామెడీ సన్నివేశాలను తీర్చిదిద్దాడు. ఫాంటసీ, హారర్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.

● అయేషాఖాన్ నాకు జోడీగా నటించారు. సునీల్, వంశీ ఖర్చుకు వెనుకాడకుండా నిర్మించారు. ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్'తో పాటు హీరోగా ఓ చిత్రం చేస్తున్నాను.

దిక్సూచి
హైదరాబాద్ ● సోమవారం 18 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను 2024 జూన్ 9న నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. గ్రూప్-1 ప్రిలిమినరీ సిలబస్‌లో 13 అంశాలున్నాయి. వాటిలో అయిదో అంశంగా భారత సామాజిక, ఆర్థికాభివృద్ధి అనే అంశం ఉంది. మొత్తం 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది. 150 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 150 నిమిషాలు. పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఇచ్చిన నాలుగు ఆప్షన్స్‌లో నుంచి ఒకటి గుర్తించాలి. 13 అంశాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. ఈ నేపథ్యంలో ఎకానమీలో ప్రశ్నలు అడిగే తీరు పరిశీలిద్దాం.

గ్రూప్-1 ప్రిలిమినరీలో ఎకానమీ
ఎన్ని ప్రశ్నలు? ఎలా చదవాలి?


ఎకానమీ నుంచి 10 నుంచి 15 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఇక్కడ అభ్యర్థులకు ఉండే సవాలు ఏమంటే, సిలబస్‌లో కేవలం 'భారత సామాజిక, ఆర్థికాభివృద్ధి' అని మాత్రమే ఉండటం.

వీటిపై దృష్టి పెట్టండి

సామాజిక, ఆర్థికాభివృద్ధిలో అనేక అంశాలుంటాయి. దీనిలో వేటిపైన దృష్టి నిలపాలనేది అభ్యర్థులు ఎదుర్కొనే ప్రాథమిక ప్రశ్న. సామాజిక, ఆర్థికాభివృద్ధిలో 'సామాజిక' అంటే - ఎకానమీ అధ్యయనంలో విద్య/ విజ్ఞానం, ఆరోగ్యం/ వైద్యం అనే అంశాలను ప్రధానంగా చర్చిస్తారు. అలా అనుకున్నప్పుడు భారతదేశంలో అక్షరాస్యత, విద్య, శిక్షణ మొదలైన అంశాల్లో సాధించిన పురోగతి పరిణామక్రమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అదేవిధంగా ఆరోగ్యం/ వైద్య సౌకర్యాల అభివృద్ధి ప్రక్రియను దృష్టిలో ఉంచుకోవాలి. ఉదాహరణకు భారతదేశం స్వాతంత్ర్యం పొందిన నాటినుంచి ఇప్పటివరకు అక్షరాస్యతలో సాధించిన ప్రగతి. అందులో స్త్రీ, పురుషుల అక్షరాస్యత, వివిధ సామాజిక వర్గాలు ప్రత్యేకించి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల అక్షరాస్యత ప్రగతిని విశ్లేషణాత్మకంగా చదవాలి. 1891 నుంచి ప్రతి పది సంవత్సరాలకు జరుపుతున్న జనాభా లెక్కల్లో ఈ సమాచారం లభిస్తుంది. ప్రత్యేకించి లేటెస్ట్ జనాభా లెక్కల సమాచారాన్ని చూసుకోవాలి. 2021లో జనాభా లెక్కలు జరగాల్సి ఉంది కానీ జరగలేదు. కనుక 2011లో ప్రకటించినవే తాజా జనాభా లెక్కలు అవుతాయి.

ఇక ఆరోగ్య సూచికలుగా వ్యక్తి జీవితకాలం, మరణాల రేటు, శిశు మరణాల రేటు, గర్భవతుల మరణాల రేటును చూస్తారు. ఈ ఆరోగ్య సూచికల్లో వచ్చిన మార్పును విశ్లేషణాత్మకంగా చదవాలి. ఈ సమాచారం కూడా జనాభా లెక్కల్లో ఉంటుంది. జనాభా లెక్కల సమాచారం ఇండియా ఇయర్‌బుక్‌లోనూ, భారతప్రభుత్వం ప్రకటించే ఇండియా ఆర్థికసర్వే(ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా)లోనూ ఉంటుంది. కేంద్ర ఆర్థికశాఖ వెబ్‌సైట్‌లో బడ్జెట్ లింక్‌లో ఆర్థిక సర్వేలు ఉంటాయి. ఆర్థికసర్వేలో ఉన్న విద్య, ఆరోగ్య అంశాలను చదివి, చివరన ఉన్న గణాంక సమాచారంలో 'మానవాభివృద్ధి' గణాంక సమాచారాన్ని చూస్తే విద్య, ఆరోగ్య సమాచారం ఉంటుంది. ఈ సమాచారం 'నీతి ఆయోగ్' వెబ్‌సైట్‌లో కూడా ఉంది.

ఆర్థికాభివృద్ధి అంశం పరిధిలో భారతదేశ జాతీయాదాయం, వృద్ధి, వివిధ రంగాల కూర్పు ధోరణులు, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాలు వృద్ధి చెందిన తీరుపై ప్రశ్నలు ఉంటాయి. దీనికోసం భారత ఆర్థికవ్యవస్థపై రాసిన ఏదేని ఒక ప్రామాణిక పుస్తకాన్ని చదవడంతో పాటు తాజా భారత ఆర్థికసర్వే, యూనియన్ బడ్జెట్‌ల సహాయంతో తాజాగా వచ్చిన మార్పులపై దృష్టి నిలపాలి.



ఎకానమీలో వచ్చే ప్రశ్నలు ప్రధానంగా మూడు రకాలు.
1. వివిధ ఆర్థిక అంశాల/చలాంకాల భావనలకు సంబంధించినవి
2. వివిధ ఆర్థిక చలాంకాల ధోరణులు
3. వివిధ ఆర్థిక చలాంకాల ప్రస్తుత స్థితి

ఉదాహరణకు వివిధ చలాంకాల భావనలకు సంబంధించి ప్రశ్నలు కిందివిధంగా ఉంటాయి.

ఆర్థికాభివృద్ధిని జాతీయాదాయం, తలసరి ఆదాయం మొదలైన వాటిలో వచ్చిన పెరుగుదల ఆధారంగా తీసుకుంటారు. పేదరికం, నిరుద్యోగం, అవస్థాపన సౌకర్యాలు మొదలైన వాటిలో వచ్చిన మార్పును కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల ఆర్థికాభివృద్ధిపై ప్రశ్నలు అడగాలనుకున్నప్పుడు పై అంశాల భావనల మీద కూడా ప్రశ్నలు ఉంటాయి. అంటే జాతీయాదాయం అంటే ఏమిటి? పేదరికం, నిరుద్యోగం నిర్వచనాలు, వాటిని కొలిచే సాధనాల్లో వచ్చిన మార్పులు మొదలైన వాటిపై ప్రశ్నలుంటాయి.

జాతీయాదాయాన్ని తీసుకుంటే జాతీయాదాయానికి సంబంధించి దాదాపు '10' భావనలు ఉన్నాయి. ఈ భావనలపై స్పష్టత, కచ్చితత్వం ఆధారంగా ప్రశ్నలు వేసే అవకాశం ఉంది. ఉదాహరణ-

ప్రశ్నలు ఇలా అడగవచ్చు

1. కింది వాటిలో 'జాతీయాదాయం' అని దేనిని పిలుస్తారు?
1) స్థూల జాతీయోత్పత్తి
2) స్థూల దేశీయోత్పత్తి
3) నికర జాతీయోత్పత్తి
4) ఉత్పత్తి కారకాల ధరల్లో నికర జాతీయోత్పత్తి.

సమాధానం: 4

ఇక భావనల విషయంలో వస్తున్న మార్పుల విషయంలో కూడా ప్రశ్నలు ఉంటాయి.

2. ఇటీవలి కాలంలో జాతీయాదాయం భావనల్లో చేరిన అంశం ఏది?
1) నిజ జాతీయాదాయం 2) వ్యయార్థ ఆదాయం
3) స్థూల అదనపు విలువ
4) నికర దేశీయోత్పత్తి

సమాధానం:3

భావనల తరవాత ఆర్థిక చలాంకాల ధోరణులపై ప్రశ్నలుంటాయి. ధోరణి అంటే ఒక చలాంకంలో దీర్ఘకాలంలో వస్తున్న మార్పు. ఉదాహరణకు జాతీయాదాయం పెరిగిందా? తగ్గిందా? పెరిగితే ఏ రేటుతో పెరిగింది? జాతీయాదాయంలో వివిధ రంగాల వాటా మారిందా? ఎలా మారింది? అనేవిధంగా ప్రశ్నలుంటాయి. ఉదాహరణకు-

3. స్వాతంత్ర్యానంతరం భారత జాతీయాదాయం కూర్పునకు సంబంధించి కింది వ్యాఖ్యలను పరిశీలించండి.
1) జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా తగ్గింది
2) జాతీయాదాయంలో సేవలరంగం వాటా పెరిగింది
3) జాతీయాదాయంలో పారిశ్రామికరంగం వాటా తగ్గింది
పై వ్యాఖ్యలలో సరైనవి.
1) 1, 2, 3 2) 1, 2 3) 2, 3 4) 1, 3

సమాధానం: 2

ఇప్పటివరకు భావన, ధోరణిని చూశాం. భావనలో స్పష్టత, దాని ధోరణి ఎంత ముఖ్యమో ఆ ఆర్థిక చలాంకం ప్రస్తుత స్థితి కూడా అంతే ప్రధానం.

అంటే జాతీయాదాయం పెరిగింది. అది ఎప్పుడు ఏ రేటుతో పెరిగిందనే అంశంలో ఇటీవల ఏ రేటుతో పెరుగుతోందనేది చాలా ముఖ్యం. అదేవిధంగా జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా తగ్గింది. అయితే ప్రస్తుతం అది ఎంత ఉందని తెలుసుకోవడం అవసరం. పేదరికం తగ్గింది అయితే ప్రస్తుత ఎంత ఉందనేది కూడా చాలా ముఖ్యం. ఉదాహరణకు-

4. భారతదేశ స్థూల అదనపు విలువలో వ్యవసాయరంగం వాటా 1990-91లో 35 శాతం ఉండగా 2022-23లో ఎంత శాతం ఉంది?
1) 25 2) 20 3) 15 4) 10

సమాధానం: 3

5. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం ఇటీవల విడుదల చేసిన 'భారత ప్రజల వినియోగ వ్యయం' సర్వేకు సంబంధించి కింది వాటిలో తప్పుగా పేర్కొన్నది ఏది?
1) 2022 ఆగస్టునుంచి 2023 జూలై వరకు ఈ సర్వే చేశారు
2) ఈ సర్వే ప్రకారం భారతదేశ గ్రామీణ ప్రజలు చేసే నెలసరి తలసరి వినియోగ వ్యయంలో ఆహారంపై చేసే వ్యయం 1999-2000లో 59.4 శాతం కాగా 2022-23లో 46.4 శాతంగా ఉంది
3) ఈ సర్వే సమాచారం ప్రకారం 'భారతదేశంలో పేదరికం అయిదు శాతం కంటే తక్కువగా ఉంటుంది' అని నీతి ఆయోగ్ ప్రధాన అధికారి బి.వి.ఆర్.సుబ్రమణ్యం ప్రకటించారు.
4) ఈ సర్వే ప్రకారం భారత ప్రజల వినియోగ వ్యయంలో 'ఆహారంపై చేసే వ్యయం శాతం పెరిగింది'.

సమాధానం: 4

ఈవిధంగా ఆర్థిక చలాంకాల భావనలపై స్పష్టత, ఆర్థిక చలాంకాల ధోరణిపై అవగాహన, వివిధ ఆర్థిక చలాంకాల తాజా స్థితి ఈ మూడురకాల అంశాలపై అభ్యర్థులు దృష్టిపెట్టి చదవాలి.

ఆర్థికాభివృద్ధికి సంబంధించిన వివిధరకాల ఆర్థిక చలాంకాల భావనలు, వాటి ధోరణుల కోసం తెలుగు అకాడమీ ప్రచురించిన ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పుస్తకం 'భారత ఆర్థికాభివృద్ధి(ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా)'ని చదవవచ్చు. వివిధ ఆర్థిక చలాంకాల ప్రస్తుత స్థితి, తాజా ధోరణులకు భారతదేశ తాజా ఆర్థిక సర్వే, బడ్జెట్‌లను కేంద్ర ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

డా.ఎం.ఎ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్,ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.



రీజనింగ్

కోడింగ్ డీకోడింగ్

ప్రతి పోటీపరీక్షలోను కోడింగ్-డీకోడింగ్ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు మూడు లేదా నాలుగు తప్పనిసరిగా ఉంటున్నాయి. దీనికి సంబంధించిన ప్రశ్నల్లో ఒక పదంలోని అక్షరాలు ఒక క్రమపద్ధతి ప్రకారం మరొక అక్షరాలుగా మార్చి ఉంటాయి. వేరొక పదాన్ని ఇస్తారు. అభ్యర్థి ముందుగా మొదటిపదంలోని అక్షరాలు ఏ పద్ధతిని అనుసరించి మరొక అక్షరాలుగా మార్చారో, పరిశీలించాలి. ప్రశ్నలో ఇచ్చిన వేరొక పదంలోని అక్షరాలను అదే పద్ధతిని అనుసరించి, మరొక అక్షరాలుగా రాయాలి.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాన్ని త్వరగా రాబట్టడం ఎంతో ముఖ్యం. దీనికి వర్ణమాల సవ్యదిశ అక్షరాలకు, అపసవ్యదిశ అక్షరాలకు సంఖ్యలు తెలిసి ఉండటం అవసరం.

వర్ణమాల, వాటి సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
A	B	C	D	E	F	G	H	I	J	K	L	M	N
26	25	24	23	22	21	20	19	18	17	16	15	14	13
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
O	P	Q	R	S	T	U	V	W	X	Y	Z		
12	11	10	9	8	7	6	5	4	3	2	1		

గమనిక: పై వర్ణమాలలో 1 నుంచి 26 అనగా సవ్యదిశ అని, వర్ణమాలకు కింద ఇచ్చిన సంఖ్యలు 26 నుంచి 1 అనేవి అపసవ్యదిశ అని అర్థం.

గమనించండి 27 రూల్: పై వర్ణమాలలో ఏ అక్షరాన్ని పరిశీలించినా ఆ అక్షరానికి పైన, కింద ఇచ్చిన సంఖ్యలను కూడిన ఆ మొత్తం విలువ 27 అని తెలుస్తోంది. అభ్యర్థి సవ్యదిశ వర్ణమాల అక్షరాలకు (A to Z) సంఖ్యలను నేర్చుకుంటే అపసవ్యదిశ వర్ణమాలకు సంఖ్యలను తెలుసుకోవడం సులువు. ఉదాహరణకు P సంఖ్య 16 అని మీకు తెలిసిన రెండోవైపు నుంచి తెలుసుకోవాలంటే 27 నుంచి 16ను తీసివేస్తే 27-16=11 అని చెప్పడం చాలా సులువు. అదేవిధంగా J సంఖ్య 10 అని మీకు తెలిసిన రెండోవైపు నుంచి తెలుసుకోవాలంటే 27-10=17. ఈ విధంగా ఈ 27రూల్ ద్వారా ఒకవైపు అక్షరాలకు సంఖ్యలు నేర్చుకుంటే రెండోవైపు అక్షరాలకు సంఖ్యలను తెలుసుకోవడం చాలా సులువు.

E J O T Y
5 10 15 20 25 కనీసం ఈ అక్షరాలకైనా అంకెలను బాగా గుర్తుపెట్టుకుంటే వాటికి కుడి, ఎడమలలో ఉండే అక్షరాల అంకెలను సులభంగా గుర్తించగలం. **ఉదా:** G అక్షరానికి సంఖ్య కావాలంటే E తరవాత రెండోది. E అనగా 5, 5+2=7, G అనగా 7వ అక్షరం. ఈవిధంగా EJOTYలో గల ప్రతి అక్షరానికి ఇరువైపుల గల అక్షరాల సంఖ్యలను గుర్తించడం సులువుగా ఉంటుంది.

+1 రూల్: ఏదేని ఒక అక్షరాన్ని దాని తదుపరి అక్షరంగా రాయడం లేదా 1వ అక్షరాన్ని 2వ అక్షరంగా, 2వ అక్షరాన్ని 3వ అక్షరంగా రాయడం.

ఉదా: A ను B గాను, B ను C గాను, C ను D గాను రాయడం.

+2 రూల్: ఏదేని ఒక అక్షరానికి +2 అక్షరం కావాలంటే ఇచ్చిన అక్షరానికి తదుపరి అక్షరం వదిలేయాలి. అలా వదిలేసిన అక్షరానికి తదుపరి అక్షరంగా రాయడం లేదా 1వ అక్షరాన్ని 3వ అక్షరంగా, 3వ అక్షరాన్ని 5వ అక్షరంగా ఆ విధంగా రాయడం.

ఉదా: Aను Cగాను, Cను Eగాను రాయడం.

+3 రూల్: ఏదేని ఒక అక్షరానికి +3 అక్షరం కావాలంటే ఇచ్చిన అక్షరానికి తరవాత రెండు అక్షరాలు వదిలేయాలి. అలా వదిలేసిన అక్షరాలకు తదుపరి అక్షరంగా రాయడం లేదా 1వ అక్షరాన్ని 4వ అక్షరంగా, 4వ అక్షరాన్ని 7వ అక్షరంగా ఆ విధంగా రాయడం.

ఉదా: A ను D గాను, D ను G గాను రాయడం.

-1 రూల్: ఏదేని ఒక అక్షరానికి దాని వెనక అక్షరంగా రాయడం లేదా 4వ అక్షరాన్ని 3వ అక్షరంగా, 3వ అక్షరాన్ని 2వ అక్షరంగా ఆ విధంగా రాయడం. **ఉదా:** Dను C గాను, Cను B గాను రాయడం.

-2రూల్: ఏదేని ఒక అక్షరానికి -2 అక్షరం కావాలంటే ఇచ్చిన అక్షరానికి వెనక ఒక అక్షరం వదిలేయాలి. అలా వదిలేసిన అక్షరానికి వెనక అక్షరంగా రాయడం లేదా 10వ అక్షరాన్ని 8వ అక్షరంగా, 8వ అక్షరాన్ని 6వ అక్షరంగా ఆ విధంగా రాయడం.

ఉదా: Jను Hగాను, Hను F గాను రాయడం.

-3 రూల్: ఏదేని ఒక అక్షరానికి -3 అక్షరం కావాలంటే ఇచ్చిన అక్షరానికి వెనక రెండు అక్షరాలు వదిలేయాలి. అలా వదిలేసిన అక్షరాలకు వెనుక అక్షరంగా రాయడం లేదా 10వ అక్షరాన్ని 7వ అక్షరంగా, 7వ అక్షరాన్ని 4వ అక్షరంగా రాయడం.

ఉదా: Jను G గాను, Gను D గాను రాయడం.

+ అనగా ఏదేని అక్షరానికి కుడివైపు వచ్చే అక్షరాలు అని.
- అనగా ఏదేని అక్షరానికి ఎడమవైపువచ్చే అక్షరాలు అని అర్థం.

గమనిక: A to Z అక్షరాల తరవాత ఇంకా అక్షరాలు అవసరమైతే Z 26వ అక్షరం తదుపరి మరలా Aను 27వ అక్షరంగా, Bను 28వ అక్షరంగా ఆవిధంగా భావించాలి.

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఉదా: Yకు +3 అవసరమైతే Yకు తదుపరి అక్షరం Zను +1గా, తదుపరి Aను +2 అక్షరంగా, తదుపరి Bను +3 అక్షరంగా భావించాలి. Yకు +3 అనగా Z, Aల తదుపరి B అక్షరం అవుతుంది.

ఉదా: Bకు -3 అక్షరం అవసరమైతే Bకు వెనుక Aను-1 గాను, Aకు వెనుక Zను -2గాను, Zకు వెనుక Yను -3గాను భావించాలి. Bకు -3 అనగా A, Zల వెనుక Y అక్షరం అవుతుంది.

కోడింగ్ - డీకోడింగ్ ప్రశ్నలకు ఒక పదంలోని అక్షరాలు ఒక పద్ధతి ప్రకారం మరో అక్షరాలుగా మార్చే విధానంలో జవాబులను రాబట్టాలంటే గమనించాల్సిన అంశాలు, పద్ధతులు.

1. ఈ విభాగంలో ప్రశ్నలు (ఎ) మొదటి నుంచి చివరకు లేదా (బి) చివరి నుంచి మొదటకు +గా లేదా '-' లుగా ఉంటాయి.
2. సవ్యదిశ అక్షరాలకు అపసవ్యదిశ అక్షరాలు రాయడం.
3. ముందుగా ప్రశ్నలోని అక్షరాలను తదుపరి అక్షరాలుగా లేదా వెనక అక్షరాలుగా రాసినా తదుపరి ప్రతి రెండు అక్షరాలను రివర్స్ చేయడం. (క్రాస్ మెథడ్).
4. పదంలోని అక్షరాలనే స్థానాలను మార్చి రాయడం.
5. ఒకే పదంలోని అక్షరాలను +గా లేదా -గా (తదుపరి అక్షరాలుగా లేదా వెనక అక్షరాలుగా) మార్చిన తరవాత ఏర్పడే అక్షరాల్లో మొదటి అర్ధభాగాన్ని అదే స్థానంలో, రెండో అర్ధభాగాన్ని అదే స్థానంలో రివర్స్ చేయడం.
6. ఒక పదంలోని అక్షరాలను +గా లేదా - గా (తదుపరి లేదా వెనక అక్షరాలుగా) మారిన తరవాత ఏర్పడే అక్షరాల్లో మొదటి అర్ధభాగాన్ని రెండో అర్ధభాగం స్థానంలో, రెండో అర్ధభాగాన్ని మొదట అర్ధభాగం స్థానంలో మార్చిడి (తారుమారు) చేయడం.

గమనిక: ఒకవేళ ఇచ్చిన పదంలో అక్షరాల సంఖ్య బేసిగా ఉంటే మధ్య అక్షరం స్థిరంగా ఉంటుంది. దానికి ఎడమవైపు అక్షరాలు, కుడివైపు అక్షరాలు 5, 6 పద్ధతుల్లో చెప్పినవిధంగా మారతాయి. చాలా రకాలుగా ప్రశ్నలుంటాయి. పైన పేర్కొన్న పద్ధతులపై పూర్తి అవగాహన కలిగి ఉంటూ అక్షరాల అంకెలపై (సవ్య, అపసవ్యదిశ) అపారమైన పరిజ్ఞానం కలిగి ఉంటే దాదాపు ప్రశ్నలోని అక్షరాలను ఏవిధంగా మార్చిన తెలుసుకోవడం చాలా వరకు సుసాధ్యమే. పైన పేర్కొన్న 6 పద్ధతులకు సంబంధించిన ప్రశ్నలను వివరణలతో పరిశీలిద్దాం.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

I. (ఎ) మొదటి నుంచి చివరకు:

ఉదా: ఒక సంకేత భాషలో PUBLICను QVCMJDగా రాస్తే అదే సంకేత భాషలో NATUREను ఏవిధంగా రాస్తారు?
ఎ) OBUVSF బి) UVBSFO సి) OBVUFS డి) FSVUBO

సమాధానం: (ఎ)

వివరణ: PUBLICను QVCMJDగా రాయడం అనగా PUBLIC అనే పదం మొదటి నుంచి అనగా P నుంచి C వరకు గల అక్షరాలను +1 అక్షరాలుగా అనగా తదుపరి అక్షరాలుగా రాశారు. Pకు తదుపరి అక్షరం Q, Uకు తదుపరి అక్షరం V, Bకు తదుపరి అక్షరం C, Lకు తదుపరి అక్షరం M, Iకు తదుపరి అక్షరం J, Cకు తదుపరి అక్షరం D. ఈ విధంగా NATURE అనే పదంలో ప్రతి అక్షరాన్ని తదుపరి అక్షరంగా రాస్తే సమాధానం OBUVSF అవుతుంది.

16	21	2	12	9	3		14	1	20	21	18	5
P	U	B	L	I	C		N	A	T	U	R	E
+1	+1	+1	+1	+1	+1	అదేవిధంగా	+1	+1	+1	+1	+1	+1
Q	V	C	M	J	D		O	B	U	V	S	F
17	22	3	13	10	4		15	2	21	22	19	6

గా రాస్తారు
పై సంఖ్యలు, కింది సంఖ్యలను గమనిస్తే +1 అని తెలుస్తోంది.

I. (బి) చివరి నుంచి మొదటకు

ఉదా: ఒక సంకేత భాషలో GENIUSను TVJOFHగా రాశారు. అదే సంకేత భాషలో MOBILEను ఏవిధంగా రాస్తారు?
ఎ) FJMCNP బి) MFCJNP సి) FMJCPN డి) JCMFNP

సమాధానం: (సి)

వివరణ: GENIUSను TVJOFHగా రాయడం అనగా GENIUS అనే పదంలో చివరి నుంచి అనగా S నుంచి G వరకు గల అక్షరాలను +1 అక్షరాలుగా అనగా తదుపరి అక్షరాలుగా రాశారు. GENIUSలో చివరి అక్షరం S నుంచి పరిశీలిస్తే Sకు తదుపరి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ముంచుకొస్తున్న మంచు రహిత స్థితి
ప్రమాదంలో భూగోళం

భూమికి ఉన్న రెండు ధ్రువాల్లో మంచు ఫలకాలతోపాటు అతిశీతల వాతావరణం ఉంటుంది. భూమిపై ఉన్న మంచినీటిలో 70 శాతం వరకు ఈ ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని పోలార్ ఐస్ క్యాప్ ప్రాంతాల్లో మంచు ఫలకాలుగా గడ్డకట్టి ఉంది. ఇంత భారీస్థాయిలో పేరుకొని ఉన్న ఈ మంచు, ప్రపంచ పర్యావరణం సమతౌల్య స్థితిలో ఉండడానికి కారణమౌతోంది. నిర్దిష్టంగా పరిశీలిస్తే ఒక్కో ధ్రువ భాగం ఒక్కో రీతిలో తమ ప్రభావాన్ని విలక్షణంగా భూమిపై చూపుతుంటాయి. ఇదంతా ఇరు మంచు ధ్రువాలు తమదైన సహజ స్థితిలో ఉన్నప్పటి మాట. కానీ నేడు మానవ కార్యకలాపాల వల్ల భూతాపం పెరిగి ఉత్తర, దక్షిణ ధ్రువాల్లోని మంచు వేగంగా కరిగిపోతోంది. ఈ కారణంగా అనేక పర్యావరణ సమస్యలతో పాటు అంతిమంగా భూమిపై జీవరాశి మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి గోచరిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్కిటిక్(ఉత్తర), అంటార్కిటిక్(దక్షిణ) ధ్రువాలు తమదైన రీతిలో భూ వాతావరణం, పర్యావరణాలకు ఏవిధంగా సహకరిస్తున్నాయి? భూతాపం పెరగడం వల్ల అవి ఏవిధంగా విపరిణామాలను సంధించబోతున్నాయి? పరిస్థితిని తక్షణమే చక్కబరచేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏవి? వంటి అంశాల కోణంలో ఒక అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరం ఉంది.

- ప్రపంచ జనాభాలో దాదాపు 90 శాతం మంది ఉత్తరార్థ గోళంలోని దేశాల్లో జీవిస్తున్నారు. అందువల్ల ఈ ప్రాంతంలోని దేశాలపై ఉత్తర ధ్రువ ప్రాంతంలోని ఆర్కిటిక్ మంచు మహాసముద్ర ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దక్షిణార్థ ధ్రువంలోని అంటార్కిటికా మంచు ఖండం వలె కాక ఆర్కిటిక్ ప్రాంతపు స్నో క్యాప్ అనేది సముద్రంపై తేలియాడే మంచు ఫలకాల రూపంలో ఉంటుంది. కాబట్టి ఈ ప్రాంతంలో అంటార్కిటికాతో పోలిస్తే జీవరాశి మనుగడ ఎక్కువ. ఈ మంచు ఫలకాలు అతిశీతల ఉపరితల గాలులను కింద ఉన్న వెచ్చటి సముద్ర జలాలకు చేరకుండా అడ్డుకోవడం వల్ల అక్కడ భారీస్థాయిలో జలచరాలు జీవించగల్గుతున్నాయి. నార్వే, డెన్మార్క్, కెనడా, అమెరికా, రష్యా వంటి తీర దేశాలు ఈ ప్రాంతపు మత్స్య సంపదపై భారీగా ఆధారపడి ఉన్నాయి. ప్రపంచ మత్స్య సంపదలో దాదాపు 10 శాతం ఈ ప్రాంతంలోనే ఉందని అంచనా! అంతేకాక ఈ ఉత్తర ధ్రువ ప్రాంతపు జెట్‌స్ట్రీమ్స్ ఉత్తర అమెరికా, పశ్చిమ యురోపియన్ దేశాల వాతావరణం, వర్షపాతంపై విశేష ప్రభావాన్ని చూపుతాయి. అదేవిధంగా దక్షిణ ధ్రువ ప్రాంతపు జెట్‌స్ట్రీమ్స్ ప్రభావం కూడా ఉత్తరార్థ గోళంపై విశేషంగా ఉంటుంది. ముఖ్యంగా భారతదేశానికి వర్షపాతం అందించే రుతుపవన వ్యవస్థ రూపుకట్టడంలో ఈ జెట్‌స్ట్రీమ్స్ పాత్ర కీలకం. ఉత్తరార్థగోళంలోని మధ్య అక్షాంశ ప్రాంతాల్లో వాతావరణ సమతౌల్యానికి హీట్‌వేవ్స్‌ను అడ్డుకోవడంలో ఆర్కిటిక్ ప్రాంత శీతల గాలులు సహకరిస్తాయి.

'కొలరాడో' పరిశోధనల్లో దిగ్భ్రాంతికర విషయాలు

- ఇటీవల కొలరాడో విశ్వవిద్యాలయ పరిశోధకులు ఆర్కిటిక్ ప్రాంతంలో దశాబ్దాలుగా చేపట్టిన పరిశోధనల నివేదిక ఆ ప్రాంతంలో మార్పులపై దిగ్భ్రాంతికర అంశాలు వెల్లడించింది. 2050 నాటికి ఆర్కిటిక్ మహాసముద్రంలో ఒక నెలపాటు వేసవికాలంలో సముద్ర జలాలపై మంచు కనుమరుగైపోనుందని ఈ నివేదిక తెలిపింది. ఆర్కిటిక్ సముద్రంలో తేలియాడే సముద్రపు మంచు ఒక చదరపు కిలోమీటరు విస్తీర్ణం కంటే తక్కువగా ఉంటే దాన్ని 'మంచు రహితం(ఐస్ ఫ్రీ కండిషన్)'గా పరిశోధకులు చెబుతారు. అదేవిధంగా ఈ పరిస్థితి, ఈ శతాబ్దం చివరి నాటికి కొన్ని నెలలపాటు ఏర్పడవచ్చని భావిస్తున్నారు. దీనికి కారణం ఆర్కిటిక్ ధ్రువ ప్రాంతంలోని సముద్ర జలాలు మిగతా భూగోళం కన్నా మూడు రెట్లు ఎక్కువగా వేడెక్కుతుండడం వల్ల మంచు వేగంగా కరిగిపోవడమేనని పరిశోధకులు చెబుతున్నారు.
- 1979తో పోలిస్తే గత ఏడాది సెప్టెంబరులో ఆర్కిటిక్ సముద్రంలో 2.6 మిలియన్ చదరపు కిలోమీటర్ల మేర సముద్ర మంచు విస్తీర్ణం తగ్గిందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితులు ఆ ప్రాంతంలో జీవించే మంచు ఎలుగుబంట్లు, వాల్‌రస్, రెయిన్ డీర్స్ వంటి జీవుల ఆహార వేట, సంతానోత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతాయి.
- ధ్రువ ప్రాంతాల్లో మంచుతో కప్పిన నేల(పెర్మా ఫ్రాస్ట్) కింద బందీ అయిన మీథేన్ వాయువు, మంచు కరిగిపోవడం వలన భారీస్థాయిలో వాతావరణంలోకి విడుదలవుతుంది. దీనివల్ల ప్రపంచ భూతాపం మరింత పెరిగి విపత్కర పరిస్థితులకు దారి తీస్తుంది. కార్చిచ్చులు విజృంభిస్తాయి. వర్షాభావ పరిస్థితులు, కరవులు వంటి వాతావరణ విపత్తులు ప్రపంచ దేశాలను చుట్టుముడతాయి. సముద్ర ఉష్ణోగ్రతలను అదుపు చేసే ఆర్కిటిక్ శీతల వాతావరణం గాడి తప్పడం వల్ల సముద్ర ప్రవాహాలు వేడెక్కి అలల ఉద్ధృతి పెరిగి తీర ప్రాంతాలు భారీగా కోతకు గురవుతాయి. సముద్రాల ఉష్ణోగ్రతలు పెరిగి జలచరాలు మరణిస్తాయి. దీనితో సముద్ర పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. మత్స్య సంపద తగ్గిపోయి వాటిపై ఆధారపడే దేశాలు, ప్రజలు ఆర్థిక, ఆహార సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.
- మంచు భారీ స్థాయిలో కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరిగి తీరప్రాంత నగరాలు, దీవుల దేశాలు మునిగిపోతాయి. వేసవిలో తెల్లని ఆర్కిటిక్ మంచు కరగిపోతే దాని కింద ఉన్న నల్లని సముద్ర జలాలు నల్లని దుస్తుల మాదిరిగా సూర్యకాంతిని శోషించుకోవడం వల్ల భూ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మంచు పేరుకుంటే అది భూమి/నీటి కంటే ఎక్కువ స్థాయిలో సూర్యకాంతిని పరావర్తనం చెందించడం(ఆల్బిడో) వల్ల ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ప్రపంచ ఉష్ణోగ్రతల ప్రభావం కారణంగా దక్షిణార్థ గోళం(అంటార్కిటికా ప్రాంతం)లో కూడా మార్పులు సంభవిస్తున్నాయి. నిజానికి ఈ ప్రాంతంలో భూప్రాంతం తక్కువ. సముద్ర పరివేష్టితం ఎక్కువ. అయినప్పటికీ ఉత్తరార్థ గోళంలో మితిమీరి పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, శిలాజ ఇంధన ఉద్గారాలు వంటివి దక్షిణార్థ గోళంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో భారీస్థాయిలో దక్షిణ ధ్రువంలో ఘనస్థితిలో మేటవేసి ఉన్న భారీ హిమఖండంలో ఏ మాత్రం మార్పులు వచ్చినా సముద్ర మట్టాలు భారీగా పెరుగుతాయి. దీనితో ప్రపంచదేశాల తీరప్రాంతాలన్నింటిపై ప్రభావం పడుతుంది. మడ అడవుల వంటి తీరప్రాంతాల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల తుఫానుల తీవ్రత, సంభావ్యత పెరుగుతుంది. పంటల నష్టం, రుతుపవనాలు గాడి తప్పడం, ఆహార సంక్షోభం ఏర్పడతాయి.



అక్కడ ఖనిజాల వెలికితీత ప్రమాదం

- ఆర్కిటిక్ ప్రాంతంలో సముద్ర మంచు కరగడం అంటే సముద్ర యానానికి సౌలభ్యం కలగడమే. ఈ ప్రాంతంలో భారీస్థాయిలో ఇంధన, ఖనిజ నిక్షేపాలు ఉండడం వల్ల అమెరికా, చైనా వంటి అగ్ర రాజ్యాల కన్ను ఇప్పటికే అక్కడ ఉంది. ఈ ఆర్కిటిక్ ప్రాంత సముద్రమార్గాలను సైతం చైనా, అమెరికా వ్యూహాత్మకంగా అభివృద్ధి పరచుకుంటున్నాయి. కొన్ని నెలలపాటు ఈ ప్రాంతాల్లో మంచు రహిత స్థితి కొనసాగడమంటే అక్కడి ఖనిజాల దోపిడీకి అగ్రరాజ్యాలకు దారివ్వడమే. ఆర్కిటిక్ పరివేష్టిత దేశాలన్నీ ఈ సరిహద్దు ఉద్రిక్తతల్లో భాగమవుతాయనడంలో సందేశం లేదు. ఖనిజాల వెలికితీత ప్రక్రియ ఆర్కిటిక్ ఆవరణ వ్యవస్థపై మరింత దుష్ప్రభావం చూపి ప్రపంచ పర్యావరణాన్ని తీవ్రంగా నష్టపరుస్తుంది. ఇది క్రమంగా మానవాళి మనుగడనే సందేహాస్పదం చేస్తుంది.
- 1800 నాటితో పోలిస్తే భూ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌లకు కట్టడి చేయాలనీ లేదా కనీసం ఆ పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్‌ల లోపే ఉండేలా చూడాలని పారిస్ ఒప్పందం నిర్దేశిస్తోంది. కానీ ఆ 1800 నాటితో పోలిస్తే ఆర్కిటిక్ ప్రాంత ఉష్ణోగ్రతలో ఇప్పటికే 2 డిగ్రీల సెల్సియస్ పెరుగుదల కనిపిస్తోందని పరిశోధకులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితి అత్యవసర దిద్దుబాటు చర్యల కోసం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది.
- ఉపగ్రహ అంచనాల ప్రకారం ఏటా ఆర్కిటిక్ ప్రాంతంలో 13 శాతం చొప్పున మంచు కరగిపోతోంది. దీనికి 90 శాతం కారణం మానవ చర్యలే. శిలాజ ఇంధన వాడకం, పరిశ్రమల ఉద్గారాలను తగ్గించే దిశగా పారిస్ ఒప్పందం, సీఓపీ-28 తీర్మానాలను నిబద్ధతతో ప్రపంచ దేశాలన్నీ ముఖ్యంగా పారిశ్రామిక దేశాలు అమలుపరచాలి. ఆర్కిటిక్ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు, ఖనిజాన్వేషణ ప్రయత్నాలను నిషేధిస్తూ పటిష్ఠ ఒప్పందాలు రావాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఆర్కిటిక్ సముద్ర తీర దేశాలు మధ్య ఆర్కిటిక్ ప్రాంత భౌగోళిక సున్నితత్వం దృష్ట్యా జలచరాల వేటను, ఫిషింగ్ కార్యకలాపాలను ఆ ప్రాంతంలో నిషేధిస్తూ ఒక ఒప్పందానికి వచ్చాయి. ఇటువంటి ఒప్పందాలు ఉష్ణోగ్రతల కట్టడి విషయంలో కూడా రావాల్సి ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

స్పోర్ట్స్

కోహ్లి వచ్చేశాడు..



ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి స్వదేశంలో అడుగు పెట్టాడు. అతడి భార్య అనుష్క రెండో ప్రసవం కోసం ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ నుంచి వైదొలిగిన కోహ్లి కొంతకాలంగా లండన్‌లోనే ఉంటున్న విషయం తెలిసిందే. ఈనెల 22 నుంచి ఐపీఎల్ ఆరంభం కానుండడంతో ఆదివారం అతను లండన్ నుంచి ముంబై విమానాశ్రయంలో దిగాడు. ఈ మేరకు ఓ వీడియోను స్టార్‌స్పోర్ట్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. విరాట్ త్వరలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు శిబిరంలో చేరే అవకాశం ఉంది.

ట్రయల్స్‌లో ధీరజ్ టాప్



సోనెపట్: ప్రపంచకప్, పారిస్ ఒలింపిక్స్ కోసం నిర్వహించిన ఆర్చరీ సెలెక్షన్ ట్రయల్స్‌లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ అదరగొట్టాడు. భారత్‌కు ఇప్పటికే ఒక ఒలింపిక్ కోటా అందించిన ధీరజ్.. ఆదివారం ఇక్కడ జరిగిన ట్రయల్స్‌లో పురుషుల రికర్వ్ విభాగంలో అగ్రస్థానంలో నిలిచాడు. టీమ్ ఈవెంట్‌లో ధీరజ్‌తో పాటు తరుణ్‌దీప్, ప్రవీణ్, మృణాల్ సత్తాచాటారు. ఇక, మహిళల రికర్వ్ విభాగంలో దీపికా కుమారి టాప్‌లో నిలవగా.. భజన్ కౌర్, అంకిత, కోమలిక టీమ్ ఈవెంట్‌లో రాణించారు. నాన్ ఒలింపిక్ కేటగిరి అయిన కాంపౌండ్ విభాగం నుంచి తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకుంది. ఈ ఏడాది వరల్డ్ కప్‌లో భాగంగా స్టేజ్-1 పోటీలు ఏప్రిల్ 21 నుంచి షాంఘై (చైనా)లో, స్టేజ్-2 ఈవెంట్ మే 21 ఇంచియాన్ (దక్షిణ కొరియా), స్టేజ్-3 పోటీలు జూన్ 18 నుంచి అంటాల్యా (టర్కీ)లో జరుగుతాయి. ట్రయల్స్‌లో సత్తా చాటిన ఆర్చర్లనే ఈ వరల్డ్ కప్ పోటీలకు ఎంపిక చేశారు.

ఎలిమినేటర్‌లో ఢిల్లీ X అహ్మదాబాద్

చెన్నై: అహ్మదాబాద్ డిఫెండర్స్, ఢిల్లీ తుఫాన్స్ జట్లు ప్రైమ్ వాలీబాల్ లీగ్ ఎలిమినేటర్‌లో ప్రవేశించాయి. ఆదివారం జరిగిన ఈ సీజన్ ఆఖరి సూపర్-5 మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టు 3-2తో కాలికట్ హీరోస్‌పై విజయం సాధించింది. అంతకుముందు జరిగిన నామమాత్రమైన సూపర్-5 మ్యాచ్‌లో ముంబై మీటియర్స్ 3-1తో ఢిల్లీ తుఫాన్స్‌పై నెగ్గింది. కాగా, ఎలిమినేటర్‌లో నెగ్గిన జట్టు.. ఇప్పటికే ఫైనల్ చేరిన కాలికట్ హీరోస్‌తో ట్రోఫీ కోసం తలపడనుంది. ఈనెల 19న ఎలిమినేటర్, 21న ఫైనల్ జరగనుంది.

ఈ సాలా కప్ నమ్దే.. అంటూ ఐపీఎల్ ఆరంభం నుంచి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అభిమానులు ట్రోఫీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎలాగైతేనేం.. ఇన్నాళ్లకు వారి కల తమ మహిళల జట్టుతో నెరవేరింది. ఫైనల్ ఒత్తిడిని తట్టుకుంటూ స్పిన్నర్లు శ్రేయాంక, మొలినెక్స్, ఆశా ఢిల్లీ బ్యాటర్లను కూల్చేయగా.. స్వల్ప ఛేదనలో ఆల్‌రౌండర్ ఎలిస్ పెర్రీ మరోసారి ఆపద్బాంధవ పాత్ర పోషించిన వేళ.. ఆర్సీబీ ఖాతాలో డబ్ల్యూపీఎల్ టైటిల్ చేరింది.



మహిళల ప్రీమియర్ లీగ్

ఆర్సీబీదే అందలం

బెంగళూరుకు తొలి టైటిల్

ఫైనల్లో ఢిల్లీపై విజయం

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో నయా చాంపియన్. ఆదివారం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. దీంతో డబ్ల్యూపీఎల్‌లో తొలిసారి ఆర్సీబీ విజేతగా నిలిచింది. ఐపీఎల్‌లో ఇప్పటిదాకా టైటిల్ కల నెరవేరని ఈ ఫ్రాంచైజీకి మంధాన సేన ఆ కొరతను తీర్చింది. స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్ (4/12), మొలినెక్స్ (3/20), ఆశా శోభన (2/14) కలిసి ఢిల్లీ 9 వికెట్లు తీయడం విశేషం. కాగా, ఢిల్లీ వరుసగా రెండోసారీ రన్నరప్‌కే పరిమిత వడం గమనార్హం. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 18.3 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటైంది. షఫాలీ (44), లానింగ్ (23) మినహా అంతా విఫలమయ్యారు. ఏడుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఛేదనలో ఆర్సీబీ 19.3 ఓవర్లలో 2 వికెట్లకు 115 రన్స్ చేసి నెగ్గింది. ఎలిస్ పెర్రీ (35 నాటౌట్), సోఫీ డివైన్ (32), కెప్టెన్ మంధాన (31) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మొలినెక్స్ నిలిచింది.

ఆఖరి ఓవర్‌లో ముగించారు: ఛేదించాల్సింది స్వల్ప లక్ష్యమే అయినా ఆర్సీబీ పోరు ఆఖరి ఓవర్ వరకు సాగింది. దీనికి ఢిల్లీ కట్టుదిట్టమైన బౌలింగే కారణం. అయితే పెర్రీ ఒత్తిడిని అధిగమిస్తూ జట్టును విజయతీరాలకు చేర్చింది. ఓపెనర్లు మంధాన, డివైన్‌లకు ఆరంభంలో పరుగులు సాధించడమే కష్టంగా మారింది. వికెట్ పడకూడదనే కారణంతో డిఫెన్సివ్ ఆటతీరును కనబర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 25 పరుగులే చేసింది. అయితే ఏడో ఓవర్‌లో డివైన్ 4,4,6,4 బాదడంతో 18 రన్స్ వచ్చాయి. కాసేపటికే డివైన్‌ను శిఖా అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే మంధాన 15వ ఓవర్ వరకు క్రీజులో ఉన్నా మెరుపులు కనిపించలేదు. చివరకు గెలిపించే బాధ్యతను పెర్రీ తీసుకోగా, ఆమెకు మరో ఎండ్‌లో రిచా ఘోష్ (17 నాటౌట్) సహకరించింది. అయితే బంతికో పరుగు చొప్పున లక్ష్యం ఉండడంతో ఇరు జట్ల శిబిరాల్లో ఒత్తిడి నెలకొంది. 18, 19వ ఓవర్లలో పెర్రీ ఒక్కో ఫోర్ సాధించడంతో సమీకరణం చివరి ఓవర్‌లో ఐదు పరుగులకు మారింది. ఇందులో తొలి రెండు బంతులకు రెండు పరుగులు రాగా.. మూడో బంతిని రిచా ఫోర్‌గా మలచడంతో ఆర్సీబీ సంబరాలు ఆకాశాన్నంటాయి.

ప్రైజ్‌మనీ	
ఆర్సీబీకి	రూ. 6 కోట్లు
ఢిల్లీకి	రూ. 3 కోట్లు

ఆరెంజ్ క్యాప్ (అత్యధిక రన్స్)
ఎలిస్ పెర్రీ (347)

పర్పుల్ క్యాప్ (అత్యధిక వికెట్లు)
శ్రేయాంక పాటిల్ (13)

స్పిన్ ధాటికి విలవిల: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్ ఆరంభానికి ముగింపునకు సంబంధమే లేకుండా సాగింది. తొలి వికెట్‌కు ఓపెనర్లు షఫాలీ, లానింగ్ 64 రన్స్ సమకూరిస్తే.. బెంగళూరు స్పిన్నర్ల ప్రతాపానికి విగతా 49 పరుగుల్లోనే జట్టు మొత్తం కుప్పకూలింది. కానీ మొదట్లో షఫాలీ ఎదురుదాడికి ఓవర్‌కు పది పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లిన ఢిల్లీ పవర్‌ప్లేలోనే 61 రన్స్ సాధించింది. మూడో ఓవర్‌లో షఫాలీ సిక్సర్, లానింగ్ 2 ఫోర్లతో 19 రన్స్ సమకూరాయి. తర్వాత పెర్రీ ఓవర్‌లోనూ షఫాలీ 6,4తో ఆకట్టుకుంది. అయితే ఎనిమిదో ఓవర్‌లో మొలినెక్స్ 3 వికెట్లతో ఢిల్లీని చావుదెబ్బ తీసింది. తొలి బంతికే షఫాలీ, మూడు, నాలుగు బంతులకు జెమీమా (0), క్యాప్సీ (0) వెనుదిరిగారు. కుదురుకున్న లానింగ్‌ను శ్రేయాంక ఎల్బీ చేయడంతో భారీస్కోరుపై ఢిల్లీ ఆశలు వదులుకుంది. అటు టెయిలెండర్లను శ్రేయాంక చకచకా పెవిలియన్‌కు చేర్చడంతో తొమ్మిది బంతులుండగానే ఢిల్లీ ఆట ముగిసింది.

స్కోరుబోర్డు

ఢిల్లీ: లానింగ్ (ఎల్బీ) శ్రేయాంక 23, షఫాలీ (సి) వేర్హమ్ (బి) మొలినెక్స్ 44, జెమీమా (బి) మొలినెక్స్ 0, క్యాప్సీ (బి) మొలినెక్స్ 0, కాప్ (సి) డివైన్ (బి) శోభన 8, జొనాసెన్ (సి) మంధాన (బి) శోభన 3, రాధ (రనౌట్) 12, మిన్నూ మణి (ఎల్బీ) శ్రేయాంక 5, అరుంధతి (బి) శ్రేయాంక 10, శిఖా పాండే (నాటౌట్) 5, తానియా (సి) రిచా (బి) శ్రేయాంక 0, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 18.3 ఓవర్లలో 113 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-64, 2-64, 3-64, 4-74, 5-80, 6-81, 7-87, 8-101, 9-113, 10-113; **బౌలింగ్:** రేణుక 2-0-28-0, మొలినెక్స్ 4-0-20-3, పెర్రీ 2-0-14-0, డివైన్ 1-0-9-0, వేర్హమ్ 3-0-16-0, శ్రేయాంక 3.3-0-12-4, శోభన 3-0-14-2.

బెంగళూరు: స్మృతి మంధాన (సి) అరుంధతి (బి) మిన్ను 31, సోఫీ డివైన్ (ఎల్బీ) శిఖా పాండే 32, ఎలిస్ పెర్రీ (నాటౌట్) 35, రిచా ఘోష్ (నాటౌట్) 17; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 19.3 ఓవర్లలో 115/2; వికెట్ల పతనం:** 1-49, 2-82; **బౌలింగ్:** కాప్ 4-0-20-0, క్యాప్సీ 3-0-13-0, శిఖా పాండే 4-0-11-1, రాధా యాదవ్ 1-0-18-0, అరుంధతి 3.3-0-26-0, జొనాసెన్ 2-0-15-0, మిన్నూ మణి 2-0-12-1.

రన్నరప్ రష్మిక

వరల్డ్ టెన్నిస్ టూర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ఇండోర్‌లో జరిగిన ఫైనల్లో రష్మిక 3-6, 2-6తో దలీలా జాకుపోవిక్ (స్లోవేనియా) చేతిలో ఓడింది. శనివారం డబుల్స్ పోటీల్లో విజేతగా నిలిచిన రష్మిక ఆ తర్వాత అస్వస్థత కారణంగా రాత్రంతా ఆస్పత్రిలోనే ఉంది. ఆరోగ్యం సహకరించకపోయినా ఫైనల్ బరిలోకి దిగింది. కోర్టులో రష్మిక చురుగ్గా ఆడలేకపోయినా, ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వకుండా ఆడింది.

ఇంజెక్షన్లు తీసుకుని ఆడదామనుకున్నా..



న్యూఢిల్లీ: గతేడాది స్వదేశంలో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కేవలం నాలుగు మ్యాచ్‌లే ఆడాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కాలి చీలమండ గాయంతో మైదానం వీడిన తను ఇక టోర్నీలో బరిలోకి దిగలేదు. అయితే తిరిగి ఆడేందుకు తాను ఎంతగానో ప్రయత్నించినట్టు పాండ్యా వివరించాడు. 'చీలమండకి మూడు చోట్ల ఇంజెక్షన్లు వేయించుకున్నా. వాపు కారణంగా రక్తం కూడా తీయించుకున్నా. అయినా గాయం తీవ్రమైంది. కోలుకునేందుకు కనీసం 25 రోజుల విశ్రాంతి అవసరమని డాక్టర్లు చెప్పారు. అయితే పూర్తి వరల్డ్‌కప్ ఆడలేకపోయానన్న బాధ మాత్రం నన్ను తొలిచేస్తూనే ఉంది' అని పాండ్యా అన్నాడు.

గుల్వీర్ నయా రికార్డు

న్యూఢిల్లీ: ఆసియా క్రీడల కాంస్య పతక విజేత గుల్వీర్ సింగ్ 16 ఏళ్ల నాటి జాతీయ రికార్డును బద్దలుకొట్టి, చరిత్ర సృష్టించాడు. కాలిఫోర్నియాలో జరిగిన 10 వేల మీటర్ల రేసును 27 నిమిషాల 41.81 సెకన్లలో పూర్తి చేసి, రెండో స్థానంలో నిలిచాడు. గత రికార్డు సురేంద్ర సింగ్ పేరిట (28 ని, 02.89సె.) 2008లో నమోదైంది. అయితే, 27 నిమిషాల్లోపు పూర్తి చేస్తేనే అర్హత సాధించే అవకాశం ఉండడంతో గుల్వీర్ కొద్దిలో పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను చేజార్చుకున్నాడు.

ఊహాగానాలకు తెర

జట్టులో చేరిన శ్రేయాస్



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ జట్టులో చేరాడు. దాంతో.. వెన్ను సంబంధిత ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న అతడు ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం నగరానికి చేరుకున్న అయ్యర్..ఆదివారం జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. వెన్ను శస్త్రచికిత్స కారణంగా అయ్యర్ గతేడాది ఐపీఎల్‌లో ఆడలేదు. మరోవైపు ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో చేరాడు. 30 ఏళ్ల హెడ్ ఆరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్‌లో ఆడనున్నాడు.

ఆల్ ఇంగ్లండ్ విజేత మారిన్

బర్మింగ్‌హామ్: ఒలింపిక్ మాజీ చాంపియన్, వరల్డ్ నెం:5 కరోలినా మారిన్ (స్పెయిన్) మరోసారి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో మారిన్ 26-24, 11-1తో ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి, నాలుగో సీడ్ అకానె యమగూచి (జపాన్) రిటైరైంది. 2015లో తొలిసారి ఆల్ ఇంగ్లండ్ టైటిల్‌ను ముద్దాడిన మారిన్.. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ విజేతగా నిలిచింది. మలేసియా షట్లర్ల మధ్య జరిగిన తుది పోరులో జొనాథన్ క్రిస్టీ 21-15, 21-14తో ఐదో సీడ్ ఆంథోనీ సునిసుకాపై నెగ్గి పురుషుల సింగిల్స్ ట్రోఫీ అందుకున్నాడు.

బిజినెస్

21,750 దిగువన బేరిష్

(మార్చి 18-22 తేదీల మధ్య వారాని



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,527-21,917 పాయింట్ల మధ్యన కదలాడి 213 పాయింట్ల నష్టంతో 22,023 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21,750 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,869, 21,787, 20,502, 20,088 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,425 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,625
నిరోధ స్థాయిలు: 22,225, 22,325, 22,425 (22,125 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,825, 21,725, 21,625 (21,925 దిగువన బేరిష్)

జోష్‌లో భారత వృద్ధి రేటు



పెట్టుబడులే ప్రధాన ఊతం.. మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి రేటుపై ప్రముఖ అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ప్రశంసల వర్షం కురిపించింది. ఈ వృద్ధి రేటు 2003-2007 మధ్య కాలంలో నమోదైన 8 శాతానికి పైగా వృద్ధి రేటును తలపిస్తోందని తెలిపింది. పెట్టుబడులే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. కొవిడ్‌తో ప్రైవేటు పెట్టుబడులు, వినియోగం నీరసించినా ప్రభుత్వ పెట్టుబడులు ఆర్థిక వ్యవస్థకు ఊతంగా నిలిచాయని పేర్కొంది. ప్రస్తుతం ప్రైవేటు పెట్టుబడులు కూడా ఊపందుకుంటున్నట్టు తెలిపింది. పట్టణ డిమాండ్‌తో పాటు ప్రస్తుతం గ్రామీణ డిమాండ్ కూడా ఊపందుకుంటున్నందున భారత జీడీపీ వృద్ధి రేటుకు ఢోకా ఉండదని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

పెరుగుతున్న పెట్టుబడులు: భారత్‌లో పెరుగుతున్న పెట్టుబడుల నిష్పత్తిని మోర్గాన్ స్టాన్లీ గుర్తు చేసింది. 2002-03లో జీడీపీలో 27 శాతంగా ఉన్న పెట్టుబడుల నిష్పత్తి 2007-08 నాటికి 39 శాతానికి పెరిగిన విషయాన్ని గుర్తు చేసింది. 2008 తర్వాత పెట్టుబడుల జోరు కొద్దిగా తగ్గినా ప్రస్తుతం, జీడీపీలో పెట్టుబడుల వాటా 34 శాతానికి పెరిగాయని పేర్కొంది. 2026-27 నాటికి ఇది మరింత పెరిగి 36 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. 2003-2008 మధ్య కాలంలో జీడీపీలో పొదుపు రేటూ 28 శాతం నుంచి 39 శాతానికి పెరిగినట్టు తెలిపింది. పెట్టుబడులు, ప్రభుత్వ ప్రోత్సాహంతో జీడీపీలో కంపెనీల లాభాల నిష్పత్తి 2020-23 మధ్య కాలంలో 1.1 శాతం నుంచి 5.4 శాతానికి పెరిగిన విషయాన్ని మోర్గాన్ స్టాన్లీ గుర్తు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ		విజయవాడ	420
హైదరాబాద్	405	విశాఖపట్నం	425
18వ తేదీ		వరంగల్	407
చిత్తూరు	463		
గోదావరి	420	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	105
విశాఖపట్నం	103		

భారత్‌లో పెట్టుబడులపై స్విస్ కంపెనీల ఆసక్తి

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌కు చెందిన అనేక కంపెనీలు భారత్‌లో పెట్టుబడుల పట్ల ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. వాటిలో చాక్లెట్ల తయారీలోని బారీ కాలిబాట్ గ్రూప్‌తో పాటు వ్యవసాయ టెక్నాలజీ గ్రూప్ బూహ్లర్ వంటివి ఉన్నాయి. హెస్ గ్రీన్ మొబిలిటీ కంపెనీ 2025 నాటికి దేశంలో 11 కోట్ల డాలర్ల పెట్టుబడితో 3,000 విద్యుత్ బస్సుల తయారీ లక్ష్యంగా పెట్టుకున్నదని స్విస్ ఆర్థిక వ్యవహారాల మంత్రి హెలెన్ బుడ్లిగర్ చెప్పారు. బారీ కాలిబాట్ దేశంలో మూడో చాక్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గత ఐదేళ్లలో ఈ కంపెనీ 5 కోట్ల డాలర్లకు పైగా ఇన్వెస్ట్ చేసిందని వెల్లడించారు. దేశంలో ప్రవేశించి 30వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్న బూహ్లర్ గ్రూప్ 2.3 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్టు తెలిపారు. ఇవికాకుండా ఇంకా ఎన్నో స్విస్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

అదానీ గ్రూప్ పెట్టుబడుల జోరు

2024-25లో రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పెట్టుబడుల జోరు పెంచుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో అదానీ గ్రూప్ కంపెనీలు వివిధ రంగాల్లో 1,400 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.2 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 40 శాతం ఎక్కువ. కొత్త పెట్టుబడుల్లో 70 శాతం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో, మిగతా 30 శాతం విమానాశ్రయాలు, ఓడరేవుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెడతారని భావిస్తున్నారు.

రూ.41,000 కోట్లు తగ్గిన ఫ్లిప్‌కార్ట్ వాల్యుయేషన్

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం 'ఫ్లిప్‌కార్ట్' విలువ గత రెండేళ్లలో 500 కోట్ల డాలర్లు (సుమారు రూ.41,000 కోట్లు) తుడిచి పెట్టుకుపోయింది. ఫ్లిప్‌కార్ట్ మాతృ సంస్థ 'వాల్‌మార్ట్' ఈ విషయం తెలిపింది. 2022 జనవరి 31 నాటికి 4,000 కోట్ల డాలర్లు ఉన్న ఫ్లిప్‌కార్ట్ విలువ ఈ ఏడాది జనవరి నెలాఖరు నాటికి 3,500 కోట్ల డాలర్లకు పడిపోయినట్టు వెల్లడించింది. ఫిన్‌టెక్ కంపెనీ 'ఫోన్‌పే'ను ఫ్లిప్‌కార్ట్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడదీయడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. అయితే ఫ్లిప్‌కార్ట్ వర్గాలు మాత్రం కంపెనీ విలువ ఇప్పటికీ 3,800 కోట్ల డాలర్ల నుంచి 4,000 కోట్ల డాలర్ల మధ్య ఉంటుందని తెలిపాయి. 2022 ఆర్థిక సంవత్సరంలో వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ ఈక్విటీలో 8 శాతం వాటాను 320 కోట్ల డాలర్లకు విక్రయించింది. ఈ లెక్క ప్రకారం చూసినా ఫ్లిప్‌కార్ట్ విలువ 4,000 కోట్ల డాలర్లకు చేరువలో ఉంటుందని పేర్కొన్నాయి.

బీమా పాలసీల మోసపూరిత అమ్మకాలు ఆపండి

పీఎస్‌బీలకు ఆర్థిక సర్వీసుల శాఖ సూచన

న్యూఢిల్లీ: బీమా పాలసీల మోసపూరిత అమ్మకాలను నిలువరించి ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడాలని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)కు ఆర్థిక శాఖ సూచించింది. ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి వివేక్ జోషీ ఈ విషయం చెబుతూ బీమా పాలసీల విక్రయంలో మోసపూరిత, అనైతిక విధానాలు అనుసరిస్తున్నారన్న ఫిర్యాదులు తమకు నిరంతరం అందుతూనే ఉన్న నేపథ్యంలో బ్యాంకులకు ఈ సూచన చేసినట్టు తెలిపారు. బ్యాంకు కస్టమర్ల నుంచి పాలసీలు చేయించడం కోసం జీవిత బీమా కంపెనీలు, బ్యాంకులు కూడా ఈ తరహా విధానాలు అనుసరిస్తున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని ఆయన అన్నారు. కస్టమర్లు ఏదైనా రుణం తీసుకునేందుకు, టర్మ్ డిపాజిట్ చేసేందుకు బ్యాంకుకు వెళ్లిన సమయంలో వారికి పాలసీలు అంటగడుతూ ఉంటారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 75 సంవత్సరాల వయసు పైబడిన కస్టమర్లకు కూడా జీవిత బీమా పాలసీలు అంటగట్టిన సందర్భాలున్నాయని తేలింది. పాలసీ తీసుకునే విషయంలో కస్టమర్లు ప్రతిఘటించినా తమకు పై నుంచి ఒత్తిడులు వస్తున్నట్టు బ్యాంకు అధికారులు చెబుతున్న విషయం కూడా వెలుగులోకి వచ్చింది. ఇలాంటి ధోరణులపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) అభ్యంతరం ప్రకటించింది. బీమా ఉత్పత్తులు విక్రయించినందుకు ప్రోత్సాహకాలివ్వడం వల్ల బ్యాంక్ సిబ్బందిపై ఒత్తిడి పెరగడంతో పాటు ప్రధాన వ్యాపార లక్ష్యం దెబ్బ తింటుందని వ్యాఖ్యానించింది.

టెక్ వ్యూ

22,000 పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 22,500 వద్ద కరెక్షన్‌లో ప్రారంభమై కీలక స్థాయి 22,000 వరకు దిగజారి వారం మొత్తం మీద 470 పాయింట్ల నష్టంతో అదే స్థాయికి సమీపంలో ముగిసింది. నిఫ్టీ ఈ మద్దతు స్థాయి కన్నా పైన ముగిసినప్పటికీ సానుకూలత కోసం మార్కెట్ ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఈ కారణంగా స్వల్పకాలిక దిశకు ఈ వారం కీలకం. ప్రస్తుత ర్యాలీలో భారీగా నష్టపోయిన వారం ఇదే. గత వారం మిడ్‌క్యాప్ సూచీ 2,300 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 460 పాయింట్ల నష్టంతో ముగిసింది. ప్రపంచ మార్కెట్ల తీరు ఆధారంగా ఈ వారంలో మార్కెట్ అప్రమత్తంగానే ప్రారంభం కావచ్చు. ఈ కారణంగా మానసిక అవధి 22,000 వద్ద పరీక్ష తప్పదు.

బుల్లిష్ స్థాయిలు: రికవరీ బాట పట్టినట్టయితే సానుకూలత కోసం మార్కెట్ 22,160 కన్నా పైన పటిష్ఠంగా ముగియడం తప్పనిసరి. ఆ పైన స్వల్పకాలిక నిరోధ స్థాయి 22,300. మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 22,550.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 22,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,750. ఇక్కడ కూడా విఫలమైతే ఇంకా బలహీనపడవచ్చు. స్వల్పకాలిక ప్రధాన మద్దతు స్థాయి 21,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 48,000 స్థాయిలో కరెక్షన్ సాధించి వారాంతానికి 46,600 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద 1,250 పాయింట్లు నష్టపోయింది. 48,000 వద్ద నిలదొక్కుకోలేకపోవడం మరింత అప్రమత్త ధోరణిని సూచిస్తోంది. రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 47,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 46,300 వద్ద విఫలమైతే మరింత బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 45,500.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక చలన సగటు స్థాయిల కన్నా స్వల్పంగా దిగువన ఉంది. ఇది అప్రమత్త సంకేతం. 22000 వద్ద గతంలో "డబుల్ బాటమ్ పాటర్న్" ఏర్పడింది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 22000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,100, 22,160
మద్దతు	21,950, 21,860

www.sundartrends.in

ఆటుపోట్లు తప్పవు..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం ఆటుపోట్లలో సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్ నిఫ్టీలో పుల్ బ్యాక్ ర్యాలీ కనిపిస్తున్నా మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు మాత్రం ఠారెత్తిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటం, ఆసియా, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు లేకపోవటంతో పాటు దేశీయ మార్కెట్లో నెగెటివ్ సెంటిమెంట్ ఉండటంతో సూచీలు ఒడుదుడుకుల్లో సాగే వీలుంది. మదుపరులు ఆచితూచి ఎంపిక చేసిన షేర్లను మాత్రమే కొనుగోలు చేయటం మంచిది. నష్టభయాన్ని అంచనా వేసుకుని తప్పనిసరిగా స్టాప్‌లాస్ పెట్టుకుని మాత్రమే ట్రేడింగ్ చేయాలి. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్ మద్దతు 21,900, నిరోధ స్థాయి 22,200 వద్ద ఉన్నాయి. గత వారం ఐటీ వినహా అన్ని రంగాల షేర్లు పతనమయ్యాయి.

స్టాక్ రికమండేషన్స్

హిందాల్కో: ఈ మెటల్ కంపెనీ షేరు ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉంది. భారీ పతనం తర్వాత బేస్ ఏర్పడుతోంది. చివరి రెండు సెషన్లలో ఈ షేరు భారీగా లాభపడింది. బ్రోకరేజీ సంస్థలు 'బై' రేటింగ్ ఇచ్చాయి. గత శుక్రవారం ఈ షేరు రూ.532 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.500/520 శ్రేణిలో ప్రవేశించి రూ.585 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.485 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కొచ్చిన్ షిప్‌యార్డ్: మార్కెట్లో బేరిష్ ట్రెండ్ ఉన్నప్పటికీ చివరి రెండు సెషన్లలో ఈ కౌంటర్ బలంగా పుంజుకుంది. ఏకంగా 20 శాతం మేర పెరిగింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ ఐదు రెట్లు పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు 11.53 శాతం లాభంతో రూ.897 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.880 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.850 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్గేట్ పామోలివ్: సుదీర్ఘకాలంగా ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. గత శుక్రవారం ఈ షేరు ఆల్‌టైమ్ హై రూ.2,698 స్థాయిని అధిగమించి రూ.2,728 వద్ద ముగిసింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ బాగా పెరుగుతోంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,700 స్థాయిల్లో ప్రవేశించి రూ.2,850/2,990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,645 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

నాట్కో ఫార్మా: స్వల్పకాల అప్‌ట్రెండ్ తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరుగుతోంది. ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.955 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.900/940 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రిలాక్సో ఫుట్‌వేర్: ఈ కౌంటర్‌లో చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. గత వారం ఈ షేరు నెల గరిష్ఠాన్ని అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 11 శాతం లాభంతో రూ.890 వద్ద క్లోజైంది. ఐదు రోజుల సగటును పరిశీలిస్తే వాల్యూమ్ ఏడు రెట్లు పెరిగింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.850 స్థాయిల్లో ప్రవేశించి రూ.990/1,060 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.815 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



\- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కేజ్రీవాల్‌కు మళ్లీ ఈడీ సమన్లు




న్యూఢిల్లీ, మార్చి 17: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆదివారం మళ్లీ సమన్లు ఇచ్చింది. ఈసారి రెండు వేరువేరు కేసుల్లో వరుసగా రెండు సమన్లు ఇవ్వడం గమనార్హం. పాత కేసు అయిన ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో తొమ్మిదోసారి సమన్లు ఇచ్చింది. దాంతో పాటుగా కొత్త కేసు అయిన ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ) అంశంపై మరో సమన్లు ఇచ్చింది. జల్ బోర్డు కేసులో సోమవారమే విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మద్యం విధానం కేసులో ఈ నెల 21 (గురువారం)న రావాలని పేర్కొంది. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిషి స్పందిస్తూ జల్ బోర్డు కేసు ఏమిటో ఎవరికీ తెలియదని అన్నారు. ఏదోరకంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా చూడడమే వీటి ఉద్దేశమని ఆమె ఆరోపించారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఎనిమిదిసార్లు ఈడీ సమన్లు ఇవ్వగా వాటన్నింటినీ కేజ్రీవాల్ బేఖాతరు చేశారు. తనను జైలుకు పంపించి ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ వాడుకుంటోందని ఆరోపించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో భూపేశ్ బఘేల్‌పై కేసు

రాయ్‌పూర్, మార్చి 17: మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్‌పై రాష్ట్ర ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) కేసు నమోదు చేసినట్టు ఆదివారం అధికార వర్గాలు తెలిపాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఏడాదికిపైగా దర్యాప్తు జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా కేసు పెట్టినట్టు తెలిపాయి. ఆయనతో పాటుగా మహాదేవ్ యాప్ ప్రమోటర్లయిన రవి ఉప్పల్, సౌరభ్ చంద్రాకర్, శుభం సోని, అనిల్ కుమార్ అగర్వాల్ మరో 14 మందిపై కూడా కేసులు నమోదు చేసింది. అక్రమ మార్గాల్లో బెట్టింగ్ యాప్ నిర్వహించడం ద్వారా రూ.6,000 కోట్ల మేర నేరపూరిత సొమ్ము చలామణి అయినట్టు పేర్కొంది. యాప్ ప్రమోటర్లలో ఇద్దరు ప్రధాన వ్యక్తులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని, వారికి రాష్ట్రానికి చెందిన కొందరు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు సహకరించారని ఆరోపించింది.

సర్‌కార్యవాహ్‌గా దత్తాత్రేయ హోసబలే



నాగ్‌పూర్, మార్చి 17: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)కు సర్‌కార్యవాహ్‌గా (ప్రధాన కార్యదర్శి) మరోసారి దత్తాత్రేయ హోసబలే ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు నాగ్‌పూర్ ప్రధాన కార్యాలయంలో 'అఖిల భారతీయ ప్రతినిధి సభ' వార్షిక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో కర్ణాటకకు చెందిన హోసబలేను మరోసారి సర్‌కార్యవాహ్‌గా ఎన్నుకున్నట్లు ఆర్ఎస్ఎస్ 'ఎక్స్' వేదికగా ఆదివారం ప్రకటించింది. హోసబలే మొదటిసారి 2021లో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. తాజా ఎన్నికతో ఆయన 2027 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2021ముందు భయ్యాజీ జోషి బాధ్యతలు నిర్వర్తించారు.

అంబానీ ఇంటి పెళ్లి వేడుకల్లో దోపిడీకి పథకం

» తిరుచ్చికి చెందిన ఐదుగురు దొంగల అరెస్టు

చెన్నై, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త అంబానీ కుమారుడి పెళ్లి వేడుకల్లో దోపిడీకి పథకం రూపొందించిన తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ఐదుగురు దోపిడీ దొంగలను గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల రాజ్‌కోట్, జామ్‌నగర్‌లో పార్కింగ్ చేసిన లగ్జరీ కార్లలో నగదు, లాప్‌టాప్‌లు తదితర విలువైన వస్తువులు దోపిడీకి గురయ్యాయి. ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో రికార్డైన వీడియో దృశ్యాల ఆధారంగా ఆ దోపిడీలకు పాల్పడిన తిరుచ్చికి చెందిన జగన్, దీపక్, గుణశేఖర్, మురళి, ఏకాంబరం అనే ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా ఈ ఐదుగురూ.. అంబానీ కుమారుడి పెళ్లి వేడుకల్లో దోపిడీకి ప్రణాళిక రూపొందించారని కనుగొన్నారు.

పంతం నీదా.. నాదా!

లోక్‌సభ ఎన్నికల్లో మోదీ గ్యారెంటీ X రాహుల్ న్యాయ్ గ్యారెంటీలు



న్యూఢిల్లీ, మార్చి 17: ఓవైపు భావోద్వేగం.. మరోవైపు భావజాలం..! అటు అభివృద్ధి వాదం.. ఇటు అసమానతలపై నిరసన నినాదం..! పాతికేళ్ల ప్రగతి ప్రయాణానికి ఒకరి పిలుపు..! పదేళ్లలో వ్యవస్థల విధ్వంసం మాటేమిటంటూ ప్రత్యర్థి ప్రశ్నలు..! వెరసి వచ్చే లోక్‌సభ ఎన్నికలు అత్యంత రసవత్తరంగా జరగడం ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ 'మోదీ గ్యారంటీ'లను అగ్రనేత రాహుల్ గాంధీ న్యాయ్ గ్యారెంటీలతో కాంగ్రెస్ ఢీకొట్టనుంది. రాబోయే సార్వత్రిక సమరాంగణంలో ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి ఆయుధాలుగా మారే పది కీలక అంశాలివే..

మోదీ గ్యారెంటీలు: మూడోసారీ మాదే అధికారం అంటూ అంతులేని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్న ప్రధాని మోదీ.. 'మోదీ గ్యారంటీ'ని ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. యువతకు మంచి భవిష్యత్, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తాము చేసిన కృషిని వివరిస్తూ ఓట్లడిగే వీలుంది.

కాంగ్రెస్ న్యాయ్ గ్యారెంటీలు: తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో 'గ్యారెంటీలు' అంటూ ప్రజల్లోకి వెళ్లి విజయవంతమైన కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికలకూ ఇదే విధంగా 'ఐదు న్యాయ్ గ్యారెంటీలను' ప్రకటించింది. యువత, రైతులు, మహిళలు, కార్మికులను దృష్టిలో పెట్టుకుని వీటిని రూపొందించింది. మణిపూర్ నుంచి ముంబైకి భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం సందర్భంగా రాహుల్ వీటి గురించి చెప్పారు. ఈ అంశాల ఆధారంగానే కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఉంటుందని, వీటిచుట్టూనే ప్రచారం జరిగేలా చూస్తుందని అంచనా.

నిరుద్యోగం, ధరలు: నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగితను విపక్ష ఇండియా కూటమి గట్టిగా లేవనెత్తుతోంది. మరీ ముఖ్యంగా ఉద్యోగ కల్పన లేకపోవడంపై మోదీ ప్రభుత్వాన్ని కడిగేస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థను, ఉద్యోగావకాశాల వృద్ధి గురించి చెబుతూ బీజేపీ దీనికి అడ్డుకట్ట వేస్తోంది.

ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ, యూసీసీ: బీజేపీ సుదీర్ఘకాల నినాదాలివి. మోదీ రెండోసారి గెలిచిన వెంటనే.. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేశారు. పాలన చివర్లో ఉండగా పౌరసత్వ సవరణ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి అమలుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. 'మేం చెప్పింది చేశామంటూ'.. కాషాయ పార్టీ చెప్పుకొనేందుకు అవకాశం ఉంది. విపక్షాలు మాత్రం ఈ ప్రయత్నాలను.. సమాజాన్ని వర్గాలు చీల్చేవిగా మండిపడుతున్నాయి.

అయోధ్య రామ మందిరం: ఉత్తరాదిన ఇప్పుడు కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి.. దీనికి ప్రధాన కారణం అయోధ్యలో రామ మందిర నిర్మాణం. విపక్షాల నేతలు కూడా రామ మందిర నిర్మాణం ఉత్తరాదిన బీజేపీకి మైలేజీ ఇచ్చిందని అంగీకరిస్తున్నారు. 'మాకు 370 సీట్లు ఖాయం' అంటూ బీజేపీ ఢంకా బజాయించి చెప్పడానికి వెనుక ఉన్న కారణమిదే.

అమృత్ కాల్ వర్సెస్ అన్యాయ్ కాల్: సుపరిపాలన, వేగవంతమైన వృద్ధి, భవిష్యత్‌పై దార్శనికతను మోదీ పాలనలో సాధించిన విజయాలుగా బీజేపీ చెప్పుకొనే వీలుంటే.. రాజ్యాంగం మీద దాడి, ఆర్థిక అసమానతల సంగతేమంటూ విపక్ష కూటమి ఎండగట్టడం ఖాయంగా కనిపిస్తోంది. మోదీ పదేళ్ల పాలనను అన్యాయ కాలమని కాంగ్రెస్ ఆరోపిస్తే, రాబోయే 25ఏళ్లు అమృతకాలమని దేశాభివృద్ధికి బాటలు వేయాలని బీజేపీ ప్రచారం చేసుకోనుంది.

రైతులు.. మద్దతు ధర: మోదీ రెండో దఫా పాలనలో రెండుసార్లు రైతులు రోడ్డెక్కారు. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా నెలల తరబడి ఢిల్లీ శివారులో ఉంటూ ఉద్యమించారు. మళ్లీ ఇప్పుడు కూడా చలో ఢిల్లీ అంటున్నారు. పీఎం కిసాన్ పథకం రైతులకు చేకూర్చిన మేలును బీజేపీ గుర్తుచేస్తోంది.

సిద్ధాంతాల సమరం: బీజేపీవి మతతత్వ విధానాలని.. సమాజాన్ని చీల్చే ప్రయత్నాలని ఉదాహరణలను చూపుతూ కాంగ్రెస్, ఇతర విపక్షాలు ధ్వజమెత్తే వీలుంది. ప్రతిగా కాంగ్రెస్‌వి బుజ్జగింపు రాజకీయాలని, కుటుంబ పార్టీ పాలన అని, అవినీతికి మారుపేరంటూ బీజేపీ విరుచుకుపడనుంది.

వికసిత్ భారత్.. మరో జుమ్లా: అభివృద్ధి చెందిన దేశంగా(వికసిత భారత్) తీర్చిదిద్దడమే లక్ష్యమని మోదీ చెబుతున్నారు. వందేళ్ల స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకొనే 2047కల్లా ఈ లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అంటున్నారు. అయితే, మోదీ విదేశాల నుంచి నల్ల ధనాన్ని తిరిగి తీసుకురావడంలాగే ఇది మరో అబద్ధం (జుమ్లా) అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఎలక్టోరల్ బాండ్లు ప్రతిపక్షానికి ఆయుధం

సరిగ్గా ఎన్నికల ముంగిట సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బయటపడడం.. అందులో బీజేపీకి అత్యధిక విరాళాలు అందినట్లు తేలడం ప్రతిపక్షాలకు ఓ ఆయుధమే. బాండ్లలో పెద్దఎత్తున అవినీతి జరిగింది.. బీజేపీ ఖాతాలను స్తంభింపజేయాలని, సుప్రీంకోర్టు విచారణ జరపాలని ఇప్పటికే కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

తొలి వంద రోజుల పాలనకు రోడ్ మ్యాప్!

» కొత్త సర్కారు కోసం రూపొందించండి.. మంత్రులకు ప్రధాని ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 17: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ గెలుపు ఖాయమని ధీమాతో ఉన్న ప్రధాని మోదీ.. వచ్చే ఐదేళ్ల కొత్త సర్కారు కోసం మొదటి 100 రోజుల పాలనలో అమలు చేసే కార్యక్రమాలకు సంబంధించి ఓ రోడ్ మ్యాప్ రూపొందించాలని కేంద్రమంత్రులను కోరారు. ఆదివారం ఉదయం మోదీ అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వచ్చే ఐదేళ్ల కొత్త ప్రభుత్వం కోసం తొలి వంద రోజుల్లో అమలు చేసే కార్యక్రమాలను ఏవిధంగా మెరుగ్గా అమలుపరచాలన్నది చర్చించారు. దీనిపై కేంద్రమంత్రులు వారి శాఖల కార్యదర్శులు, ఇతర అధికారులను కలవాలని మోదీ సూచించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మరునాడే ఈ సమావేశం జరిగింది. ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ సిఫార్సును రాష్ట్రపతికి పంపడం ద్వారా లోక్‌సభ ఎన్నికల తేదీలను నోటిఫై చేసే ప్రక్రియను కూడా క్యాబినెట్ ప్రారంభించింది.

రేపు సీడబ్ల్యూసీ సమావేశం

» లోక్‌సభ ఎన్నికలకు మేనిఫెస్టో ఖరారు

న్యూఢిల్లీ, మార్చి 17: లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) మంగళవారం సమావేశం కానుంది. ఎన్నికల ముసాయిదా మేనిఫెస్టోపై చర్చించి తుదిరూపు ఇవ్వనుంది. ప్రత్యేకించి ఐదు గ్యారెంటీల పేరిట ఇవ్వనున్న హామీలపై సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకోనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. దీంతోపాటు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) కూడా 19, 20వ తేదీల్లో భేటీ కానుంది. ఇప్పటిదాకా అభ్యర్థులను ప్రకటించని పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనుంది.

జూన్ 4న కాదు..2నే

» అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీల్లో మార్పు

న్యూఢిల్లీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీల్లో స్వల్పంగా మార్పులు చేస్తున్నట్టు ఎలక్షన్ కమిషన్ ఆదివారం ప్రకటించింది. కేవలం ఈ రెండు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ముందుగా ప్రకటించిన విధంగా జూన్ నాలుగో తేదీన కాకుండా రెండో తేదీనే ఉంటుందని తెలిపింది. రాజ్యాంగపరమైన అవసరాల రీత్యా ఈ నిర్ణయం తీసుకొంది. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలలో ఏప్రిల్ 19న అసెంబ్లీతో పాటు, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. అన్నింటితోపాటుగానే జూన్ 4న ఫలితాలు వెలువడుతాయని షెడ్యూల్‌లో పేర్కొంది. అయితే రాజ్యాంగపరంగా చిన్న సమస్య తలెత్తడంతో ఈ తేదీల్లో మార్పులు చేసింది. ఈ రెండు అసెంబ్లీల కాలపరిమితి జూన్ 2న ముగియనుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ఆర్టికల్ 172(1), ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం అసెంబ్లీ గడువు ముగిసేలోగానే ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రక్రియను ముగించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు జూన్ 4న ఫలితాలను విడుదల చేయడం అంటే ఈ నిబంధనలను అతిక్రమించినట్టవుతుంది. దానిని దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపును రెండు రోజుల పాటు ముందుకు జరిపింది. ఈ రెండు రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మాత్రం ముందుగా ప్రకటించిన విధంగా జూన్ 4నే వెల్లడవుతాయని, అందులో ఎలాంటి మార్పులేదని స్పష్టం చేసింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దు

అధికారులు, పార్టీలకు ఈసీ సూచనలు

న్యూఢిల్లీ, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల్లో పర్యావరణ హిత పద్ధతులు అనుసరించాలని అధికారులు, రాజకీయ పార్టీలకు ఈసీ సూచించింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండడం, కాగితం వాడకాన్ని వీలైనంత తగ్గించడం, కార్ల వినియోగాన్ని తగ్గించేలా 'కార్‌పూలింగ్' చేసుకోవడం, ప్రజారవాణా వాహనాలను ఉపయోగించడం వంటివి ఈసీ చేసిన సూచనల్లో కొన్ని. వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించింది. సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను అసలు వినియోగించవద్దని స్పష్టం చేసింది. ఈ ప్లాస్టిక్‌తో తయారుచేసే పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లను ఎన్నికల ముగిసిన తర్వాత ఎక్కడికక్కడ వదిలేస్తున్నారని, ఇది సమస్యలకు దారితీస్తోందని పేర్కొంది.

ప్రధాని పదవి రేసులో లేను: గడ్కరీ

న్యూఢిల్లీ, మార్చి17: ప్రధానమంత్రి పదవి రేసులో తానులేనని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం చేపడుతుందని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే మ్యాజిక్ ఫిగర్ సాధించలేకపోతే ప్రధాని పదవి రేసులో నితిన్ గడ్కరీ ఉంటారనే ఊహాగానాలపై ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విధంగా స్పందించారు. ప్రధాని రేసులో ఎప్పుడూ లేనన్న గడ్కరీ.. తాను నిజమైన బీజేపీ కార్యకర్తనని తెలిపారు. అలాగే దేవేంద్ర ఫడణవీస్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

ఆ ఒక్కటీ తప్పు..



(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలబాండ్లు అందుకున్న పార్టీ అదే. కాంగ్రెస్ పార్టీ అందుకున్న బాండ్ల విలువ రూ.1,334.35 కోట్లు కాగా.. రూ.1,322 కోట్లతో బీఆర్ఎస్ నాలుగో స్థానంలో నిలిచింది.

- బిజూ జనతాదళ్ పార్టీకి రూ.944.5 కోట్ల విలువైన విరాళాలు బాండ్ల రూపంలో వచ్చాయి.
- తమిళనాట డీఎంకే పార్టీ రూ.656.5 కోట్ల ఎన్నికల బాండ్లు అందుకోగా.. అన్నాడీఎంకే పార్టీకి రూ.6.05 కోట్లు వచ్చాయి.
- వైసీపీకి వచ్చిన బాండ్ల విలువ రూ.442.8 కోట్లు కాగా.. టీడీపీ రూ.181.35 కోట్ల విలువైన బాండ్లను నగదుగా మార్చుకుంది.
- కర్ణాటకలో జేడీఎస్ పార్టీకి రూ.89.75 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చాయి. అందులో రూ.50 కోట్ల విలువ చేసే బాండ్లు ఒక్క మేఘా ఇంజనీరింగ్ సమర్పించుకున్నవే.
- శివసేనకు రూ.60.4 కోట్లు, ఆర్జేడీకి రూ.56 కోట్లు, సమాజ్‌వాదీ పార్టీకి రూ.14.05 కోట్లు, అకాలీ దళ్‌కు రూ.7.26 కోట్లు, నేషనల్ కాన్ఫరెన్స్‌కు రూ.50 లక్షలు బాండ్ల రూపంలో వచ్చాయి.
- రూ.1,368 కోట్ల విలువైన బాండ్లతో.. శాంటియాగో మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ కంపెనీ దేశంలో అతిపెద్ద ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలుదారుగా నిలిచింది. ఆ కంపెనీ కొన్న బాండ్లలో 37% డీఎంకే పార్టీకే సమర్పించింది.
- తాము ఎన్నికల బాండ్ల విధానానికి వ్యతిరేకమైనందున ఎలాంటి బాండ్లూ స్వీకరించలేదని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్‌బీ సుప్రీంకోర్టుకు తెలపగా.. తమకు బాండ్ల రూపంలో విరాళాలూ రాలేదని మజ్లిస్, బీఎస్పీ తదితర పార్టీలు తెలిపాయి.

ఆ వివరాలూ చెప్పించండి..

ఎన్నికల బాండ్ల విక్రయాలకు సంబంధించి ఇప్పటిదాకా వెల్లడైంది 76% వివరాలేనని.. మిగతా 24% వివరాలు కూడా వెల్లడించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. 2018 మార్చి 1 నుంచి 2019 ఏప్రిల్ 11 నడుమ రూ.4,002 కోట్ల విలువైన బాండ్లు జారీ అయ్యాయని.. వాటిని కొన్నవారెవరు? ఎవరికి ఇచ్చారో కూడా బయటపెట్టించాలని కోరుతూ సిటిజన్ రైట్స్ ట్రస్ట్ అనే సంస్థ ఈ పిల్ వేసింది. మరోవైపు.. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ 'క్విడ్ ప్రో కో'కు పాల్పడిందని.. నల్లధనాన్ని బాండ్ల రూపంలో పార్టీ ఖాతాలకు మళ్లించడానికి కుట్రపన్నుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) లోని పలు నిబంధనలను ఉల్లంఘించిన 19 కంపెనీలను కేంద్ర ఆర్థిక శాఖ 2018లో 'హై రిస్క్' కంపెనీలుగా ప్రకటించిందని.. దరిమిలా అవే కంపెనీలు రూ.2,717 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు కొన్నాయని, ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలో ప్రకటించిన హైరిస్క్ కంపెనీల్లో వాటిలో 18 కంపెనీల పేర్లు లేవని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ మండిపడ్డారు. "అధికార పార్టీకి (బీజేపీ) ముడుపులు చెల్లించినందునే ఆ కంపెనీల పేర్లు హైరిస్క్ జాబితా నుంచి తొలగించారా?" అని ఆయన నిలదీశారు. విదేశాల్లో పోగుపడ్డ నల్లధనాన్ని వెనక్కి రప్పించి ప్రతి భారతీయుడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానన్న మోదీ ఆ సొమ్మును బీజేపీ ఖాతాల్లోకి మళ్లించడానికి కుట్ర పన్నుతున్నట్టుగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు.

దాతల పేర్లూ చెప్పేసిన పార్టీలు

మిగతా పార్టీలన్నీ తమకు ఎన్నికల బాండ్లు సమర్పించిన దాతల వివరాలను తెలివిగా దాటేయగా.. తమిళపార్టీలు మాత్రం ధైర్యంగా ఆ వివరాలనూ బయటపెట్టాయి. వాటి ప్రకారం.. అన్నాడీఎంకేకు బాండ్లు ఇచ్చిన దాతలు ఇద్దరే! ఒకరు చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం కాగా.. మరొకరు అడయార్‌కు చెందిన గోపాల్ శ్రీనివాసన్ అనే వ్యక్తి!! ఆ పార్టీకి వచ్చిన రూ.6.05 కోట్లలో గోపాల్ శ్రీనివాసన్ ఇచ్చింది రూ.5 లక్షలే. మిగతా రూ.6 కోట్లూ చెన్నై సూపర్‌కింగ్స్ దాతృత్వమే!! ఇక డీఎంకేకి వచ్చిన రూ.656.5 కోట్లలో రూ.509 కోట్ల విలువ చేసే బాండ్లను ఆ పార్టీకి ఇచ్చింది లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్‌కు చెందిన 'ఫ్యూచర్ గేమింగ్' కావడం గమనార్హం. మేఘా ఇంజనీరింగ్ నుంచి డీఎంకే రూ.105 కోట్లు అందుకుంది.

రాజ్యాంగాన్ని మార్చే దమ్ము బీజేపీకి లేదు

ఇండియా కూటమి సభలో ఉద్ధవ్, స్టాలిన్, రాహుల్, ఖర్గే, శరద్‌పవార్, ముఫ్తీ, రేవంత్, శివకుమార్



(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రాహుల్ స్పందించారు. మణిపూర్ నుంచి జనవరి 14న చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర 63వ రోజైన శనివారం మహారాష్ట్ర రాజధాని ముంబైలో ముగిసింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మారకమైన చైతన్య భూమి వద్ద రాజ్యాంగ పీఠికను పఠించారు. నగరంలో జాతి పిత గాంధీజీ నివసించిన మణి భవన్ నుంచి ఆగస్టు క్రాంతి మైదాన్‌కు ఆదివారం నిర్వహించిన న్యాయ సంకల్ప పాదయాత్రలో రాహుల్ పాల్గొన్నారు. 1942లో గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని క్రాంతి మైదాన్‌లోనే మొదలుపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన పాదయాత్రలో.. శివాజీ పార్క్‌లో జరిగిన ఇండియా కూటమి బహిరంగ సభలో రాహుల్ ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. "మోదీ, ఆరెస్సెస్‌లు.. జ్ఞానం ఒక వ్యక్తికే ఉన్నాయని భావిస్తాయి. రైతుల, కార్మికులు, నిరుద్యోగులకు తెలివి లేదనుకుంటాయి. ఐఐటీ డిగ్రీ ఉన్నంతనే ఓ వ్యక్తికి రైతు కంటే ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని భావించలేం" అని వ్యాఖ్యానించారు.

మోదీ ఓ డొల్ల మనిషి

ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలు లేకుండా మోదీ ఎన్నికలకు వెళ్లలేరని విమర్శించారు. "56 అంగుళాల ఛాతీ అని చెప్పుకొనే మోదీ ఓ డొల్ల మనిషి" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము వీవీప్యాట్ స్లిప్పులనే లెక్కించాలని కోరినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదని రాహుల్ పేర్కొన్నారు. అవినీతిపై ప్రధాని మోదీకే గుత్తాధిపత్యం ఉందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్వేషాలను ఎత్తిచూపేందుకే 'భారత్ జోడో యాత్ర'లను నిర్వహించినట్లు వివరించారు.

విద్వేష సిద్ధాంతంపై పోరాటం

ఎన్సీపీ(పవార్ వర్గం) అధినేత శరద్‌పవార్ మాట్లాడుతూ.. బీజేపీ తప్పుడు హామీలతో దేశ ప్రజలను వంచించిందన్నారు. 'క్విట్ ఇండియా' మాదిరిగా.. ఆ పార్టీని గద్దెదించాలని ముంబై నుంచి పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. తమ(ఇండియా కూటమి) పోరాటం మోదీపైనో.. అమిత్‌షాపైనో కాదని, 'విద్వేష సిద్ధాంతం'పైనే తమ పోరు అని వ్యాఖ్యానించారు. ప్రజలు ఏకమైతే.. నియంతృత్వం అంతమవుతుందని శివసేన(ఠాక్రేవర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. దేశాన్ని రక్షించేందుకే 'ఇండియా' కూటమి పక్షాలు ఏకమయ్యాయని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా వివరించారు. పీడీపీ నాయకురాలు మహబూబా ముఫ్తీ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకే 400కుపైగా సీట్ల గురించి బీజేపీ మాట్లాడుతోందని వ్యాఖ్యానించారు. ఝార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ సతీమణి కల్పన మాట్లాడుతూ తాము జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని.. కుట్రలో భాగంగా తన భర్తను జైల్లో పెట్టారని మోదీ సర్కారును విమర్శించారు. ఈ సమావేశంలో సోనియా, ఖర్గేతో పాటు ఇండియా కూటమిలోని పార్టీల నాయకులు పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఈ సమావేశానికి హాజరుకాలేదు.

బీజేపీది వైట్ కాలర్ కరప్షన్

తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధించి, కేంద్రంలో అధికారాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. "మేము లౌకిక, సమ్మిళిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ అవినీతి బయటపడింది. కమలదళం నాశనం చేసిన భారతదేశ ఆత్మను పరిరక్షించే ప్రయత్నమే రాహుల్‌గాంధీ జోడో యాత్ర" అని పేర్కొన్నారు. తమ కూటమికి 'ఇండియా' అని నామకరణం చేసినప్పటి నుంచి.. బీజేపీ ఆ పదాన్నే ఉచ్చరించడం మానేసిందన్నారు. విపక్ష నేతలపై 'అవినీతి' ముద్ర వేయడానికి మోదీ ప్రయత్నిస్తున్నారని, ఎలక్టోరల్ బాండ్లు బీజేపీనే అవినీతి పార్టీ అని నిరూపించాయని, ఆ పార్టీది 'వైట్‌కాలర్' కరప్షన్ అని ఆరోపించారు.

హాస్టల్‌లో నమాజ్ చేసినందుకు విదేశీ విద్యార్థులపై దాడి

గుజరాత్ యూనివర్సిటీలో ఘటన.. ఇద్దరి అరెస్ట్

అహ్మదాబాద్, మార్చి 17: అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీ హాస్టల్‌లో నమాజ్ చేసినందుకు పలు దేశాలకు చెందిన విద్యార్థులపై కొంత మంది వ్యక్తులు దాడి చేసినట్టు ఆదివారం పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ఏ-బ్లాక్ హాస్టల్‌లో జరిగిన ఘటనలో గాయపడిన శ్రీలంక, తజకిస్థాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులను ఆస్పత్రిలో చేర్పినట్టు చెప్పారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. గుజరాత్ యూనివర్సిటీలో చదువుతున్న ఐదుగురు విదేశీ విద్యార్థులు నమాజ్ చేస్తుండగా దాడి ఘటన జరిగింది. వీరు ఉజ్బెకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, తజకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంకకు చెందిన వారు. ఈ ఘటనలో 20-25 మందిపై ఎఫ్ఐఆర్‌ను రిజిస్టర్ చేశామని పోలీస్ కమిషనర్ జీఎస్ మాలిక్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ వ్యవహారంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం రాత్రి 10.50 గంటల ప్రాంతంలో గుజరాత్ యూనివర్సిటీ హాస్టల్ ప్రాంగణంలోకి దాదాపు 25 మంది ప్రవేశించి.. విదేశీ విద్యార్థులు నమాజ్ చేస్తుంటే అభ్యంతరం వ్యక్తం చేశారని, మసీదులో నమాజ్ చేసుకోవాలన్నారని మాలిక్ తెలిపారు. దీనిపై వాదనకు దిగడమేకాకుండా వారిపై దాడి చేయడంతోపాటు రాళ్లు రువ్వారన్నారు.

సీఏఏ నిబంధనలపై స్టే ఇవ్వండి

» సుప్రీంకోర్టులో కేరళ పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 17: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నిబంధనలు అమలు కాకుండా స్టే ఇవ్వాలని కోరుతూ కేరళ ప్రభుత్వం తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నిబంధనలు వివక్షపూరితం, ఏకపక్షం, లౌకికవాద సిద్ధాంతాలకు వ్యతిరేకమని పేర్కొంది. 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం 2024లో నిబంధనలు రూపొందించిందని, అందువల్ల వీటి అమలు అత్యవసరమేమీ కాదని భావిస్తోందని కేరళ సర్కారు తన పిటిషన్‌లో తెలిపింది. ఈ కారణంగా స్టే మంజూరు చేయాలని కోరింది. మతం, దేశాన్ని ఆధారం చేసుకొని నిబంధనలు రూపొందించడం వివక్షాపూరితమని వ్యాఖ్యానించింది. సీఏఏ చెల్లుబాటును సవాలు చేస్తూ కేరళ అంతకుముందే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అంతర్జాతీయ సరిహద్దులు ఉన్న శ్రీలంక, మయన్మార్, భూటాన్ నుంచి వచ్చిన వలసదార్లకు ఇలాంటి సౌకర్యాలు కల్పించకపోవడాన్ని ప్రశ్నించింది. తాజాగా ఈ చట్టంలోని నిబంధనలు అమలు కాకుండా స్టే ఇవ్వాలని కోరింది. సీఏఏను అమలు చేయకూడదని ఇదివరకే సుప్రీంకోర్టులో మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి.

మేం కూడా గేట్లు ఎత్తినం!

(మొదటిపేజీ తరువాయి)

'వంద రోజుల ప్రజాపాలన.. మీట్ ది మీడియా' కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. "ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి పారదర్శకంగా పనిచేసే అవకాశం ఇవ్వకుండా.. కేసీఆర్ నుంచి మొదలుకొని కడియం శ్రీహరి, బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రకటనలు చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలు పూర్తికాగానే ఆపరేషన్ మొదలుపెడతామని బహిరంగంగా అంటున్నారు. ఇది దేనికి సంకేతం? ఈ వంద రోజుల్లో మేం ఎక్కడైనా ఫిరాయింపులను ప్రోత్సహించామా? రాజకీయ ప్రయోజనాలు ఆశించామా? వాళ్లిద్దరూ (బీఆర్ఎస్, బీజేపీ) ఒకే లైన్‌లో మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని పడగొడతామంటే చూసుకుంటూ కూర్చుంటామా? నేను ఇదివరకే చెప్పిన. తారీఖు మీరే చెప్పండి.. చూసుకుందామని. అందుకే ఈరోజు మొదలుపెట్టిన. నిన్న కోడ్ రానంతవరకు ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించిన. ఇప్పుడు ఎన్నికల నగారా మోగినందున.. ఎన్నికల రూపం చూపిస్తా. ఈ రోజు నుంచి పీసీసీ అధ్యక్షుడిగా పని మొదలుపెట్టిన. ఒక గంటలో మీ దృష్టికి వస్తది" అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారు. ఔటర్ రింగు రోడ్డు లోపలి వైపు ఉన్న సిటీ మొత్తాన్ని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోకి తీసుకొస్తామని, ఔటర్ నుంచి రీజినల్ రింగురోడ్డు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకొస్తామని తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణించి అభివృద్ధి చేస్తామని వివరించారు. వైబ్రెంట్ తెలంగాణ-2050 సాధనే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేస్తామని ప్రకటించారు.

నిజాం నవాబు, కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే..

"భారతదేశ చరిత్రలో 1948 సెప్టెంబరు 17వ తేదీకి ఎలాంటి ప్రత్యేకత ఉందో.. తెలంగాణ రాష్ట్రంలో 2023 డిసెంబరు 3వ తేదీకి కూడా అంతే ప్రత్యేకత ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. "ఏడు తరాలపాటు తన రాచరికాన్ని, ఆధిపత్యాన్ని ప్రజలమీద రుద్ది, స్వేచ్ఛాయుత వాతావరణం లేకుండా పెత్తనం చేసిన నిజాం ప్రభుత్వం సాయుధ రైతాంగ పోరాటానికి తలొగ్గి సెప్టెంబరు 17న ఎలా కూలిపోయిందో.. కేసీఆర్ ప్రభుత్వం కూడా డిసెంబరు మూడో తేదీన అలాగే కూలిపోయింది. నిజాంసాగర్ ప్రాజెక్టు, నిజాం కాలేజీ, నిజాం హాస్పిటల్, ఉస్మానియా యూనివర్సిటీ, ఉస్మానియా హాస్పిటల్ తానే కట్టానని, తెలంగాణ ప్రజలకు కావాల్సినవన్నీ ఇచ్చానని, సంక్షేమం-అభివృద్ధి తానే చేశానని, వారసత్వంగా ప్రజలు బానిసలుగా ఉండాలని, వెట్టిచాకిరి చేయాలని, ఎనిమిదో తరం కూడా తన వారసులే ఏలుతారని ఏడో నిజాం ప్రభువు కోరుకున్నడు. కానీ, ఈ ప్రాంత ప్రజలు అంగీకరించలేదు. కట్టుబానిసత్వం, వెట్టిచాకిరి, హరించిన స్వేచ్ఛ ముందు ఏమిచ్చినా తక్కువేనని భావించి.. కమ్యూనిస్టులు, ఎర్ర జెండా నీడలో వేలాది మంది రైతులు ప్రాణత్యాగాలు చేసి, పోరాటాలు చేసి నిజాం నిరంకుశత్వం నుంచి విముక్తి కలిగించారు. అలాగే.. 2014 జూన్ రెండో తేదీన ఏర్పడిన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికైన కల్వకుంట్ల చంద్రశేఖరరావు కూడా.. కాళేశ్వరం కట్టానని, కల్యాణలక్ష్మి ఇచ్చానని, సచివాలయం కట్టానని, ప్రగతిభవన్ నిర్మించుకున్నానని అధికార గర్వంతో విర్రవీగి.. తన వారసత్వాన్ని తెలంగాణ ప్రజల నెత్తిమీద రుద్దటానికి, కట్టుబానిసలుగా మార్చటానికి ప్రయత్నించారు. ఆనాడు ఖాసీం రిజ్వీని అడ్డుపెట్టుకొని నిజాం నవాబు ఎలాంటి దారుణాలకు ఒడిగట్టాడో.. కేసీఆర్ కూడా తెలంగాణ రాష్ట్రంలో ప్రభాకర్‌రావు అనే ఖాసీం రిజ్వీని అడ్డం పెట్టుకొని ప్రజల ఛీత్కారానికి గురయ్యారు. విజ్ఞులైన తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ఎన్నికల్లో అంతమొందించారు. నూటికి నూరుశాతం ఇద్దరిలో సారూప్యత ఉంది. కేసీఆర్- నిజాం.. పేర్లు మాత్రమే వేరు. విధానాలు, ఆలోచనలు ఇద్దరివీ ఒక్కటే" అని రేవంత్ అన్నారు.

సాంస్కృతిక, సంక్షేమ, పరిపాలనా విధానాలు

సహజసిద్ధంగా, వారసత్వంగా ఏర్పడిన సంస్కృతిపై దాడిచేసి కొత్త సంస్కృతిని నెలకొల్పాలనే ధోరణిలో నియంతృత్వ పాలకులు గతంలో కొందరు ఉండేవారని సీఎం రేవంత్ తెలిపారు. కేసీఆర్ కూడా అదే తరహాలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాలగర్భంలో కలిపేశారని ఆరోపించారు. "ఉద్యమంలో టీజీ ఉంటే తెలంగాణ వచ్చాక కేసీఆర్ టీఎస్‌ను తీసుకొచ్చారు. తెలంగాణ తల్లి అంటే.. ఆయన కుటుంబ సభ్యురాలి మాదిరిగానే ఉండాలనే విధానాన్ని అమలు చేసి సంస్కృతిపై దాడి చేశారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర ఏర్పాటు తర్వాత నిషేధించారు. రాష్ట్ర అధికారిక చిహ్నంలో రాచరికపు పోకడలు, జమీందారీ విధానాలనే కేసీఆర్ పొందుపరిచారు. కొందరు కవులు, కళాకారులను తన గడీలో బంధించి దొరగారి భుజకీర్తులను శ్లాఘించుకున్నారు. అందుకే టీఎస్‌కు బదులుగా టీజీని తీసుకొచ్చినం! జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించాం. ముఖ్యమంత్రి సహా మంత్రులంతా ప్రజలకు అందుబాటులో ఉంటున్నం. సంక్షేమం, అభివృద్ధిని కూడా పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నాం" అని రేవంత్ వివరించారు.

రాష్ట్రంపై రూ.9 లక్షల కోట్ల అప్పుల కుంపటి..

పౌరసరఫరాల సంస్థలో రూ.60 వేల కోట్ల అప్పులున్నాయని, విద్యుత్తు సంస్థలపై రూ.81 వేల కోట్ల అప్పు ఉందని, మరో రూ.20-25 వేల కోట్ల మొండి బకాయిలు ఉన్నాయని సీఎం రేవంత్ తెలిపారు. అన్ని లెక్కలూ తీస్తే స్థూలంగా రూ.9 లక్షల కోట్ల అప్పుల కుంపటి రాష్ట్ర ప్రజలపై ఉందని వెల్లడించారు. "2014 జూన్ 2న తెలంగాణ ఏర్పడినప్పుడు.. ఈ రాష్ట్రం ఏడాదికి చెల్లించాల్సిన అప్పు రూ.6 వేల కోట్లు ఉండేది. మొన్న 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు లెక్క చూస్తే.. ఏడాదికి రూ.64 వేల కోట్ల అప్పు చెల్లించాల్సి వస్తోంది. ఇప్పుడది రూ.70 వేల కోట్లకు పెరిగింది. 600 శాతం అప్పులు చెల్లించే పరిస్థితి కేసీఆర్ కల్పించారు. ప్రతి నెలా జీతభత్యాలు, పెన్షన్లు, ప్రభుత్వ నిర్వహణ కోసం అన్నీ కలిపి ఏటా రూ.1.20 లక్షల కోట్లు మార్చి నెలాఖరుకు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రతి నెలా తక్కువలో తక్కువగా రూ.11 వేల కోట్లు అవసరమవుతున్నాయి. ఆర్థిక నిబద్ధతతో పనిచేస్తున్నాం" అని అన్నారు.



సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి

విలేకరులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ సమాధానాలు..

* రైతుబంధులో 5 ఎకరాల వరకు 62 లక్షల మందికి ఖాతాల్లో డబ్బులు జమ చేశాం. భవిష్యత్తులో అమలు చేసే రైతు భరోసా పథకంలో.. గుట్టలు, చెట్లు, పుట్టలు, రాళ్లు, రప్పలు, లేఅవుట్లు, బంగళాలకు ఇచ్చేదిలేదు. అనర్హులుంటే సర్వే చేసి ఆ భూములు తొలగిస్తాం. ఈ మధ్య మీ 'ఆంధ్రజ్యోతి'లో కూడా కథనాలు రాశారు. జాతీయ రహదారి రోడ్ల కింద పోయిన భూములకు కూడా రైతుబంధు ఇస్తున్నారని! అవన్నీ తొలగిస్తాం.
* రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం పెరుగుతోంది. మొదటి నెలలో రూ.289 కోట్లు, రెండో నెల రూ. 500 కోట్లు పెరిగింది. ఈ నెల రూ.700 కోట్లు పెరుగుతుంది. వచ్చే మూడు నెలల్లో ప్రతి నెలా జీఎస్టీలో రూ.1,000 కోట్ల ఆదాయం అదనంగా వస్తుంది. పన్ను ఎగవేతదారులను వదిలిపెట్టేదిలేదు. ఎక్సైజ్‌లోనూ ఇలాంటివి జరుగుతున్నాయి. లెక్కలు చూస్తే ఒక్క ఏడాది పన్నులో తేడా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లు వచ్చింది. ఐదేళ్ల లెక్క తీస్తే ఇంకా పెరుగుతుంది. ఏడాదికి రూ.12 వేల కోట్ల జీఎస్టీ ఆదాయం పెరిగితే.. ఆ నిధులను సంక్షేమ పథకాలకు ఖర్చు పెడతాం.
* కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఎన్‌డీఎస్‌ఏ విచారణ కొనసాగుతోంది. జ్యుడీషియల్ విచారణకు కూడా ఆదేశించాం. ఆ నివేదికల ఆధారంగానే చర్యలు తీసుకుంటాం. కక్షసాధింపు చర్యలు ఉండవు. కేసీఆర్ కుటుంబానికి అధికారం కోల్పోవడమే శిక్ష.
* ఎన్నికల వ్యూహం మాకు స్పష్టంగా ఉంది. గ్రేటర్ పరిధిలో 4 ఎంపీ సీట్లు, రాష్ట్రంలో 14 కు పైచిలుకు సీట్లు ఎలా గెలవాలో మాకంటూ ఓ ప్రణాళిక ఉంది. ఏపీలోనే కాదు.. గతంలో కేరళలో కూడా ప్రచారానికి వెళ్లిన. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఏపీకి వెళ్లిన! ఈ రోజు మహారాష్ట్ర వెళ్తున్న.
* బీజేపీకి రాష్ట్రంలో 8 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే ఉన్నాయి. బీఆర్ఎస్‌కు 38 సీట్లు ఉన్నాయి. రెండు పార్టీలు కలిసినా మ్యాజిక్ ఫిగర్ చేరుకునే అవకాశం లేదు. కానీ, ఎందుకు మా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారో అర్థంకావడంలేదు. ఇకమీదట ఉపేక్షించేది లేదు. మాల్ మసాలా అంతా రెడీగా ఉంది. ఎలా అంటే అలా సమాధానం చెప్పడానికి రెడీగా ఉన్నా.
* మేం పదేళ్లు అధికారంలో ఉంటామనే భరోసాతో ఉన్నాం. ఆ తర్వాత కూడా ప్రజలు ఆశీర్వదిస్తే కొనసాగుతాం. అయితే అభివృద్ధికి ఐదేళ్లకు, పదేళ్లకు రోడ్ మ్యాప్ రూపొందించటం సరైన చర్య కాదు. అందుకే మేం వైబ్రెంట్-2050 అనే లక్ష్యం పెట్టుకున్నాం. 25 ఏళ్ల ముందుచూపుతో మెగా మాస్టర్ ప్లాన్ తయారుచేస్తున్నాం. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి కూడా ఎలాంటి ఢోకా లేదు. ఎన్నికల సమయంలో కాస్త స్తబ్దుగా ఉండటం సహజం. పార్లమెంటు ఎన్నికల తర్వాత మళ్లీ పుంజుకుంటుంది. భవిష్యత్తులో మేడ్చల్ వరకు కూడా మెట్రోరైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తాం.
* ఈ రోజు ఒక గేటు ఓపెన్ చేసిన. ఒక సిటింగ్ ఎమ్మెల్యే, సిటింగ్ ఎంపీ గేటు తెరుచుకొని వచ్చేశారు. అవతలి వైపు ఖాళీ అయ్యేదాకా అలాగే ఉంటది. అయితే చేరికలపై కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. చేరికలతో ఉపయోగం ఉందా? లేదా? స్థానిక పరిస్థితులేంటి? సామాజికవర్గాలేంటి? బలాబలాలేంటి? అనే అంశాలపై పార్టీ చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటుంది. కొత్తగా పార్టీలో చేరినవారు.. వచ్చీరాగానే అధికారాన్ని చెలాయించే పరిస్థితి ఉండదు. ఏఐసీసీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు చేరికలు, ఎన్నికల్లో పోటీకి టికెట్లు సెంట్రల్ ఎలక్షన్ కమిటీ నిర్ణయిస్తుంది.



సీఎం రేవంత్ సమాధానాలు..

* కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మంత్రివర్గ కూర్పు, ప్రభుత్వ విప్‌లు, ముఖ్యమంత్రి పేషీ సహా చీఫ్ సెక్రటరీల నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీల వరకు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాల్లో సామాజిక సమతుల్యతను పాటించాం. సామాజిక న్యాయానికి మారుపేరుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంది.
* బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి వందల కోట్లకు పరిమితం కాలేదు. రూ.వేల కోట్లకు పెరిగిపోయింది. అవినీతి, అక్రమాలపై విచారణ సంస్థలు నివేదిక ఇచ్చిన తర్వాత ఆ వివరాలు వెల్లడిస్తాం. అక్రమార్కులను వదిలేది లేదు. గతంలో ఏసీబీ నామమాత్రంగా పనిచేసేది. ఇప్పుడు ఏసీబీ దూకుడుగా పోతోంది. అవినీతిపరులపై రాజ్యాంగబద్ధంగా చర్యలు తీసుకుంటాం.
* అమ్మగారు లేరు కదా.. బతుకమ్మ పండుగ ఎలా జరపాలి? అని కొందరు ఆందోళన చెందుతున్నట్లుగా కనిపిస్తోంది. బతుకమ్మను వ్యాపారంగా, సహజమైన పూల నుంచి ప్లాస్టిక్ పూల బతుకమ్మగా మార్చింది కూడా కేసీఆర్ కుటుంబమే. ఈసారి ప్లాస్టిక్ పూలతో బతుకమ్మ ఆడేటోళ్లు లేకపోవచ్చు. బతుకమ్మలు, బోనాలు, ఇతరత్రా పండుగలు.. ఎవరున్నా, ఎవరు లేకపోయినా కొనసాగుతూనే ఉంటాయి.
* ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడటంతో భూగర్భ జలాలు పడిపోయాయి. తాగునీటి, సాగునీటి సమస్యలు అక్కడక్కడ వస్తున్నాయి. వాటిని పరిష్కరిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నంత పరిస్థితి రాష్ట్రంలో లేదు. కొందరు నేతలు లైన్‌మెన్లకు ఫోన్‌చేసి విద్యుత్తు సరఫరా నిలిపివేయిస్తున్నారు. అందుకే కొందరు సైకో ఫ్యాన్స్‌పై చర్యలు తీసుకున్నాం. నీరు, కరెంటు సరఫరా నిలిపివేస్తే ఉపేక్షించేదిలేదు.
* రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జీవోలు ఏవీ కూడా దాచిపెట్టాల్సిన అవసరం మా ప్రభుత్వానికి లేదు. జీవోలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. కొద్ది రోజుల్లో సమాచార హక్కు కమిషనర్లను నియమిస్తాం
* ధరణి పోర్టల్ గతంలో ఒక ప్రైవేటు సంస్థ చేతిలో ఉండేది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండే 'సీజీజీ' అనే సంస్థకు అప్పగించినం. పోర్టల్ సమస్యలు, అప్పటి ప్రభుత్వ నిర్ణయాలపై విచారణకు ఒక కమిటీ వేసినం. 2014కు ముందు భూములు ఎవరి పేర్లపై ఉన్నాయి? ఆ తర్వాత ఎలా మార్పు చెందుతూ వచ్చాయి? అధికార దుర్వినియోగం ఎలా జరిగింది? అనే అంశాలపై విచారణ పూర్తికాగానే చర్యలు తీసుకుంటాం.
* ఈటలకు చిత్తశుద్ధి ఉంటే.. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరిపించాలి. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ చేరతాడని అనుకోవడంలేదు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తానని ఆఫర్ ఇచ్చిన. 15 రోజులు జాప్యం కావడానికి ఇదో కారణం. కానీ, ప్రవీణ్‌కుమార్ అంగీకరించలేదు.



నీ ఇంటిపేరు తన్నీరు ఉన్నంత మాత్రాన.. నీవు పన్నీరు కాదు!

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చాలా విభాగాల్లో విష పురుగులు, గంజాయి మొక్కలను నాటారని, ఆ గంజాయి మొక్కలు పరిమళాలు వెదజల్లుతూనే ఉన్నాయని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. "విద్యుత్తు సంస్థలకు ముందుగా సబ్సిడీ చెల్లించిన తర్వాతే.. జీరో బిల్లులు ఇవ్వాలని తెలంగాణ విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. ఆ మేధావిని నేను అడుగుతున్నా. ఇన్ని రోజులు ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంటు ఇస్తే.. ఏ రోజైనా ఇలాంటి ఆదేశం ఇచ్చావా? నీ జాతి బుద్ధి ఇంకా పోనిచ్చుకోవడంలేదు. నీ ఇంటిపేరు తన్నీరు ఉన్నంత మాత్రాన.. నీవు పన్నీరు అనుకుంటున్నావా? కేసీఆర్ ప్రభుత్వం 40 వేల కోట్ల విద్యుత్తు సబ్సిడీలకు బొక్క పెడితే ఈ తన్నీరు (ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు) కళ్లకు కనిపించలేదా? తన్నీరూ.. గుర్తుపెట్టుకో! నీవు కూడా ఎక్కువసేపు ఆ కుర్చీలో కూర్చోలేవు. యథాలాపంగా ఉన్నప్పుడు వేటు వేద్దామనుకుంటున్నావేమో! అలా కుదరదు. అందుకే ఈ గంజాయి మొక్కలను ఏరిపారేస్తున్నా. పేదలకు గృహజ్యోతి జీరో బిల్లు పథకాన్ని అమలు చేయటానికి, ఉచిత్ విద్యుత్తు అమలు చేయటానికి ఎవరు అడ్డొచ్చినా.. అడ్డం తొలగించుకొని ముందుకెళ్తాం" అని సీఎం ప్రకటించారు.

అమెరికాలో కాంగ్రెస్ 'వంద రోజుల' వేడుక

» పాల్గొన్న రేవంత్ సోదరుడు జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పాలన పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అమెరికాలోని సియాటెల్ నగరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలంగాణ నేషనల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, సియాటెల్ ఐవోసీ అధ్యక్షుడు రాహుల్ సూర్యోదయ, సియాటెల్ ఐవోసీ నేతలు యశ్వంత్ రిషి, సాయిచరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా తెలంగాణ అమరవీరులు, ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి అర్పిస్తూ వేడుకను ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి హాజరు కాగా, వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుమార్తె డాక్టర్ గోదా నాయిని కూడా పాల్గొన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలన ప్రజారంజకంగా సాగుతోందని జగదీశ్‌రెడ్డి కొనియాడారు. ఎన్ఆర్ఐల కోసం తాను మధ్యవర్తిగా వ్యవహరించి సమస్యలను ప్రభుత్వానికి చేరవేస్తానని తెలిపారు.

తిమ్రీస్ పాలకమండలి పునర్నియామకం

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (తిమ్రీస్) పాలకమండలిలో మార్పులు చేర్పులు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తిమ్రీస్ పాలకమండలికి చైర్మన్‌గా మైనారిటీ శాఖ మంత్రి, వైస్ చైర్మన్‌గా మహమూద్ ఫహీముద్దీన్ ఖురేషీ, సభ్యులుగా మైనారిటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యా, ఆర్థిక శాఖ కార్యదర్శులు, మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్, తిమ్రీస్ సొసైటీ సెక్రటరీ ఉంటారని తెలిపింది. గత ప్రభుత్వ హయంలో పాలకమండలిలో మొత్తం 11 మంది ఉండగా... రేవంత్ సర్కారు ఒకరిని తగ్గించి, పదికే పరిమితం చేసింది.

కేసుల సత్వర పరిష్కారంపై దృష్టి

» అందుకే అదనపు కోర్టుల ఏర్పాటు
» హైకోర్టు జడ్జీలు జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ రాజేశ్వరరావు
» నర్సంపేటలో నూతన న్యాయస్థానాల ప్రారంభం

నర్సంపేట, మార్చి 17: కక్షిదారులకు సత్వరమే న్యాయం అందించడం కోసం కొత్తగా కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్టు హైకోర్టు న్యాయమూర్తులు కె.లక్ష్మణ్, నామవరపు రాజేశ్వరరావు అన్నారు. అదనపు సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేటు కోర్టులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1937లో ప్రారంభమైన నర్సంపేట కోర్టుకు ఎంతో ఘనచరిత్ర ఉందన్నారు. ఎంతో అనుభవజ్ఞులైన ప్రతిభగల న్యాయవాదులు ఈ కోర్టులో పనిచేశారని గుర్తు చేశారు. అనేక మంది పేదలకు న్యాయం చేకూర్చారన్నారు. ఇక్కడ కేసుల పెండెన్సీ ఎక్కువగా ఉన్న కారణంగా అదనపు కోర్టులు మంజూరు చేశామని తెలిపారు. న్యాయవాదులంతా ఎప్పటికప్పుడు ప్రతిభను పెంపొందించుకొని న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేలా చేయాలని కోరారు. న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ వినతి పత్రం సమర్పిస్తూ నర్సంపేటకు అదనపు జిల్లా న్యాయస్థానాన్ని మంజూరు చేయాలని, ఇక్కడి పాత భవనాన్ని పునరుద్ధరించాలని, రికార్డుల భద్రతకు తగిన సౌకర్యాలు ఉన్న రూములను నిర్మించాలని కోరింది. ఇందుకు హైకోర్టు జడ్జీలు సానుకూలంగా స్పందించారు. నర్సంపేట కోర్టులో గత 30సంవత్సరాలుగా పని చేస్తున్న సీనియర్ న్యాయవాదులను ఈ సందర్భంగా సన్మానించారు.



రేవంత్, భట్టి ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం

» తప్పిన పెను ప్రమాదం
» ఇదే ఫ్లైట్‌లో పొన్నం, దీపాదాస్ మున్షీ
» పలువురు ప్రముఖులు, ప్రయాణికులు
» ముంబైకి వెళుతుండగా టేకాఫ్‌కు ముందు లోపాన్ని గుర్తించిన ఇంజనీర్లు
» 2 గంటలు ఆలస్యంగా విమానం
» ఆందోళనకు గురైన ప్రముఖులు, ప్రయాణికులు

శంషాబాద్ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మరికొంత మంది ప్రముఖులు ప్రయాణిస్తున్న ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఈ విషయాన్ని టేకాఫ్‌కు ముందే పైలెట్లు గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ముంబై వెళ్లాల్సిన ఇండిగో 6ఈ5099 విమానం ప్రధాన రన్‌వే దగ్గరకు వెళ్లింది. టేకాఫ్ సమయంలో ఇంజన్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించిన పైలెట్లు విమానాన్ని అక్కడే ఆపారు. ఇంజన్ ఓవర్ హీట్ సమస్యతో ఏసీ పనిచేయలేదు. దీంతో సీఎం, డిప్యూటీ సీఎంతో ప్రయాణిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ప్రముఖులు, ఇతర ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఎయిర్‌లైన్స్ సిబ్బంది.. ఇంజనీర్లను పిలిచి సమస్యను పరిష్కరించారు. విమానం సాయంత్రం 4.30 గంటలకు ముంబై వెళ్లినట్లు తెలుస్తోంది. విమానం రెండు గంటలు ఆలస్యం కావడంతో ఎయిర్‌లైన్స్ అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

గవర్నర్ కార్యదర్శిగా బుర్రా వెంకటేశం బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ కార్యదర్శిగా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు కార్యదర్శిగా పనిచేసిన సురేంద్రమోహన్‌ను బదిలీచేసిన నేపథ్యంలో వెంకటేశంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన అనంతరం గవర్నర్ తమిళిసైని బుర్రా వెంకటేశం ప్రత్యేకంగా కలిశారు.

కాంగ్రెస్‌లో చేరిన దానం, రంజిత్‌రెడ్డి

» కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్, దీపా దాస్
» సికింద్రాబాద్, చేవెళ్లలో ఎంపీలుగా పోటీకి నిలిపే చాన్స్!
» బీఆర్ఎస్ వరుస షాక్‌లు.. పార్టీని వీడిన తొలి ఎమ్మెల్యే
» మల్కాజిగిరి స్థానంలో పోటీకి సునీతారెడ్డి పేరు పరిశీలన
» మండలిలో చీఫ్ విప్‌గా ఆమె భర్త పట్నం మహేందర్‌రెడ్డి!

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేగంగా మారిపోతున్న రాజకీయాల్లో మరో కీలక పరిణామం.! ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఇంకో షాక్.! ఆ పార్టీకి చెందిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరిద్దరికీ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వాస్తవానికి చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బీఆర్ఎస్ అధిష్ఠానం ఖరారు చేసింది. కానీ, ఆయన మాత్రం సంసిద్ధత వ్యక్తం చేయలేదు. కొన్నాళ్లుగా కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కిరావడంతో పార్టీ మారారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు ఇప్పటివరకు ఎంపీలను మాత్రమే కోల్పోతున్న బీఆర్ఎస్‌కు.. కాంగ్రెస్‌లో చేరడం ద్వారా దానం నాగేందర్ ఝలక్ ఇచ్చారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన తొలి ఎమ్మెల్యే ఈయనే కావడం గమనార్హం. కాగా, దానంను సికింద్రాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేయిస్తే ఎలా ఉంటుంది? అని కాంగ్రెస్ పెద్దలు కసరత్తు చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై బలమైన అభ్యర్థిని నిలపాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకత్వం దానం పేరును తెరపైకి తెచ్చింది. దానం సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఒక పార్టీ గుర్తుపైన ఎమ్మెల్యేగా గెలిచి, మరో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేయడం సాధ్యమా? ఇలా చేస్తే ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలను ఎదుర్కొనాల్సి వస్తుందా? అనే విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ నిబంధన అడ్డురాకుండా ఎమ్మెల్యేగా రాజీనామా చేసి, సికింద్రాబాద్‌లో పోటీకి దిగుతారా? అనే చర్చ నడుస్తోంది. మొత్తమ్మీద సికింద్రాబాద్‌లో దానంను పోటీ చేయించాలని మాత్రం కాంగ్రెస్ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.


దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రంజిత్. చిత్రంలో రేవంత్

సునీతారెడ్డి మల్కాజిగిరికి మార్పు

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పదవి ఇచ్చే విషయాన్ని కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, చేవెళ్ల నుంచి పోటీ చేయాలని భావిస్తున్న మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్పర్సన్ సునీతారెడ్డి విషయంలోనూ మరో ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెను మల్కాజిగిరి బరిలో నిలిపితే ఎలా ఉంటుంది? అని యోచిస్తోంది. ఈ విషయాన్ని సునీతా దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అడుగంటుతున్న శ్రీశైలం

» డెడ్ స్టోరేజీకి చేరువలో ప్రాజెక్టు
» ప్రస్తుతం ప్రాజెక్టులో 35 టీఎంసీల నీరే
» భగీరథ తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం
» 6 జిల్లాల్లోని 4వేల ఆవాసాలకు నీటి గండం
» మల్యాలకు లిఫ్టింగ్ ఆపకపోతే డెడ్‌స్టోరేజీకి
» వేసవిలో దప్పికతో అలమటించాల్సిందే

నాగర్‌కర్నూల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు అడుగంటుతోంది. డెడ్ స్టోరేజీకి చేరువవుతోంది. ఫలితంగా రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు తీవ్ర ముప్పు పొంచివుంది. దీనికి తోడు ఏపీ ప్రభుత్వం.. నికర జలాల కేటాయింపులు లేని మల్యాల నుంచి సాగునీటికి అవసరాల కోసం పెద్ద ఎత్తున నీటిని ఎత్తిపోస్తుండటంతో మిషన్ భగీరథ పథకానికి కటకట తప్పదని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రత్యేకించి రాష్ట్రంలోని ఆరు జిల్లాల పరిధిలోని 4వేల ఆవాసాల్లో ఏప్రిల్, మే, జూన్‌లో తాగునీటి అవసరాలకు తీవ్ర ఇబ్బందులెదురయ్యే ప్రమాదం ఏర్పడింది. శ్రీశైలం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు. గత ఏడాది జూన్ నుంచి అక్టోబరు 18 వరకు 129 టీఎంసీల వరద మాత్రమే డ్యామ్‌లోకి చేరింది. ఈ కారణంగా ఈ యేడు ఒక్క గేటు కూడా ఎత్తే పరిస్థితి లేకపోయింది. 2002-03, 2003-04, 2015-16, 2023-24లలో ఒక్క గేటు కూడా ఎత్తలేదు. అయితే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా కుడి, ఎడమ గట్లలో విద్యుదుత్పాదన చేయడం, వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకపోవడంతో అసలుకే మోసం ఏర్పడింది. శ్రీశైలం ప్రాజెక్టులో గురువారం ఉదయం 6 గంటలకు అందిన సమాచారం మేరకు 35.2273 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఏపీలోని ముచ్చుమర్రిలో పంపింగ్ ప్రక్రియను నిలిపివేసినప్పటికీ ఏపీ వైపు ఉన్న మాల్యాలలో రెండు మోటార్ల ద్వారా రోజుకు 640 క్యూసెక్కులను సాగు నీటి కోసం పంపింగ్ చేస్తున్నారు. శ్రీశైలం ఎడమవైపు ఉన్న విద్యుత్తు కేంద్రం రివర్స్ పంపింగ్‌తో నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నుంచి కూడా తాగునీటిని తీసుకునేంత నీరు లేదు. ఫలితంగా మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ప్రాంత తాగునీటి అవసరాల కోసం చేపట్టిన మిషన్ భగీరథకు నీటి కొరత ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్య ఉన్నదనే సంకేతాలను అధికారులు ముందుగానే పంపిస్తున్నారు. తెలంగాణలో మిషన్‌భగీరథ పథకానికి సంబంధించిన మెయిన్ గ్రిడ్ నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం నార్లపూర్‌లో ఉంది. ఇక్కడ నుంచి రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 4 వేల ఆవాసాలకు తాగునీరు అందాల్సి ఉంది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ వరకు తాగునీటి సరఫరా జరగాలంటే నెలకు 0.8 టీఎంసీల చొప్పున 3.2 టీఎంసీల నీరు అవసరమవుతుంది. మాల్యాలలో తక్షణం నీటి పంపింగ్ ప్రక్రియను నిలిపివేయకుంటే జలాశయంలో ఉన్న నీళ్లు డెడ్ స్టోరేజీకి చేరి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరాకు అవరోధం ఏర్పడుతుంది.



గుండెపోటుతో అత్త.. తట్టుకోలేక కోడలి మృతి


భారతమ్మ, మంగమ్మ(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 17: ఏ ఇంట్లోనైనా సరే అత్తాకోడళ్ల ప్రస్తావన వచ్చిందంటే వారి మధ్య జరిగే గొడవలే ముందుగా గుర్తుకు వస్తాయి. కానీ, ఓ ఇంట్లో మాత్రం అత్తగారి అకాల మరణాన్ని తట్టుకోలేకపోయిన కోడలు.. ఆమె వెంటే లోకాన్ని వీడింది. గంటల వ్యవధిలో అత్తాకోడళ్ల మరణించిన ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం జరిగింది. యాదగిరిగుట్ట మండలం దాతరుపల్లి మధిర పంచాయతీ పరిధి గొల్లగుడిసె గ్రామానికి చెందిన అత్తాకోడళ్లు చుక్కల భారతమ్మ(65), చుక్కల మంగమ్మ(26) గంటల తేడాలో కన్నుమూశారు. భారతమ్మకు ఇద్దరు కుమారులు కాగా మంగమ్మ చిన్న కొడుకు భార్య. అయితే, భువనగిరి మండలం రాయిగిరి గ్రామంలో ఉన్న తన తల్లి ఓ గొడవలో గాయపడడంతో పరామర్శించేందుకు భారతమ్మ శనివారం వెళ్లింది. రాత్రి అక్కడే నిద్రించింది. అయితే, ఆదివారం ఉదయం నాలుగు గంటల సమయంలో భారతమ్మ గుండెపోటుతో మరణించింది. భారతమ్మ మృతదేహాన్ని వెంటనే స్వగ్రామం గొల్లగుడిసెకు తరలించారు. అయితే, భారతమ్మ మృతదేహం వద్ద ఏడుస్తున్న మంగమ్మ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కన్నుమూసింది. గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం అలుముకుంది.


రామప్ప ఆలయం వద్ద జస్టిస్ అరాధే దంపతులు

రామప్పను సందర్శించిన హైకోర్టు చీఫ్ జస్టిస్

ములుగు, మార్చి 17: ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆదివారం కుటుంబసమేతంగా సందర్శించారు. ఆయనకు పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. చీఫ్ జస్టిస్ వెంట హైకోర్టు న్యాయమూర్తులు రాజేశ్వర్‌రావు, లక్ష్మణ్, వినోద్, నర్సింగరావు కూడా ఉన్నారు. వారంతా ఆలయంలోని రామలింగేశ్వర స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కాకతీయుల శిల్పకళా సౌందర్యాన్ని చూసి జస్టిస్ అలోక్ అరాధే అబ్బురపడ్డారు. అనంతరం జస్టిస్ అరాధే దంపతులు ములుగు సమీపంలోని గట్టమ్మతల్లిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాబు

» ప్రధాన కార్యదర్శిగా వెంకన్న


ఎస్. బాబు, ఈదర వెంకన్న

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 17: ఆర్టీసీ ఉద్యోగుల సంఘం(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శిగా ఈదరు వెంకన్న ఎన్నికయ్యారు. ఖమ్మంలో టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొత్తం 36 మందితో రాష్ట్ర కార్యనిర్వహణ సమితి ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా కె. పద్మాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ అహ్మద్ అలీ, ఉపాధ్యక్షుడిగా ఎం. వెంకట్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉప కార్యదర్శులుగా పాటి అప్పారావు, జె. రాఘవులు, ప్రచార కార్యదర్శిగా సి. శంకర్, కోశాధికారిగా జీడీ ప్రసాద్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నిజాంపేట, మార్చి 17: పొలంలో తెగిపడిన విద్యుత్ వైరు తగిలి షాక్‌తో రైతు చనిపోయిన ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. రైతు బక్కోళ్ల మల్లేశం(44) గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. శనివారం రాత్రి ఈదురు గాలులకు 11 కేవీ విద్యుత్ వైరు తెగి.. పంట రక్షణ కోసం వేసిన సోలార్ కేబుల్‌పై పడింది. ఇది గమనించని మల్లేశం ఆ వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మల్లేశం ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

పరీక్ష కేంద్రంలోకి అనుమతించమనే నిబంధనను ఈ పరీక్షల్లో అమలు చేయడం లేదు. పైగా, విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ టైమ్ కల్పించారు. అంటే, షెడ్యూల్ ప్రకారం ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. గ్రేస్ టైమ్ నిబంధన ప్రకారం గం.9:35 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. రాష్ట్రంలో ఈ ఏడాది 5,08,385 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీళ్లలో 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు ఉన్నారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 2,676 కేంద్రాలను సిద్ధం చేశారు. సైన్స్ మినహా అన్ని పరీక్షలు ఉదయం 9.30-12.30 గంటల వరకు జరగనున్నాయి. సైన్స్ పరీక్ష పేపర్-1 (ఫిజికల్ సైన్స్), పేపర్-2 (బయోలాజికల్ సైన్స్)గా రెండు రోజుల పాటు ఉంటుంది. ఈ పరీక్ష ఉదయం 9.30 - 11 గంటల వరకు ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు 30వేల మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. కాగా, పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఏదైనా సాయం అవసరమైతే రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూం నంబర్‌కు 040-23230942 కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

పరీక్షల టైం టేబుల్

తేదీ	పరీక్ష/సబ్జెక్ట్	సమయం
మార్చి 18	ఫస్ట్ లాంగ్వేజ్	ఉ.9.30-12.30
మార్చి 19	సెకండ్ లాంగ్వేజ్	ఉ.9.30-12.30
మార్చి 21	ఇంగ్లీష్	ఉ.9.30-12.30
మార్చి 23	గణిత శాస్త్రం	ఉ.9.30-12.30
మార్చి 26	ఫిజికల్ సైన్స్	ఉ.9.30-11.00
మార్చి 28	బయోలాజికల్ సైన్స్	ఉ.9.30-11.00
మార్చి 30	సోషల్ స్టడీస్	ఉ.9.30-12.30

మా ఎగ్జామ్ సెంటర్ ఎక్కడ?

టెన్త్ హాల్‌టికెట్‌లో పరీక్ష కేంద్రం చిరునామాలో తికమక

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి హాల్‌టికెట్లలో ముద్రించిన కొన్ని పరీక్ష కేంద్రాల చిరునామాలు విద్యార్థులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లోని కొన్ని పరీక్ష కేంద్రాల చిరునామాలో రెండు, మూడు ప్రాంతాల పేర్లు ఉండడం అయోమయానికి దారి తీస్తుంది. సోమవారం నుంచి పరీక్షలు మొదలవుతుండడంతో పరీక్ష కేంద్రం చూసుకుందామని ఆదివారం వెళ్లిన కొందరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ అనుభవం ఎదురైంది. ఉదాహరణకు.. హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థికి గుడ్ సమరిటన్ హైస్కూల్‌ను పరీక్ష కేంద్రంగా కేటాయించారు. పరీక్ష కేంద్రం చిరునామాలో సోమాజిగూడ, శ్రీరామ్‌నగర్, యూసుఫ్‌గూడ అనే మూడు ప్రాంతాలు ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో సదరు పాఠశాల ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ఆ విద్యార్థి, తల్లిదండ్రులు నానా హైరానా పడ్డారు. ఇలానే మరికొందరు విద్యార్థులు కూడా అవస్థలు పడ్డారు. దీంతో సరైన చిరునామా ఇవ్వకపోతే విద్యార్థుల భవిష్యత్తు ఏం కావాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కాగా, సోమాజిగూడలోని గుడ్‌సమరిటన్ హైస్కూల్‌ను కొన్ని రోజుల క్రితం శ్రీరామ్‌నగర్‌కు మార్చారని, అందుకే సోమాజిగూడ, శ్రీరామ్‌నగర్ అని పెట్టామని, యూసుఫ్‌గూడకు వెళ్లే దారిలో స్కూల్ ఉండడంతో ఆ పేరును కూడా చేర్చామని విద్యాశాఖకు చెందిన ఓ అధికారి వివరణ ఇచ్చారు. ఏదేమైనా విద్యార్థులు తొలి రోజు, సోమవారం నాటి పరీక్షకు నిర్ణీత సమయం కంటే వీలైనంత ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవడం మంచిది.

కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి సుస్తీ!

(మొదటి పేజీ తరువాయి)



నిర్వహణ, ఫలితాల వెల్లడి, సర్టిఫికెట్ల జారీలో లోపాలతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దంత వైద్యుడిని ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా నియమించడం, కీలక పోస్టుల్లో పదవీ విరమణ చేసిన వారికి బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూనివర్సిటీలో సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఈ వర్సిటీని యూజీసీ డిఫాల్ట్‌లో పెట్టింది. గత ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా యూనివర్సిటీ నిర్వహణను గాలికొదిలేయడంతో అంతా గాడి తప్పిందన్న చర్చ జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వరంగల్ కేంద్రంగా కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీని 2014 సెప్టెంబరు 26న ఏర్పాటు చేస్తున్నట్లు నాటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత 2015 నవంబరు 26న మొదటి వైస్‌చాన్స్‌లర్‌గా బి.కరుణాకర్‌రెడ్డిని నియమించింది. 2016-17 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ విద్యను కాళోజీ హెల్త్ వర్సిటీ పర్యవేక్షిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 54 మెడికల్ కాలేజీలు, 14 డెంటల్ కాలేజీలు, ఆరు హోమియోపతి, రెండు చొప్పున ఆయుర్వేద, యునానీ కాలేజీలు, ఒక నేచురోపతితోపాటు 147 నర్సింగ్ బీఎస్సీ, పీజీ కాలేజీలు, 25 మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, 29 ఫిజియోథెరపీ కాలేజీలతోపాటు మొత్తం 306 వైద్య సంబంధిత కాలేజీలు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. మెడికల్ కాలేజీల్లో నోటిఫికేషన్ల నుంచి కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపులు, పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ల జారీతోపాటు అనేక పనులు ఈ యూనివర్సిటీ నుంచి జరుగుతాయి.

2016 నుంచి గాడి తప్పిన పాలన..

గత ప్రభుత్వం 2016 నుంచి హెల్త్ యూనివర్సిటీ నిర్వహణ, పర్యవేక్షణ గురించి పట్టించుకోకపోవడంతో పరిపాలన గాడి తప్పిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీలో 150 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 20 మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 15 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఒకరు రిజిస్ట్రార్ ఉన్నారు. పాలిటెక్నిక్ ట్రైనింగ్ విద్యార్థులతో కొన్ని పనులు చేయిస్తున్నారు. సిబ్బంది కొరతతో యూనివర్సిటీతోపాటు మెడికల్, నర్సింగ్ తదితర కళాశాలలపై ప్రభావం పడుతోంది. కళాశాలల్లో ప్రవేశాలు, పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ల జారీ, లోపాలు సరిదిద్దే విభాగం సక్రమంగా లేకపోవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నిర్దేశిత షెడ్యూల్‌లో పరీక్షలు నిర్వహించకపోవడం, ఫలితాలను విడుదల చేయకపోవడం లాంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వకపోవటం, సర్టిఫికెట్లలో తప్పుల సవరణ లాంటివి కూడా సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదన్న చర్చ జరుగుతోంది. దీనికితోడు పీజీ సీట్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇందుకు 2022లో జరిగిన గోల్‌మాల్ నిదర్శనంగా నిలిచింది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ చేపట్టగా.. రెండేళ్లుగా అధికార బలంతో కొందరు అధికారులు విచారణను ముందుకు సాగనివ్వడం లేదన్న ప్రచారం జరుగుతోంది.

ఒక్కరికే మూడు బాధ్యతలు..

కాళోజీ వర్సిటీలో కీలకమైన మూడు పోస్టుల్లో ఒక్కరికే బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. వరంగల్ ఎంజీఎంలో దంత వైద్య విభాగం హెచ్‌వోడీగా పనిచేస్తున్న డాక్టర్ మల్లేశ్వర్‌ను డిప్యుటేషన్‌పై హెల్త్ యూనివర్సిటీకి తీసుకువచ్చి.. ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా నియమించారు. అయితే ఎంబీబీఎస్‌తోపాటు పీజీ చేసిన వైద్యుడిని నియమించాల్సిన పోస్టులో దంత వైద్యుడిని నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఇటీవల ఫైనాన్స్ అధికారిగా కూడా మల్లేశ్వర్‌కే తాత్కాలిక బాధ్యతలు అప్పగించడం మరిన్ని విమర్శలకు తావిస్తోంది. ఇక హెల్త్ వర్సిటీ వైస్‌చాన్సలర్‌గా తొమ్మిదేళ్లుగా ఒకే ఒక్కరు కొనసాగుతున్నారు. 2015సెప్టెంబరు 26న వర్సిటీ వీసీగా డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగా.. 2019 డిసెంబరు 31 నాటికి ఆయన పదవీకాలం ముగిసింది. వర్సిటీ నిబంధనల ప్రకారం మరో ఆరు నెలల వరకు, లేదంటే కొత్త వీసీ వచ్చేవరకు పదవిలో కొనసాగే అవకాశం ఉంటుంది. కానీ, ఆ గడువు కూడా ముగిసిపోయి.. తొమ్మిదేళ్లుగా ఆయనే వీసీగా కొనసాగుతున్నారు. ఆయన రెగ్యులర్ ఉద్యోగుల నియామకంపై దృష్టి పెట్టకపోవడంతోపాటు తన సన్నిహితులను కాంట్రాక్టు పద్ధతుల్లో ఉద్యోగాల్లో నియమించుకున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా.. వర్సిటీలోని కీలకమైన డిపార్ట్‌మెంట్‌లలో ఖాళీగా ఉన్న పలు పోస్టులను ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండానే రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. డిప్యూటీ రిజిస్ట్రార్లుగా డాక్టర్ హేమంత్, డాక్టర్ రామానుజరావు, జాయింట్ రిజిస్ట్రార్లుగా డాక్టర్ రమేశ్‌కుమార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ లాంటి పోస్టుల్లోనూ చాలావరకు పదవీ విరమణ పొందిన వారినే నియమించారు. దీంతో రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ వర్సిటీని పునరావాస కేంద్రంగా మార్చారనే విమర్శలున్నాయి.

డిఫాల్ట్ జాబితాలో యూనివర్సిటీ..

కాళోజీ హెల్త్ వర్సిటీని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) డిఫాల్ట్ జాబితాలో చేర్చింది. వర్సిటీల్లో విద్యార్థుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం అంబుడ్స్‌మన్‌ను నియమించాలని 2023 ఏప్రిల్‌లో గెజిట్ విడుదల చేసినట్లు యూజీసీ పేర్కొంది. కానీ, యూనివర్సిటీ వారు పట్టించుకోలేని, పలుమార్లు గుర్తు చేసినా స్పందన లేదని తెలిపింది. డిఫాల్ట్ జాబితాలో ఉన్న తెలంగాణలోని మూడు వర్సిటీల్లో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ కూడా చేరింది. దీంతో వర్సిటీకి రావాల్సిన నిధులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. అంబుడ్స్‌మన్ ఏర్పాటు చేస్తే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వర్సిటీ, అనుబంధ కళాశాలలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదైనా చేసే అవకాశం ఉంటుంది. 2020లో పీజీ సీట్ల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరుపుతున్న ఈడీపై రాజకీయ ఒత్తిడి తీసుకవస్తున్నట్టు సమాచారం. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

'పాలమూరు'పై నిర్ణయాలన్నీ.. ట్రైబ్యునల్ తీర్పు తర్వాతే

హైదరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి ఎలాంటి నిర్ణయాలైనా.. తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రైబ్యునల్-2 తుది తీర్పు ప్రకటించిన తర్వాతేనని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది కృష్ణా జలాలపై నిర్మించే ప్రాజెక్టు అని.. కృష్ణా జలాల కేటాయింపుల అంశం ట్రైబ్యునల్ పరిధిలో ఉండడమే దీనికి కారణమని పేర్కొంది. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని జనవరి 4న సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏం చర్యలు తీసుకున్నారు? అని జర్నలిస్టు ఇనగంటి రవికుమార్ సమాచార హక్కు చట్టం కింద కేంద్రాన్ని కోరారు. దీనికి కేంద్ర జలశక్తి శాఖ జవాబిచ్చింది. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీలతో పాటు ఇతర కేటాయింపులను.. ఏపీ, తెలంగాణ మధ్య పునఃపంపిణీ చేసేందుకు జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రైబ్యునల్-2కు అదనపు విధివిధానాల (టీవోఆర్)ను జారీ చేస్తూ 2023 అక్టోబరు 10న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించింది. ట్రైబ్యునల్-2 తుది తీర్పును అమల్లోకి తెస్తూ గెజిట్ ఇచ్చిన తర్వాతే పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించిన ఏ అంశాన్నయినా పరిశీలిస్తామని స్పష్టం చేసింది.

123 అడుగుల గిన్నిస్ దోసె



బెంగళూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపొడవైన దోసెను తయారు చేసి బెంగళూరులోని ఎంటీఆర్ హోటల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చేరింది. ఎంటీఆర్ హోటల్ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శనివారం నగరంలో 123 అడుగుల పొడవైన దోసెను తయారుచేశారు. బెంగళూరులోని బొమ్మసంద్ర కిచెన్ ఫ్యాక్టరీలో 75 మంది వంట సిబ్బంది ఇందులో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎంటీఆర్ హోటల్ సీఈఓ సునయ్‌భాసిన్ మాట్లాడుతూ.. 100 అడుగుల దోసె తయారు చేయాలని భావించామని, అయితే 123 అడుగుల పొడవైన దోసెను తయారు చేశామన్నారు. ఇందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు.

కొత్త సచివాలయంలోనూ ఇక్కట్లే!

» అరకొర వసతుల మధ్యే ఉద్యోగుల విధులు
» అధికారులు ఎల్‌జీలో.. సెక్షన్లు పై అంతస్తుల్లో
» కీలక దస్త్రాలు భద్రపర్చేందుకు రికార్డు గదుల్లేవు
» జిమ్, ఆస్పత్రి, పాఠశాల వంటి సౌకర్యాలు ఏవి?



హైదరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నూతన సచివాలయంలోనూ అరకొర వసతుల మధ్యే ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఏప్రిల్ 30 నుంచి కొత్త సచివాలయంలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. అయితే, తమ అవసరాలకు తగినట్లు ఏర్పాట్లు, నిర్మాణాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. పాత సచివాలయంలో ఉన్నటువంటి సదుపాయాలు కూడా కొత్త భవనంలో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రికార్డుల నిర్వహణ నుంచి పార్కింగ్ వరకు వివిధ రకాల సమస్యలతో ఉద్యోగులను సతమతమవుతున్నారు. ఉదాహరణకు సరైన కార్యాలయాలు లేక సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, డిప్యూటీ సెక్రటరీలు లోయర్ గ్రౌండ్ (ఎల్‌జీ)లో విధులు నిర్వర్తిస్తుండగా.. వారికి సంబంధించిన సెక్షన్లు మాత్రం పై అంతస్తుల్లో ఉన్నాయి. అందులోనూ ఒకే గదిలో పలు శాఖలకు సంబంధించిన సెక్షన్లు ఉండటంతో ఫైళ్ల తారుమారై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయంలోని మూడో అంతస్తులో పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఉంటే.. ఆ శాఖ కార్యకలాపాల పర్యవేక్షణకు 13 సెక్షన్లు వేర్వేరు చోట్ల ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే అంతస్తులోని 19వ నంబరు గదిలో గిరిజన సంక్షేమం, మహిళాశిశు సంక్షేమ శాఖ, ఐటీ విభాగాల సెక్షన్లు ఉన్నాయి. ఇలా ప్రతి అంతస్తులోనూ ఇష్టానుసారం సెక్షన్లను కలిపేశారు. వివిధ శాఖలకు సంబంధించిన రికార్డులను భద్ర పరిచేందుకు పాత సచివాలయంలోని హెచ్ బ్లాక్‌లో ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. కీలక దస్త్రాలను సెంట్రల్ రికార్డు బ్యూరో(సీఆర్‌బీ) సహకారంతో భద్రపరిచే వారు. పాత సచివాలయం కూల్చివేసే సమయంలో సీఆర్‌బీని నూతన ఎమ్మెల్యే వసతి సముదాయంలోకి మార్చారు. కొత్త సచివాలయం అందుబాటులోకి వచ్చినా సీఆర్‌బీకి ఎక్కడా గది కేటాయించలేదు. కనీసం రికార్డు గదులు సైతం లేకపోవడంతో శాఖల వారీగా కీలక దస్త్రాలను భద్రపర్చడం సవాల్‌గా మారింది. అలాగే, పాత సచివాలయంలో మహిళ, పురుష ఉద్యోగులకు వేర్వేరుగా జిమ్‌లు ఉండేవి. సచివాలయం నిర్మించే సమయంలో పాత జిమ్ పరికరాలను ఎక్కడ పడేశారో ఎవరికీ తెలియదు. కొత్త సచివాలయంలోనైతే జిమ్‌ల ఊసే లేదు. గతంలో ఉద్యోగుల కోసం ఒక ఆస్పత్రి, ఉద్యోగుల పిల్లల కోసం కిండర్ గార్డెన్ పాఠశాల నిర్వహించగా.. నూతన సచివాలయంలో ఇవేవీ అందుబాటులో లేవు. ఉద్యోగుల రిక్రియేషన్‌కు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. మరోవైపు.. సచివాలయంలోని ఒక్కో అంతస్తులో రెండుచోట్ల మాత్రమే మరుగుదొడ్లను నిర్మించగా.. అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజల తాకిడి పెరగడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయంలో పార్కింగ్ సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఉద్యోగుల వాహనాలను సైతం ఎండలోనే పార్కు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్యలన్నింటిపై ఒక కమిటీని వేసి అధ్యయనం చేయించాలని, శాఖల వారీగా అవసరాలను గుర్తించి కార్యాలయాలను రీఆర్గనైజ్ చేస్తే బాగుంటుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

» 400 మందిని మోసం చేసిన యువకుడు
» రూ.10 కోట్ల వరకు దోచేశాడని ఆరోపణ
» బాధితుల్లో తెలుగు రాష్ట్రాల నిరుద్యోగులు

పీలేరు, మార్చి 17: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇస్తానంటూ మాయమాటలు చెప్పిన ఓ యువకుడిని నమ్మి తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 400 మంది నిరుద్యోగులు మోసపోయిన ఉదంతం ఆదివారం ఏపీలోని అన్నమయ్య జిల్లా పీలేరులో వెలుగు చూసింది. నిందితుడిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు ఆదివారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటన పూర్వాపరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన రెడ్డి సూర్యప్రసాద్ అలియాస్ భరత్ అనే యువకుడు తనకు హైదరాబాద్‌లో సినర్జటిక్స్ అనే ఐటీ సంస్థ ఉందని, అందులో ఉద్యోగాల కోసం ఉద్యోగార్థులు కావాలని ఆన్‌లైన్‌లోని పలు కన్సల్టెన్సీలను 8 నెలల క్రితం సంప్రదించాడు. ఆ కన్సల్టెన్సీల నిర్వాహకులు తనకు పంపిన నిరుద్యోగుల బయోడేటాల ఆధారంగా వారిని సంప్రదించి, తన సంస్థలో ఆన్‌లైన్‌లో పనిచేసే ఉద్యోగాలు ఉన్నాయని, డిపాజిట్‌గా కొంత సొమ్ము చెల్లిస్తే నెలకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు జీతాలు చెల్లిస్తామని ఆశ చూపాడు. దీంతో ఏపీలోని అనంతపురం, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, కడప, గుంటూరు, తెలంగాణలోని హైదరాబాదు ప్రాంతాలకు చెందిన కొంత మంది డబ్బులు చెల్లించి ఉద్యోగాలు పొందారు. మొదటి రెండు నెలలు సరిగ్గా జీతాలు చెల్లించడంతో అటు కన్సల్టెన్సీ నిర్వాహకులు, ఇటు ఉద్యోగాలు పొందిన వారు.. తమ బంధువులు, స్నేహితులు, పరిచయస్థులు, తోటి నిరుద్యోగులకు చెప్పి డబ్బు చెల్లించి ఆఫర్ లెటర్లు పొందారు. సాధారణ ఐటీ సంస్థల్లో ఉండే విధంగా అన్ని లాంఛనాలు పాటించడంతో అతడిపై మొదట్లో ఎవరికీ అనుమానం రాలేదు. అలా రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 400 మంది వద్ద.. ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వరకు వసూలు చేశాడు. రెండు నెలల తరువాత జీతాల చెల్లింపులో ఆలస్యం జరగడం, పలుమార్లు ఫోను చేసినా అతడు స్పందించకపోవడంతో అనుమానం మొదలైంది. తాము డబ్బులు వేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా పీలేరుకు చెందిన రెడ్డి సూర్యప్రసాద్ అలియాస్ భరత్‌గా గుర్తించారు. ఆదివారం నుంచి అతడు పత్తాలేకుండాపోయాడు. ఫోను చేసినా స్పందించడం లేదని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, తమ చుట్టూ జులాయిగా తిరుగుతున్న కుర్రాడు ఉద్యోగాల పేరుతో సుమారు 400 మందిని మోసం చేసినట్లు తెలియడంతో బండ్లవంక, తిరుపతి రోడ్డు ప్రాంతాల్లోని స్థానికులు నోరెళ్లబెట్టారు.

డీహెచ్‌పై విచారణ?

(మొదటి పేజీ తరువాయి)

సూపరింటెండెంట్, సూర్యాపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను మార్చారు. త్వరలో నిజామాబాద్ బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌ను మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆ సూపరింటెండెంట్ తనకున్న పలుకుబడితో బదిలీని తాత్కాలికంగా ఆపివేయించుకున్నట్లు వైద్య వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సదరు సూపరింటెండెంట్ ఇద్దరూ ఎంబీబీఎస్‌లో క్లాస్‌మేట్స్ అని, అందుకే ఆమె బదిలీ ఆగిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఎంఎన్‌జే ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలతను సర్కారు రెండు రోజుల క్రితం బదిలీ సూర్యాపేట బదిలీ చేసింది. 'ఇండియా టుడే' వెల్లడించిన ఇండియన్ టాప్ డాక్టర్ల జాబితాలో చోటుసంపాదించుకున్న వనపర్తి బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ కుమార్‌ను సర్కారు ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించింది. వాస్తవానికి ఎంతో సీనియర్ అయిన కుమార్‌కు గత డీఎంఈ రమేశ్‌రెడ్డి కావాలనే తీవ్ర అన్యాయం చేశారన్న ప్రచారం ఉంది. డీఎంఈ కావాల్సిన ఆయన్ను తొక్కి పెట్టేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే సర్కారు ఆయనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలనే ఉద్దేశంతో ఉస్మానియా ప్రిన్సిపాల్‌గా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత సమూల మార్పులు చేపట్టే అవకాశం ఉన్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి.

విచారణ తర్వాత చర్యలు!

డిప్యుటేషన్ ఎక్స్‌టెన్షన్ కోసం ప్రస్తుతం ప్రజారోగ్య సంచాలకులుగా ఉన్న రవీంద్రనాయక్‌కు, 'రిలీవింగ్' కోసం మెదక్ జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందికి డబ్బులు ఇచ్చానని ఓ ఉద్యోగిని మరో అధికారితో మాట్లాడిన ఆడియో టేపు గత నెలలో బయటకొచ్చిన సంగతి తెలిసిందే. దాంతో డీహెచ్ ఆ ఉద్యోగినిని సస్పెండ్ చేశారు. అయితే ఆ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై సర్కారు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే లంచం ఇచ్చానన్న ఆ ఉద్యోగిని ఏసీబీ అధికారులు విచారణ చేసినట్లు తెలుస్తోంది. డీహెచ్‌కు లంచం ఇచ్చినట్లు ఆ ఆడియోలో ఉండటంతో ఈ మొత్తం వ్యవహారంపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారితో విచారణ జరిపించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. విచారణ నివేదిక అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

డీఎంహెచ్‌వోల మార్పు

మరోవైపు పలువురు డీఎంహెచ్‌వోలను సర్కారు మార్చింది. డిప్యుటేషన్ల విషయంలో పెద్దయెత్తున అక్రమాలు జరుగుతున్నట్లు గత నెల 26 'ఆంధ్రజ్యోతి' కథనం ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం ఆరా తీసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో పాటు మరికొందర్ని మార్చింది. జనగాం డీఎంహెచ్‌వో ఏసీబీకి చిక్కడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జిని నియమించింది. సూర్యాపేట డీఎంహెచ్‌వోను బదిలీ చేసి మహబూబాబాద్‌కు పంపింది. సిద్దిపేట డీఎంహెచ్‌వో కాశీనాథ్‌ను తప్పించింది. ప్రస్తుతం ఖైరతాబాద్ జోన్ డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌కు సిద్దిపేట డీఎంహెచ్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మెదక్ డీఎంహెచ్‌వో చందునాయక్‌ను తప్పించి, ఆ స్థానంలో డాక్టర్ శ్రీరామ్‌ను నియమించింది. తమపై కచ్చితంగా వేటు పడుతుందనుకున్న డీఎంహెచ్‌వోలు కొందరు ముందుగా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. తమ బదిలీని ఆపేందుకు వైద్యశాఖలో 'అమ్యామ్యాలు' ముట్టజెప్పినట్లు వైద్య వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దక్షిణ తెలంగాణకు చెందిన ఓ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తనను కదల్చకుండా ఉండేందుకు లక్షల్లో చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో ఓ జిల్లాకు చెందిన డీఎంహెచ్‌వోపై తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నా ఆయన బదిలీ ఆగిపోయింది. ఆయన కూడా భారీగా ముడుపులు అందజేసినట్లు ఆ జిల్లా వైద్య సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.


హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద టాటా గ్రూప్‌నకు చెందిన తనీరా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'శారీ రన్' నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి జెండా ఊపి ప్రారంభించారు. రన్‌లో పాల్గొన్న వారితో సెల్ఫీ తీసుకున్నారు.

కవితపై ప్రశ్నల వర్షం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. కవిత వాంగ్మూలాన్ని ఈడీ అధికారులు రికార్డు చేశారు. కాగా.. కస్టడీలో కవితను రోజూ కుటుంబ సభ్యులు కలిసేందుకు కోర్టు అనుమతించడంతో ఆమె భర్త అనిల్‌కుమార్, కేటీఆర్, హరీశ్‌రావు ఆదివారం సాయంత్రం ఈడీ కార్యాలయం వద్దకు వచ్చారు. వారి వెంట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, జీవన్ రెడ్డి, కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు ఉన్నారు. అయితే అధికారులు అనిల్, కేటీఆర్, హరీశ్‌ను మాత్రమే లోనికి అనుమతించారు. వారు కవితతో గంటన్నరకు పైగా భేటీ అయ్యారు. అధికారుల దర్యాప్తు తీరు గురించి వారు కవిత వద్ద ఆరా తీసినట్లు సమాచారం. అలాగే.. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే ఆమెను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ సోమవారం పిటిషన్ వేసే అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. కానీ, గతంలో దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుండడంతో అదేరోజు కోర్టు దృష్టికి తీసుకెళితే సరిపోతుందన్న అభిప్రాయానికి వారు వచ్చినట్లు సమాచారం. భేటీ ముగిసిన అనంతరం రాత్రి 8 గంటల సమయంలో వారు బయటికి వచ్చి.. మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.